ISSN No : 2581-7477

# సాహిత్య ప్రస్థానం

Sahitya Prasthanam

సంపుటి - 3 సంచిక - 11 ఆగస్టు 2022 కృష్టి పేజీలు 68 వెల రూ. 20



సాహితీప్రవంతి


నేల మీద తిరిగే మేఘాలు..  చేలల్లో తిరుగాడే విహంగాలు...
ఫోటో : నేత

సాహిత్య ప్రస్థానం
ఆగస్టు 2022
సంపుటి : 3 సంచిక : 11

# ఆజాదీ ... అప్రమత్తం!

దేశంలో వ్యక్తులకూ, వ్యవస్థలకు కూడా స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు హరించబడుతున్న సమయంలో ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ హడావుడి సాగుతున్నది. *దేశమంటే మట్టి కాదోయ్.. దేశమంటే మనుషులోయ్* అన్నట్టు దేశ ప్రజల హక్కులు, అవస్థలతో నిమిత్తం లేకుండా ప్రధాని మోడీ హయాంలో భారతదేశం విశ్వగురువుగా ఆవిర్భవిస్తోందనే మోత మోగుతున్నది. ఈ ఉత్సవానికి పతాకాలు కూడా దిగుమతి చేసుకుంటున్నామంటే ప్రగతి ఎక్కడనే ప్రశ్న కూడా ఎదురైంది. స్వాతంత్ర్య పోరాటంలోనూ తర్వాతా ప్రజాజీవితంలో ముఖ్య పాత్ర వహించిన రాజకీయశక్తులు,పత్రికలూ, సంస్థలపై ఏదో ఒక పేరుతో ఏకపక్షంగా దాడులూ కేసులూ అరెస్టులూ జరుగుతున్నాయి. ప్రతిపక్ష ఎంపిలూ ముఖ్యమంత్రులూ మంత్రులు కూడా ఎప్పుడు ఏమవుతుందో తెలియని స్థితిలో పడిపోతున్నారు. మరోవైపున కొన్ని దర్యాప్తు సంస్థలు ఉన్నఫలాన దాడి చేయడం రాజ్యాంగ బద్ధమేనని అత్యున్నత న్యాయస్థానం తీర్పునిస్తున్నది. పత్రికలలో ఛానళ్లలో ప్రచారాలు ప్రసారాలకు గాను అనధికారసెన్సారింగ్ తరహాలో తాఖీదులు ఇచ్చి క్షమాపణ చెప్పించడంచ,కేసులు మోపడం జరుగుతున్నది. జాతీయ చిహ్నంలో సింహాలను గంభీరంగా కాకుండా క్రోధంగా మార్చిన అశోక చక్రం పార్లమెంటుపై ప్రతిష్టించారు. ప్రభుత్వాలపై విమర్శలు చేసినందుకు, అవాంఛనీయ మతోన్మాద పోకడలకు నిరంకుశ ధోరణులను ప్రశ్నిస్తున్నందుకు ఎందరో మేధావులు, రచయితలు, హక్కుల ఉద్యమకారులు, పాత్రికేయులు జైళ్లలోనే స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకొంటున్నారు. స్వాతంత్ర్య దినోత్సవ యాభయ్యవ ఉత్సవాలు జరిగినప్పుడు రాజ్యాంగం తిరగదోడే ప్రయత్నం చూశాం. ఇప్పుడు 75వ వార్షికోత్సవ తరుణాన పైకి ఏమీ చెప్పకుండానే ఆ రాజ్యాంగాన్ని తలకిందులు చేయడం చూస్తున్నాం.

స్వతంత్ర పోరాటంతో ఏ సంబంధం లేని రాజకీయ సామాజిక సంస్థలు దానికి తామే గుత్తేదార్లమైనట్టు ప్రవర్తించడం ఇప్పుడు నిత్యకృత్యమైంది. మొదటి జాతీయ పార్టీ అయిన కాంగ్రెస్‌లో తర్వాత ఆవిర్భవించిన కమ్యూనిస్టు పార్టీలో వేలాది మంది నేతలు, యోధులు అనేక విధాల త్యాగాలు చేశారు. ప్రాణాలర్పించారు. నాటి కాంగ్రెస్ పేరే చెప్పుకుంటున్నా అల్లూరి సీతారామరాజు,భగత్‌సింగ్ నుంచి నేతాజీ వరకూ ఎన్నో స్రవంతులూ శ్రేణులూ స్వాతంత్రం కోసం భిన్న మార్గాలలో పోరాడాయి. అదే సమయంలో పుట్టిన ఆరెస్సెస్ వంటి సంస్థలకు చెప్పుకోవడానికి కూడా అలాంటి నేపథ్యం లేదు. వారి వ్యవస్థాపకులు కూడా బ్రిటిష్ వారికంటే మొఘలాయిలు ప్రధాన శత్రువులని ప్రచారం చేసిన వారే. వారికి ప్రేరకుడైన వి.డి.సావర్కర్ బ్రిటిష్ వారి దయాభిక్షతో విడుదల చేయించుకున్న వ్యక్తి. జాతిపిత గాంధీజీ మత సామరస్య సందేశం గిట్టక నిలువునా కాల్చి చంపిన నాథూరాం గాడ్సేకు ఆయన గురువు. లోగడవాజ్‌పేయి హయాంలో సావర్కర్ విగ్రహం పార్లమెంటులో ప్రతిష్టించగా ఇప్పుడు మోడీ హయాం వచ్చేసరికి ఆయన కూడా జాతిపితేనన్నట్టు చిత్రిస్తున్నారు. గాంధీజీని ఏ పరిస్థితుల్లో గాడ్సే హత్య చేశాడో వాంగ్మూలంలో చెప్పిన విషయాన్ని ప్రశంసించే విధంగా చిత్రాలు తీస్తున్నారు.గాంధీ గారి పేరును స్వచ్ఛభారత్‌కే పరిమితం చేసిన సర్కారు.ఆయన బొమ్మ పెట్టుకుని మరీ వూడ్చిపారేసింది. గాంధీజీ ప్రాణాలర్పించిన మత సామరస్య సందేశానికి పూర్తి విరుద్ధమైన పనులే చేస్తున్నది. స్వచ్ఛభారత్ అంటూ కక్షభారత్ తీసుకొచ్చింది. అమృతోత్సవాలను మొదలుపెట్టినపుడు గాంధీజీ చిత్రానికి ఏమాత్రం ప్రాధాన్యత లభించకపోగా మరుగుపడిన వీరులను పైకి తేవడంపై కేంద్రీకరిస్తున్నామనిసమర్థించుకుంటున్నారు. రాజమౌళి ఆర్‌ఆర్‌ఆర్ చిత్రంలో దేశభక్తి గీతంలో గాంధీ, నెహ్రూల ఫోటోలు మమాయమవడం, ఏదో సమర్థించుకున్న ఆ కథకుడిని తర్వాత రాజ్యసభకు నామినేట్ చేయబడటం యాదృచ్ఛికం కాదు. సర్దార్ పటేల్‌ను ముందుకు తచ్చి గాంధీ, నెహ్రూఅ పాత్రను వక్రీకరించడం చరిత్ర స్ఫూర్తికి విరుద్ధం. గాంధీజీ హత్య సమయంలో ఆరెస్సెస్‌పై నిషేధం విధించిందీ పటేలే. తమ చరిత్రలో ఎవరూ స్వాతంత్ర్య యోధులు లేరు గనక కేంద్ర పాలకులు ఆయనను హైజాక్ చేస్తున్నారు. అక్కడ పటేల్ నుంచి ఇక్కడ అల్లూరి సీతారామరాజు వరకూ, హైదరాబాద్‌లో పోలీసు చర్య ద్వారా విలీనం వరకూ అదే తప్పుకథనం చెబుతూ మన కళ్ల ముందే చరిత్ర పాఠం మార్చేస్తున్నారు. పావు శతాబ్దంగా ఇదే చెప్పడం పెరుగుతున్న తరాలలో తప్పు భావనలు ప్రతిష్టిస్తున్నది.

మతాల మధ్య మరీ ముఖ్యంగా హిందూ, ముస్లింల మధ్య విభజనను పెంచే విద్వేష వ్యూహం మరింతప్రమాదకరమైంది. రాజ్యాంగం అన్నిమతాలకు సమాన హక్కులతో పాటు అల్ప సంఖ్యాకులకు ప్రత్యేక సదుపాయాలు కల్పించింది. రాజకీయ అవసరాల కోసం పాలక పార్టీలు ఎప్పటికప్పుడు ఎక్కడికక్కడ అన్ని మతాలవారీ ఆకట్టుకోవడానికి లౌకికతత్వాన్ని నీరుగార్చడం వాస్తవం. దేశంలోనూ ఎక్కువ రాష్ట్రాల్లోనూ ఎక్కువ కాలం పాలించిన కాంగ్రెస్ ఈ క్రమంలో అనేక పొరబాట్లు చేసిన మాట కాదనలేనిది. అయితే వాటితో ముస్లిం జన బాహుళ్యం పాముకున్నదేమీలేదు. వారిప్పటికీ గరీబు సాబ్‌లుగానే వున్నారు గాని అమీర్లయిపోలేదు. వివక్షలూ తప్పలేదు. దేశంలో అత్యధిక మెజారిటీ హిందువులు గనక వారికి అగ్రస్థానం ఇవ్వాలనే వాదన ప్రజాస్వామ్య స్ఫూర్తికే విరుద్ధం. హిందూ ముస్లిం సిక్కు ఏ మతతత్వమైనా ప్రమాదకరమే. హిందూత్వ రాజకీయాలనూ హిందూమతాన్ని ఒకటిగాచూపే శక్తులే ఇప్పుడు రాజ్యాన్ని శాసిస్తున్న ఫలితంగానే గోరక్షణ పేరిట మానవులపై మూక హత్యలకు కారణమవుతున్నది. శివం లేదా శవం అని కొందరంటుంటే ప్రతి మసీదులో శివలింగాలు వెతకక్కర్లేదని మరికొందరు సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. అసలు ఏ ప్రార్థనాస్థలంలోనైనా ఎందుకు వెతకాలి? రాజ్యాంగంలో ప్రార్థనాస్థలాలను తిరగదోడొద్దని చెబుతున్నది. అమృతోత్సవంలో గరళంచిందే ఈధోరణులు అక్షరాలాఅధికార పరివారం నుంచేరావడం అసలైన ముప్పు.

ఇవన్నీ ముదిరి మనుషుల వేషభాషలపైనా ఆహార విహారాలపైనా ఆంక్షలకు దారితీయడం అత్యంత ఆందోళనకరం. ఇది ముస్లిములనే గాక ఇతర మతాలనూ ఆఖరుకు హిందూ మతంలోనే అణగారిన వర్గాలుగా వున్న దళితులు వెనకబడిన వారిని, కొండకోనల్లో పుట్టిన గిరిజనులను పక్కకు నెడుతుంది. ఆదివాసి మహిళద్రౌపది ముర్మును రాష్ట్రపతిగా చేసిన తర్వాత రాష్ట్రపతి భవన్‌లో మాంసాహారమా శాకాహారమా అంటూ కథనాలు వివరణల దాకా వచ్చింది. అఖండ భారత్ సిద్ధాంతం ఆచరణలో ఒకే దేశం ఒకే మతం ఒకే పార్టీ ఒకే మోడీగా మారిపోయింది. రాష్ట్రాల ఉనికినే తోసిపుచ్చి, కేంద్రీకృత నిర్ణయాలకు దారితీస్తున్నది. నిరంతర అప్రమత్తతే స్వాతంత్రానికి మూల్యం అంటారు. 1975లో ఇందిరాగాంధీ ఎమర్జన్సీ దానికి వచ్చిన అతి పెద్దముప్పు వచ్చినాప్రజలు ఓడించి ప్రజాస్వామ్యంకాపాడుకున్నారు. ఇప్పుడు అప్రకటిత ఎమర్జన్సీపైనా అదే విధమైన పోరాటం అనివార్యం. మతతత్వంవైపు ఈకార్పొరేట్ చోదిత మతతత్వపూరితవిధానాలకుతోడుఅలీన విధానం వదిలిపెట్టి మరింతగా అమెరికా సామ్రాజ్యవాదానికీ లోబడిపోవడం సార్వభౌమత్వానికీ ముప్పు అవుతోంది. ఎన్నికల కమిషన్, సుప్రీంకోర్టు, పార్లమెంటు, కాగ్ తదితరాల స్వయం ప్రతిపత్తికీ ప్రణాళికా సంఘం, ఫెడరలిజం, సామాజిక న్యాయంతో సహా రాజ్యాంగ విలువలన్నిటికీ ఉ ఎసరు పెట్టింది. విశాఖఖెక్కుతో ప్రభుత్వ సంస్థలన్నీ వరసగా వేలానికి పెట్టడమే గాక రూ. కోటిన్నర కోట్ల అప్పులో దేశాన్ని ముంచేసింది. ఉద్యమాలతో, రచనలతో వీటిని ప్రశ్నించేవారిని జైళ్లపాలు అవుతున్నారు. కరోనాలోనూ కరోడ్‌పతుల ఆస్తులు పదహారు లక్షల కోట్లు పెరిగితే అసంఖ్యాక భారతీయుల పరిస్థితి ఇంకా దిగజారింది. రాజ్యాంగం చెప్పిన ఆర్థికసమత ఎజెండాలోనే లేకుండా పోయింది. కనుకనేమహత్తరమైన గత పోరాట చరిత్రను సంస్మరించుకోవడంతో పాటు ఇప్పుడా స్వాతంత్ర్యాన్ని, రాజ్యాంగాన్ని, భావ స్వేచ్ఛనూ రక్షించుకోవాల్సిందిగా 75వ స్వాతంత్ర్య దినోత్సవం పిలుపునిస్తున్నది. ఇందులో అగ్రభాగాన నిలిచి అక్షరాస్త్రాలు సంధించాలని ఆశయాలకు వూపిరిపోయాలని కవులు రచయితలు సాహిత్య జీవులందరినీ ఆహ్వానిస్తున్నది.

**- తెలకపల్లి రవి**


| ప్రధాన సంపాదకుడు | సంపాదకవర్గం | బొమ్మలు |
|---|---|---|
| **తెలకపల్లి రవి** | **కె.సత్యరంజన్ ◆ కెంగార మోహన్ ◆ వొరప్రసాద్** | **తుంబలి శివాజి** |
| వర్కింగ్ ఎడిటర్ | **◆ చీకటి దివాకర్ ◆ గనారా ◆ కుమార స్వామి** | **చిదంబరం** |
| **సత్యాజీ** | *మేనేజర్ :* **కె.లక్ష్మయ్య** | |

Owned, Printed and Published by **V. Krishnaiah** 41-9 -16, 1st Floor, F-3, Ramalayam Street, Near Kalpana Prints, Krishna Lanka, Vijayawada (Urban) - 520013, Krishna District. Andhrapradesh. Printed at Sri Chaitanya Offset Printers, 29-7-36, Vishnuvardhan Rao Street, Suryaraopet, Vijayawada - 520 002, Andhrapradesh. Published at 27-30-4, M.B.Vignanakendram, 3rd Floor, Akulavari Veedhi, Governorpet, Vijayawada - 520 001, Andhrapradesh. Editor : Telakapalli Ravi

**కథలు**


చేనేత : మీనాక్షి శ్రీనివాస్ ........... 6
కడగండ్ల వాన : ధాత్రి ..................... 15
మట్టి మనుషులు : ఇనాయతుల్లా ............. 17
మళ్లీ చిగురించారు! : దొండపాటి కృష్ణ .......... 30


**కవితలు**


మహా సముద్రం : ఈదర శ్రీనివాసరెడ్డి ...... 10
ఒక వీరుడి స్ఫూర్తిపథం : శాంతిమిత్ర ............... 14
నేస్తం : డా.డివిజి శంకరరావు ... 16
బొంకుల దిబ్బ : రత్నాల బాలకృష్ణ ....... 20
చినుకుల చిరుస్పర్శ : మంజుల సూర్య ......... 21
మేఘవర్ణాలు : గరికపాటి మణీందర్ ......21
నానీలు : బి.గోవర్ధనరావు ........... 24
నవ్వుల చిల్లర విసిరి .. : చందలూరి నారాయణరావు 27
స్నేహమెంత మధురం : అనితా దావాత్ ......... 29
అంకితం : లక్ష్మీ కందిమళ్ల ......... 33
మీ చేతిని అందించండి : ఇబ్రహీం నిర్గుణ్ ......... 34
అణువణువూ ... : యామినీ దేవి కోడె ...... 34
కలల పిట్ట : లోసారి సుధాకర్ ......... 39
భ్రమ బురద : అవ్వారు శ్రీధర్ బాబు ..... 42
ఫేస్‌లెస్ : చిన్ని నారాయణ రావు .... 43
నిస్సారం : ఏటూరి నాగేంద్రరావు ... 43
కదలాల్సిన సమయం : కెంగార మోహన్ ......... 47
జీవితం : ముందుకూ వెనక్కూ : అనూరాధ ............ 47
గోదావరి విళయకేళి : అడిగోపుల వెంకటరత్నం 48
ఎర్రెర్రని అడవిపూలు :అను : డాక్టర్ జతిన్‌కుమార్ ...51
సముద్ర తీరాన పూరీ జగన్నాథుడు : నిఖిలేశ్వర్ ...... 56
నన్ను గుర్తు పట్టారా, మాస్టారూ : మొయిద శ్రీనివాసరావు ....... 57
లోకులం : సాహితీ సూర్య ............ 59
దేన్నుంచమంటావ్? : ఆది ఆంధ్ర తిప్పేస్వామి .. 60
మగ్గం విరుగుతున్న చప్పుడు : వైష్ణవి శ్రీ ................. 60


**వ్యాసాలు**


సంపాదకీయం : అమృత్ మహోత్సవ్‌లో ఆజాదీకై అప్రమత్తం
– తెలకపల్లి రవి ...................... 3
స్వాతంత్ర్యోద్యమ సమరాంగణంలో సాహిత్య వికాసం
– సత్యాజీ .......................... 11
స్వరాజ్య సమరంలో తెలుగు కవులు
– ఎస్‌ఆర్ పృథ్వి ...................... 22
అప్రమత్తత, బాధ్యత కలగలిసిన దు:ఖం
– సాంబమూర్తి లండ ................ 24
కవిత్వం విలువ చూపిన ప్రాణదీపం
– డా. అమ్మిన శ్రీనివాసరాజు ..... 28
సాహితీ ప్రజ్ఞ .................................................. 35
అనుభవ గాథ .. వీరయ్య కథ – విఎంకె లక్ష్మణరావు ... 36
అరచేతి పువ్వుబువ్వ ఆరగిద్దామా?
– పిల్లా తిరుపతిరావు ............ 40
ఈ ఒక్కటీ చదివితే వంద పుస్తకాలు పరిచయం
– రాజాబాబు కంచర్ల ............ 44
మన్నుభాషలో మొలకెత్తిన కవిత్వం
– శ్రీరామ్ .......................... 49
ముఖాముఖి : సాహిత్య సృజన నిదానంగా జరగాల్సిన ప్రక్రియ
– డా.ఎన్.గోపి ................. 52
మనసును తడిమిన కవిత్వం
– పాతూరి అన్నపూర్ణ ............... 58
అభ్యుదయ కవితారత్నం అడిగోపుల
– కొండ్రెడ్డి వేంకటేశ్వరరెడ్డి ....... 61
డైరీ ......................................................... 64



ISSN No: 2581 - 7477


**సాహిత్య ప్రస్థానం మాసపత్రికను ప్రోత్సహించండి. తెలుగు భాష, సాహిత్య వికాసాలకు మీరూ తోడ్పడండి !**


:: రచనలు, చందాలు, విరాళాలు, మనీ ఆర్డర్లు, చెక్కులు, డిడిలు పంపవలసిన చిరునామా ::

సాహిత్య ప్రస్థానం, ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, తాడేపల్లి - 522501, గుంటూరు జిల్లా. ,
ఫోన్ : 0866-2577248, చందా వివరాలకు : 94900 99057, రచనలకు : 94900 99167
ఇ-మెయిల్ : ssprasthanam@gmail.com, వెబ్‌సైట్ : www.prasthanam.com

1 సంవత్సర చందా రూ. 240 ◆ 5 సంవత్సరాల చందా రూ.1000 ◆ 10 సంవత్సరాల చందా రూ. 2000

Bank A/c Details: A/c Name: PRASTHANAM, SBI, Governorpet, Vijayawada. A/c No. 52001500585,
IFSC: SBIN0020343. చెక్కులు, డిడిలపై prasthanam అని రాయగలరు.



# చేనేత

- మీనాక్షి శ్రీనివాస్
91107 23232

రెండు రోజులుగా బాగా ముసురు. సీతమ్మ పరిస్థితి కూడా అలాగే ఉంది. ఒకటే నీరసం. కాళ్ళూ, చేతులూ లాగేస్తున్నాయి. కళ్ళు పోట్లు. మసకలు పడుతున్న కళ్ళను పమిటతో ఒత్తుకుంటూ, దారాలు పోస్తోంది. రోజూ 'టక టక' అంటూ స్పీడ్‌గా వినపడే మగ్గం మొరాయిస్తూ మొరాయిస్తూ నెమ్మదిగా, నీరసంగా వినవస్తోంది.

"ఏవమ్మో! ఎంతవరకూ వచ్చిందీ! చూస్తే చడీ, చప్పుడూ లేదు." తలవంచి ఆ పాకలో అడుగుపెట్టాడు రాఘవులు.

"అయ్యా! సేతున్నా! అయిపోవస్తంది" బిత్తర చూపులు చూస్తూ అంది సీతమ్మ.

మగ్గం కేసి చూసిన రాఘవ నిశ్చేష్టుడయ్యాడు.

"ఏటిదీ! రెన్నాళ్ళ కాడ ఏడుందో, ఆడనే ఉంది. ఇట్టా అయితే నాబం నేదు. మాటచ్చేత్తాది. మాట రాడం కాదు రాయుడు బాబు అగ్గి మీన గుగ్గిలంలా మండి పడతాడు.

అయినా! నే సెప్పా కదా, అది నీ వల్ల కాదు, ఆ సేనాపతోళ్ళ గంగన్నకిత్తానంటే, కాళ్ళాయేళ్ళా పడితివి. కూతురు కాలేజ్ ఫీజ్ కట్టాల' అంటా. ఇప్పుడు సూడు, రాయుడు బాబుతో మాట. ఏటి సెయ్యాలా?"

ఇప్పుడాడిని అడిగితే ఏకంగా మునగ సెట్టు కాదు, తాటి సెట్టే ఎక్కేత్తాడు. నీ మాట యినడం నా సావుకొచ్చింది. ఈ డిజైన్ చేయడం మీ ఇద్దరికే వచ్చు. ఛ ... ఇప్పుడేటి సెయ్యాల?" చిరాకు పడిపోయి అరిచేసాడు రాఘవయ్య.

"నేదు బాబూ! ఈ రేత్రికి కూసుని ఎట్టాగైనా సేసేత్తాను. మాట రానీయను. పెళ్ళికి సాన్నాళ్ళుంది కదా బావూ! పాడు జరం, రెన్నాల్ల నుంచీ సంపుకు తింటంది." కళ్ళ వెంట కారే నీరు తుడుచుకుంటూ అంది.

అది నిస్సహాయతలోంచి వచ్చిన కన్నీరని అనుకున్నాడు రాఘవయ్య. కానీ ఏళ్ళ తరబడి రేయనకా, పగలనకా చేసిన పనికి వచ్చిన ప్రతిఫలం అని ఎరగడు పాపం.

"సర్లే! ఇదిగో కడాకరుగా సెబుతున్నా! నాలుగు రోజుల్లో పూర్తి సెయ్యాల్సినదే! ఇప్పటిదాకా నాలో ఉన్న మంచోడినే సూసావ్! తేడా వత్తే, జార్త!" హుంకరించి అక్కడి నుండి కదిలాడు. అప్పుడొచ్చింది సీతకు పెద్దపెట్టున దు:ఖం.

'తనేమైనా కావాలని అట్టా సేస్తుందా! గేనమొచ్చిన కాడ్నుంచీ సేస్తుంది. మేనమావని మనువాడి ఆడనే ఉంది. కూతురు పుట్టాకా, ఓ రాత్రి యేల వచ్చిన ఉప్పెన మావని అట్టుకెల్లి పోయినా, కూతురిలో మావను సూసుకుంటా, రేత్రనక, పగలనక రెక్కలు ముక్కలు సేసుకుని మగ్గం కాడ పని సేస్తా, కూతురు శాలికని మాత్రం సదివిస్తంది. అది కూడా బుద్ధిగ సదువుకుంటా, మంచిగ పెబుత్వ సాయంతోటే ఎయ్యో పెద్ద సదువులకి యెల్లింది. ఇన్నాల్లూ గుట్టుగా లాక్కొచ్చినా, ఈ మద్దెన కల్లకొచ్చినప్పటి నుంచీ మగ్గం పని మరీ కట్టమైతంది.'

"అమ్మా! లే, ఈ మందేసుకుని పడుకో! రేపు చేద్దా గాని" కూతురి మాటలతో ఆలోచనల్లోంచి బయటకొచ్చింది.

"ఎప్పుడొచ్చినావే! నీ స్నేయితురాల దగ్గరికి పోలా!" కంగారుగా అంది. రాఘవయ్య కేకలు కూతురు విందేమోనని సీత భయం. తమ కష్టాలూ, కన్నీళ్ళూ కూతురుకు తెలియడం సుతరామూ ఇష్టం లేదు.

"ఇప్పుడే వచ్చినాలే కానీ, ఈ మందులేసుకుని పోయి పడుకో" తనేమీ విననట్టే చెప్పినా, మనసు మండిపోతోంది.

"అట్ట కాదులే, కాసేపు సేసి పడుకుంటా! అసలే సాతవ్వటం లేదు." దిగులుగా అంటూ పని మొదలెట్టబోయింది.

"అమ్మా! లే, రేపు చేద్దా అంటున్నానా! అన్నం తిన్నాకా ఈ మందులు వేసుకున్నావా! "ఓ చేత్తో మందు బిళ్ళ, మరో చేత్తో నీళ్ళ గ్లాసు పట్టుకున్న కూతురిని చూస్తూనే మళ్ళీ దు:ఖం ముంచుకొచ్చింది సీతమ్మకు.

'ఇన్నేళ్ళ కట్టం తీరబయ్యేటేళ ఇదేటిదీ, పిల్లది ఫీజు కట్ట కుంటే ఇన్నేల్ల కట్టం గంగలో కల్దా! పోనీ ఇంట్లో ఏదైనా వస్తువు అమ్మేసిద్దామన్నా, ఇగ అమ్మదానికేటుందీ, ఈ పాత మగ్గం తప్ప. పోనీ మగ్గం అమ్మేస్తే! అయ్యో ఎట్టా! అయినా ఇప్పుడు ఈ పాత మగ్గం కొని నేయబోయెదెవులు!'

"అమ్మా! మందేసుకో అంటుంటే ఏటా ఆలోచన! అన్నీ అవే జరుగుతాయి, బెంగపెట్టుకోక ఈ మందేసుకుని వచ్చి పడుకో, కళ్ళలో మందు వేస్తా!" కొంచెం గట్టిగానే అంది కూతురు.

లేచింది సీతమ్మ. కూతురు ఇచ్చిన గోలీలు మింగి, పడుకుంది. తల్లి కళ్ళలో మందు వేసి, పక్కనే కూర్చుంది.

"అమ్మా! అన్నీ చక్కగా జరుగుతాయి. పరీక్షలయితే నా చదువు అయిపోయి, మంచి ఉద్యోగమే వస్తుంది. నువ్వు అదంతా చూడాలంటే నీ కళ్ళు, ఆరోగ్యం బాగుండాలి కదా! నువ్వు ప్రశాంతంగా పడుకో" కూతురి మాటలు జోల పాటలే అయ్యాయి సీతమ్మకు. అప్పటికే శాలిక ఇచ్చిన నిద్రమాత్ర తన ప్రభావం చూపిస్తుండగా నిద్రకొరిగింది.

తల్లి పూర్తిగా నిద్ర పోయింది అనుకున్నాక శాలిక ఓ సారి ఎండి ఒరుగైపోయిన తల్లి నుదుట ముద్దు పెట్టుకుని, 'సారీ అమ్మా! నా చదువు గోలలో పడి నిన్ను పట్టించుకోలేకపోయాను. ఇక నుంచీ నిన్ను ఈ పని చేయనివ్వను,' అనుకుంటూ గోడ మీద ఉన్న భద్రావతీ సమేత భావనా ఋషికి దండం పెట్టుకుని, మగ్గం ముందు కూర్చుంది.

ఎదురుగా వేలాడుతున్న డిజైన్ బాగా పరికించింది. తదేకంగా చూసిన ఆ డిజైన్ శాలిక మెదడులో నిక్షిప్తమై పోయింది. మృదువుగా మెరిసిపోతున్న పడుగును స్పృశించింది. పేకను పట్టుకు చూసి పనిలో నిమగ్నమైంది. ప్రశాంతంగా ఉన్న ఆ నిశిలో శృతి బద్ధంగా వినవస్తున్న ఆ శబ్దం క్రమేణా స్పీడ్ అందుకుంది.

మరో ధ్యాస లేనట్టు దీక్షగా అలా ఎక్కడో కోడి కూసేవరకూ చేస్తూనే ఉంది. సుమారుగా సగం దాకా నేసిన చీరను పరీక్షగా చూసిన ఆమె ముఖంలో నవ్వు మెరిసింది.

అక్కడికి ఆపేసి లేచి, ముఖం కడుక్కుని, కళ్ళలో రిఫ్రెష్ టియర్స్ వేసుకుని తల్లి పక్కనే నిద్రకుపక్రమించింది.

□□□

"సీతమ్మా... ఓ సీతమ్మో! బారెడు పొద్దెక్కినా నెగనేదేటి? పానం గాని బాగలేదా ఏటి?" అంటూ రేకు తలుపు దబదబ బాదింది పక్క గుడిశ పార్వతి.

మాటలు చెవికెక్కలేదుగానీ, చప్పుడుకు మెలకువ వచ్చింది సీతమ్మకు. కళ్ళు విడివడకుండా బద్ధకంగా అనిపించింది.

పక్కకు తిరిగిన ఆమెకు, తన మీద ఓ చెయ్యివేసి పడుకున్న కూతురి ముఖం కనబడి, చిరునవ్వు వచ్చింది.

'లేస్తానే బంగారుతల్లి ముఖం చూసా, ఈయాలంతా సుబమే' అనుకుంటూ లేవబోయిన ఆమెకు, మళ్ళీ పార్వతి గొంతు వినబడింది. ఈసారి స్పష్టంగా మాటలూ వినబడి 'ఇదేటిదీ! ఇంత మొద్దు నిద్దరోయానా!' లేచి తలుపు తీసింది.

"ఏటి ఈయాల ఇంతసేపు పడుకున్నా! ఎప్పుడూ కోడి కంటే ముందే నెగిసేదానివి! పానం గానీ బాలేదా!" అంటూ మీద చెయ్యేసి చూసింది పార్వతి.

"ఇప్పుడు బానే ఉందే, ఏటో రేతిరే అంకపొంకాల జరం, ఓ పక్క ఒప్పుకున్న సీర పూర్తవుతలేదన్న దిగులూ!" అంటూ మగ్గం కేసి చూసిన ఆమె బిత్తర పోయింది.

"అదేటిదీ! నిన్న రేతిరికి రెండు గజాల బట్ట కూడ అవలేదు, తెల్లారే పాటికి ఇంత! అబ్బా! భలేగా వచ్చింది! నా బాద సూడనేక ఆ సామి గాని వచ్చి నేసాడా!" ఆనందంతో మాట తడబడింది.

"నీ ముకం! రేతిరి తెల్లార్లూ లైట్ ఎలుగుతుంటే నీ కూతురు సదువుకుంటదేమో అనుకున్నా! అదే సేసుంటది, నీ బాద సూడనేక, అబ్బా! భలేగా వచ్చిందే!" చేతులు శుభ్రంగా తుడుచుకుని ముట్టుకుని చూసింది.

"ఆశ్చర్యంగా ఉంది, అదెట్టా! ఏదో అప్పుడప్పుడు అందీయడం తప్ప, అదెప్పుడూ మగ్గమే ఎక్కనేదు, మరి ఇంత బాగా ఎలా నేసిందబ్బా!" ఆశ్చర్యం, అనుమానం కలబోసి వచ్చిందా మాట సీతమ్మ నోట.

"సెప్పిల్లకి ఈత నేర్పేదెవులూ! అమ్మ, అయ్య నేతగాళ్ళైతే రాక ఏడికి పోతదీ! అది మన రగతంలోనే వచ్చుద్ది." ముఖం చింకి చేటంత చేసుకుని అంది పార్వతి.

"పిచ్చి పిల్ల రేతిరంతా సేస్తనే ఉంది గామోసు! అందుకే నాలుగు నాళ్ళు పట్టే పని ఒక్క రేత్రికే అయింది. అయినా తెల్లార్లూ మగ్గం సప్పుడున్నా నాకు తెలివి రాపోడం ఏటిది? యిద్దూరంగా ఉంది." ఆశ్చర్యంగా అంది సీతమ్మ.

"పానం సొమ్మసిల్లుంటది, నేకుంటే సీమ సిటుక్కుమన్నా లేస్తావు గదేటి. పోనీలే ఇంక బెంగ పెట్టుకోకు, రాఘవ బాబుకు అన్న పెకారం సీర అందిచ్చేయెచ్చు. సరి సరి.. నే నెల్తా! ఇయ్యాల పొలంలో నారు మళ్ళున్నాయి." వెడుతూ అంది పార్వతి.

"ఏటో! ఇయ్యాల రేపు తాతల నాటి నుండీ వస్తున్న నేత మానేసి, ఇలా కూలికి పోడమేటో!" నిట్టూర్చింది సీతమ్మ.

"మరేటి సేత్తాం, కూలికి పోతే, ఎంతో కొంత రోజుకు కల్ల సూత్తన్నాం. కడుపుకింత తినగలుగుతున్నాం. అదే నేత పని సేత్తే సీరకి ఎయ్యో, రెండేలో! ఎప్పుడన్నా పట్టు సీరలకైతే నాలుగైదు ఏలు. రోజంతా కంట్లో కన్నెట్టుకు సేత్తే పదేను, యిరవై నాళ్ళకో సీర సెయ్యగలం. నెలకు రెండు సీరలు నేత్తే అబ్బరం. కీల్లరిగి, కళ్ళు పోడం తప్పితే ఒరిగేదేముంది. మన కట్టంతో ఆల్లు మాత్రం మేడలూ, మిద్దెలూ కడతన్నారు! నీదంతా యెర్రిబాగులతనం."

'కులవృత్తి మానుకోని ఇలా కూలోళ్ళలా మారడం ఏటి!' అంటావు. కూడెట్టని కులవృత్తిని పట్టుకుని ఎన్నాళ్ళని పాకులాడతాం సెప్పు? అయినా ఇదెప్పుడూ ఉండేదే, నీ మాట నీదే గానీ యింటావా, పెడతావా నా యెర్రి గాని.

ఇదిగో ఓ మాట సెపుతున్నా ఇనుకో, పిల్లది బంగారంలా సదువుకుంది, దాన్నీ రొంపిలోకి లాక్కు, ఇప్పుడు సీర బాగా నేసింది గదాని. ఈ మాటైనా ఇనుకో! సర్లే నేనెల్తన్నా!" వెళ్ళిపోయింది.

'ఏటో 'కూల్ది' అనిపించుకోనాకి నామోషి అనిపించి కానీ, ఈ పనిలో ఉన్న కట్టనట్టాలు తెలకా! ఆరునూరైనా సరే పిల్లని మాత్రం ఇందులో దిగనీకూడదు. ఇప్పుడు రాఘవబాబు దీని పనితనం సూసాడంటే కచ్చితంగా బలవంతం సేత్తాడు. పాము సావకుండా, కర్రా యిరక్కుండా ఎట్టానో నెమ్మదిగ బయట పడాల. పెద్దోల్లతో తగూ, సావుని ఎతుక్కుంటా పోడమే! ఏటో ఈ మాయదారి జొరం ఇప్పుడే రావాలా! సరే సూద్దాం" లేచి కాలకృత్యాలు తీర్చుకుని, కాస్త అన్నం, కూరా వండేసి మగ్గం ముందు కూర్చుంది.

అప్పటికే అలారం మోగడంతో లేచిన శాలిక తల్లితో..

"అమ్మా! పావుగంటలో నేను రెడీ అయి వస్తా! నువ్వు లే. ఏటి! సెపుతుంటే నీక్కాదూ!" తల్లి దగ్గరకు వస్తూ అంది.

"అది గాదే అమ్మలూ! ఎప్పుడూ మగ్గం ఎక్కలే, ఇంత బాగా, తొరగా ఎట్టా సేసావే!" విస్మయంగా అంది సీతమ్మ.

"అమ్మా! నా చదువే అది, పైగా నువ్వు చెయ్యనీలేదు గానీ, నాన్నున్నప్పుడు  నా చేత చేయించేవాడు, నే సరదా పడితే. అది మన రక్తంలోనే ఉంటుందమ్మా! దాన్నే జీన్స్ అంటారు. ఇంక నీ ప్రశ్నలు ఆపి, అక్కడ నుంచి లే. నేను ఫ్రెష్ అయి రాగానే ఇద్దరం తినేసి కూర్చుద్దాం. నువ్వలా పక్కన కూర్చో నే చేసేస్తా. రేపటికల్లా అయిపోతుంది సరేనా!" బయట ఉన్న తడికల గదిలో కెళ్ళి, పళ్ళు తోమి, స్నానం చేసి అన్నట్టే పది నిముషాల్లో వచ్చేసింది.  ముచ్చటగా చూస్తూ మురిసిపోయింది సీతమ్మ.

లేచి కంచాలు పెట్టి ఇద్దరికీ వడ్డించింది. గబగబా తినేసి, తల్లికి మందులు ఇచ్చి, మగ్గం ముందు కూర్చుంది. ఆ వడుపూ, వేగం చూసిన సీతమ్మ అలా చూస్తూ ఉండిపోయింది కాసేపు. తరువాత లేచి వెళ్ళి రంగుల్లో నానబెట్టిన నూలు దారాలు తీసి ఆరబెట్టడం మొదలు పెట్టింది. అలా సాయంత్రం వరకూ ఆపకుండా నేస్తూనే ఉంది శాలిక.

అలా రెండు రోజులూ రాత్రనక, పగలనక చేసి చీర పూర్తి చేసేసింది., దానికి తగ్గ జాకెట్ బట్ట మీద కూడా సరిపడ డిజైన్ వర్క్ చేసిన కూతురిని కళ్ళప్పగించి చూసింది సీతమ్మ.

□□□

అన్నట్టే నాలుగురోజుల తరువాత రాఘవయ్య వచ్చేసాడు 'సీతమ్మా! అయిందా!' అనుకుంటూ.

'రండి బాబూ! కూసోండి, తెత్తాను' అంటూ మగ్గం పక్కనున్న పెట్టెలోంచి చీర కవర్ తీసింది.

కచ్చితంగా చేసి ఉండదు, చీల్చి చెండాడాలి అనుకుంటూ వచ్చిన రాఘవయ్య బిత్తరపోయాడు.

"ఏటి నేసేసావా! చోద్యంగుందే! మొన్నటికి రెండు గజాలు కూడా కాలేదు, అప్పుడే అయిపోయిందా, ఇదేటిదీ, జాగెట్టు బట్ట, మగ్గం వర్క్‌తో ... ఏటి సీతమ్మా ఇది, కనికట్టు కానీ నేర్చావా?"

"ఏదోలే బాబూ! అవసరం అట్టాటిదీ! మరా డబ్బులిస్తే" కూతురు నేసిందని చెప్పడం ఇష్టం లేని సీతమ్మ తొందర సేసింది.

"ఇత్తా! ఇప్పుడు తేనేదు, నేనేడకి పోతా! మరొస్తా!" సంతృప్తిగా చేతిలో ఉన్న చీర చూసుకుంటూ అన్నాడు.

సీతమ్మ భయంభయంగా లోపలికి చూసింది, కూతురు ఎక్కడ వస్తుందో అన్నట్టు... "బాబూ! డబ్బు సానా అవసరం. ఫీజు కట్టాల. అందుకే జొరంగా ఉన్నా లెక్క సేయకుండా మగ్గం ఏసింది" తడబడుతూ అంది.

"ఓసోసి... సాయంత్రం ఇస్తానంటుని గదా!" లేచాడు.

"నమస్తే అంకుల్!" లోపలి నుంచి వచ్చిన శాలిక వినమ్రంగా అంది.

"ఏటే! ఎట్టాగున్నావ్! బాగా సదూతున్నావా! నీకోసం మీ అమ్మ రెక్కలు ముక్కలు చేసుకుంటంది" పలకరింపుగా అన్నాడు.

"అవును! అంకుల్ ఓ సారి ఆ చీర యివ్వండి, చూస్తాను." అడిగింది.

"సానా బాగా వచ్చింది, ఎప్పుడూ కంటే ఓ యెయ్యి రూపాయలు ఎక్కువే ఇస్తాలే, ఫీజ్ కట్టాలట కదా!" చీర ఇస్తూ అన్నాడు.

"అంటే ఎంత అంకుల్?" అడిగింది.

"ఎప్పుడూ పట్టు సీరలకి మూడేలు కదా, ఈసారి నాలుగిస్తాలే, అసలే ఆరోగ్యం కూడా బాలేదు కదా! నీ సదువే కాదు, కాసింత మీ అమ్మని కూడా సూసుకోవాలి మరి" హితవు పలికాడు.

"యాభై, అరవై వేలకి మీరు అమ్ముకునే ఈ చీరకు, ఇంత శ్రమపడి నేసిన మా అమ్మకి నాలుగు వేలా! కుదరదు అంకుల్, ఈ చీరకు పెట్టిన పెట్టుబడి పోనూ సుమారుగా మీకు నలభై వేలకు పైనే లాభం, న్యాయంగా అయితే పెట్టుబడి పెట్టి, మార్కెటింగ్ మీరు చూస్తున్నారు కనుక, కష్టం అమ్మది కనుక చెరి సగం అయినా యివ్వాలి. కానీ ముందే అవేవీ మాట్లాడుకోలేదు కనుక కనీసం పాతిక శాతం ఇస్తేనే మీరు ఈ చీర తీసికెళ్ళండి." మృదువుగానే చెప్పినా కచ్చితంగా ఉంది ఆ స్వరం.

"అమ్మాయ్! ఏం మాట్లాడుతున్నావ్!" కళ్ళెర్రబడ్డాయి రాఘవయ్యకు.

"న్యాయం మాట్లాడుతున్నా! ఇన్నేళ్ళ శ్రమ ఫలితం మా అమ్మకు కీళ్ళు అరిగి, కంటి చూపు మందగించింది. అయినా ఏ పూట కా పూట తినడానికే వెదుక్కోవాల్సొస్తోంది.

"ఇలా అంటున్నందుకు ఏం అనుకోకండి. మరి మీకు ఏ కష్టం లేకుండా లాభాలు, మేడలూ, మిద్దెలూ... సరే ఇప్పటి వరకూ అయిందేదో అయింది. వదిలేయండి. ఇప్పుడు ఈ చీర మాత్రం పదివేలు ఇస్తేనే మీకిచ్చేది. అది కూడా ముందుగా మా అమ్మ ఒప్పుకుంది కనుక, ఆ మాటకు కట్టుబడి..." కూల్‌గా అంది.

"ఎవరితో ఏం మాట్లాడుతున్నావో తెలుస్తోందా! నాలుగక్షరం ముక్కలొచ్చేసరికి కళ్ళు నెత్తికెక్కాయా! అయినా నీతో నాకు మాటలేంటి?" అంటూ సీతమ్మ వైపు తిరిగి..

"ఏం! నీకిది మర్యాదగా ఉందా! లేక ఇప్పుడింక నా అవసరం తీరిపోయిందా?" కళ్ళు నిప్పులు చెరుగుతుండగా అడిగాడు.

"బాబూ! అదీ ..." ఎదురు చెప్పడం రాని సీతమ్మ నీళ్ళు నములుతోంది.

"అది నా కష్టం, ఇప్పుడిస్తే పదివేలు ఇచ్చి తీసికెళ్ళండి, లేదా మీ పెట్టుబడి మీకు ఇచ్చేసి, మేమే అమ్ముకుంటాం." నిదానంగా చెప్పిన ఆ మాటలకు రాఘవయ్య అగ్నిపర్వతమే అయ్యాడు.

"ఓహో! అంతాదాకా వచ్చిందా! సరే ఎక్కడ, ఎలా అమ్ముతారో సూస్తా! దొంగతనం కేసు బనాయించి మిమ్మల్ని లోపల యెట్టించకపోతే సూడండి. తాడూ బొంగరం లేనోళ్ళని దయ తలిస్తే, నాకే ఎదురు తిరుగుతారా!" పెద్ద పెద్ద అంగలు వేసుకుంటూ వెళ్ళిపోయాడు రాఘవయ్య.

□□□

సీతమ్మ భయంతో ఏడుస్తూ కూర్చుంది. రాఘవయ్యతో గొడవ పెట్టుకుంటే ఏం జరుగుతుందో తెలుసు. ఇప్పుడీ పిల్ల పోయిపోయి ఆయనతో పెట్టుకుంది. ఏమవుతుందో!' దిగులుగా కూర్చుంది.

శాలిక ఆ చీర తీసుకుని నేరుగా రాయుడిగారింటికే వెళ్ళింది. చీర చూసి అంతా చాలా మురిసిపోయారు. వెంటనే యాభై వేలు తెచ్చి చేతిలో పెడుతుండగా, రాఘవయ్య పోలీస్ ఇనస్పెక్టర్‌తో వచ్చాడు. ఆ అమ్మాయి ఆ చీర తన షాపులో దొంగిలించిందన్న అభియోగంతో.

శాలిక చెక్కుచెదర లేదు. ఆ చీర తన చేతులతో తనే స్వయంగా నేసింది అన్నది నిజం' అని నిర్భయంగా చెప్పింది.

"కాదు! ఆ పిల్ల అబద్ధం ఆడుతోంది. ఆ చీర నా షాపులోదే. మీ ఇంట్లో పెళ్ళి కోసం నేను సేనాపతోళ్ళ గంగన్నతో నేయించా, కావాలంటే ఆడినే పిలిపించి అడగండి." రాఘవయ్య రాయుడుగారితో అంటూ ఇనస్పెక్టర్ కేసి చూసాడు.

"ఏటయ్యా ఈ గందరగోళం అంతా, శుభమాని పెళ్ళింట్లో, అయినా నువ్వా చీర సీతమ్మ చేత నేయిస్తున్నానని సెప్పావుగా! ఈ పిల్ల సీతమ్మ కూతురే గదా! దొంగతనం అంటావేటి?" విసుక్కున్నాడు రాయుడు.

"అవునండి, ఈ పిల్ల చదువుకు డబ్బు కావాలనీ, పనిప్పించమనీ కాళ్ళా వేళ్ళా పడింది దీని తల్లి. తీరా ఇచ్చాకా జొరం, అదీ ఇదీ అని దొంగెత్తు వేసింది. చూస్తే తమరింట్లో పెళ్ళి దగ్గరకి వచ్చేస్తుండే, అందుకే ఇక దాని వల్ల కాదని సేనాపతులోళ్ళ గంగన్నకప్ప చెప్పా" వివరించాడు రాఘవయ్య. ఇంతలో గంగన్నను తీసుకుని ఇనస్పెక్టర్ వచ్చాడు.

"గంగన్నా! ఈ చీరనోపాలి సూడు.. ఎప్పుడన్నా సూసావా ఇట్టాటిది" అడిగాడు ఇనస్పెక్టర్.

"అయ్యబాబో! అదేటండి.. అది నేను సొయంగా నేసి నిన్ననే

గదా రాఘవయ్య బాబు కిచ్చాను. సూసేవా అంటారేటండీ!" ఆశ్చర్యం ఒలకబోసాడు గంగన్న.

"అబద్ధం, ఆ చీర నేసింది నేను. ఆ కష్టానికి నాలుగు వేలు ఇవ్వ జూపితే, కుదరదనీ కనీసం పదివేలైనా ఇస్తే కానీ మీకివ్వనంటూ, నేనే అమ్ముకుంటానని ఇక్కడకు తెచ్చాను." శాలిక కోపంగా అంది.

"ఎట్టెట్టా! రెన్నాళ్ళ కింద ఊళ్ళోకొచ్చావ్! ఈ సీర సొయంగా నువ్వు నేసావా! అసలు ఇది నేయడానికి ఎన్ని రోజులు పడుతుందో అయినా నీకెరుకా!" ఎకసెక్కంగా అడిగాడు గంగన్న.

"నీలాంటోళ్ళు ఉండబట్టే మన బతుకులిలా తగలబడ్డాయి. సరే! అది నేనే నేసాను అనడానికి నా దగ్గర బలమైన సాక్ష్యం ఉంది. మరి నీ దగ్గర అలాటిదేమైనా ఉందా!" సూటిగా అడిగింది శాలిక.

"ఏటా సాచ్చం.. పిల్లికి ఎలక సాచ్చం అన్నట్టు, నీకు మీ అమ్మ సాచ్చీకమా!" గొల్లున నవ్వాడు రాఘవయ్య.

"కాదు! ఈ చీరలో ఒక పేరు ఉంది. అదేమిటో? ఎక్కడుందో? చెప్పగలవా గంగన్న బాబాయ్!"

గతుక్కుమన్నాడు రాఘవయ్య, అయోమయంగా చూసాడు గంగన్న. ఇనస్పెక్టర్, రాయుడూ కుతూహలంగా చూసారు.

"అవును.. నేతలో పమిటంచులో కలిసిపోయి 'శాలిక' అన్న పేరు ఉంటుంది.. కావాలంటే చూడండి." నిర్భయంగా చెప్పింది. రాయుడు చీర తీసి, పరికించి చూసాడు. డిజైన్‌లో కలిసిపోయేలా అందంగా, స్పష్టంగా కనపడింది చిన్న పేరు ముచ్చటగా.

"ఏటిది రాఘవయ్యా! ఇంత బతుకూ బతికి ఇట్టా సేత్తావా!" అంటూ రాయుడు రాఘవయ్యను మందలిస్తూ గంగన్నను కొట్టినంత పని చేసాడు. ఇనస్పెక్టర్ ఇద్దరికీ వార్నింగ్ ఇచ్చి వెళ్ళిపోయాడు. రాయుడు ఆ చీరకు అరవై వేల రూపాయలు తాంబూలంలో పెట్టి మరీ ఇచ్చి మర్యాద చేసాడు శాలికకు.

□□□

శాలిక ఊర్లో ఉన్న నేతగాళ్ళనందరినీ సమావేశపరిచి వాళ్ళకు తెలియని ఎన్నో విషయాలను తెలియజేసి, ఒక సంఘం ఏర్పరచి... 'ఇకపై తమ శ్రమకు తగ్గ ఫలితం ఉండేలా మనమే చూసుకుందాం' అన్న భరోసా ఇచ్చింది.

అప్పటికే ఈ అరకొర బతుకులు బతకలేక కూలీలుగా మారిన అందరికీ నచ్చ చెప్పింది.

'ముఖ్యంగా 'చెట్టు పేరు చెప్పుకుని కాయలమ్ముకునే' వాళ్ళు ఎక్కువైపోయారు. ఎప్పటినుండో మనకున్న పేరు ప్రఖ్యాతులను అడ్డం పెట్టుకుని ఎక్కడెక్కడి చీరలో మనవిగా చెలామణి అవడం ఘోరం. అందుకే మీరు నేసే ప్రతి చీరమీదా, మీకు మాత్రమే తెలిసేలా ఏదో ఒక గుర్తో, పేరో ఏదో ఒకటి నేతలో కలిసిపోయేలా చూసుకోండి. అప్పుడే మనం నకిలీ సరుకు నుంచి మనవి వేరు చేసి చూపగలం. ఇకనుంచీ నేను మీతోనే ఉంటా. మన కష్టానికి తగిన ప్రతిఫలంతో మనమే అమ్ముకునే ఏర్పాట్లన్నీ చేస్తాను.'

చిన్నప్పటి నుంచీ మనందరి కష్టాలూ చూసాను. అందుకే నేను ఎంతో కష్టపడి మనకు సంబంధించిన ఈ చదువు కోసం అంత దూరం వెళ్ళి అహమ్మదాబాద్‌లో చదివినది.'

ఈ కళ మనకు మాత్రమే సాధ్యమైన కళ అనీ, దీనిని పదికాలాలపాటు నిలుపుకోవలసిన బాధ్యత మనదేననీ నచ్చచెప్పింది. ఆమె మాటలతో ఊరడిల్లిన ఆ జనంలో చైతన్యం వెల్లివిరిసింది.

■

## మహాసముద్రం

**జీ**వితం మొత్తం నదీప్రవాహంలా సాగుతోంది
రేపే సాగరంలో కలుస్తుందో అర్థం కాకుండా ఉంది
వెనక్కు తిరిగి చూస్తే అన్నీ చీకటి అరణ్యాలు
అవగతం కానీ ఎత్తుపల్లాలే కనిపిస్తున్నాయి

కష్టాల ఆనకట్టలు తెంచుకొని ఉరకలెత్తే బతుకు నది
అనుభవాల తీరాల వెంట పడి మహాసముద్రమై
మొదట భయపెట్టినా తుదకు ప్రశాంత సాగరమై
ప్రతి కన్నీటిబొట్టునూ ఆణిముత్యంలా
తనలో దాచుకుంటుంది

ఉరుకుల పరుగుల జీవన ప్రయాణపు గడబిడలో
కాలం కన్నా వేగంగా పరిగెత్తే మనసు ఒరవడిలో
మనకు మనమే లేని చిక్కు ముళ్ళు వేసుకుంటూ
బతుకు దారాలతో సాలె గూళ్లను అల్లుకుంటున్నాం

బతుకు పుస్తకంలో రేపటి పేజీలను కుట్టుకుంటూ
నిన్నటి కలల రంగులను అద్దుకుంటూ పోతే
అందంగా అలంకరించిన శుభలేఖలు అవుతాయి
ముంగిట్లో తారాడే అవకాశాలను ఆహ్వానిస్తాయి

రేపటి భవితను కళ్ళ ముందు ఊహించుకుంటూ
నిన్నటి ఆలోచనలన్నిటినీ పేర్చుకుంటూ పోతే
ఆకాశాన్ని అందుకోవడానికి నిచ్చెన మెట్లవుతాయి
అలవికాని లక్ష్యాలు కూడా కాళ్ళ కిందకు చేరతాయి

**- ఈదర శ్రీనివాసరెడ్డి**



# స్వాతంత్ర్యోద్యమ సమరాంగణంలో సాహిత్య వికాసం

- సత్యాజీ

ఏ కాలంలోని మనుషులైనా తమ ఆశలను, ఆకాంక్షలను, ఆవేదనలు, ఆందోళనలనూ తమ సాంస్కృతిక రూపంలో వెల్లడిస్తారు. ఆటగానో, పాటగానో ప్రతిబింబిస్తారు. అందుకనే ఏ ఉద్యమంలోనైనా ఆ ఉద్యమం తాలుకూ ఆకాంక్ష ప్రజలందరి హృదయాలనూ తాకాలి అంటే – సాహిత్య, సాంస్కృతిక రూపాల్లోకి దానిని తర్జుమా చేయాలి. గుండెగుండెనూ నినాదమై తాకటానికి, జనం ప్రభంజనమై కదలటానికి పాటలుగా, పద్యాలుగా, నాటకాలుగా, వివిధ కళారూపాలుగా, కథలుగా, నవలలుగా సాహిత్యం ఉరకలెత్తాలి. అలాంటి బృహత్తరమైన కృషి తెలుగు నాట నడచిన స్వాతంత్ర్య ఉద్యమంలో సాగింది. అలా సాగుతూనే సంఘ సంస్కరణ, స్వరాజ్య ఆకాంక్ష ఊపిరిగా మన సాహిత్య రూపాలు కూడా క్రమ వికాసం చెందాయి.

పందొమ్మిదో శతాబ్ది ప్రారంభంలో మన సాంప్రదాయ సాహిత్యం ఇంకా ఫ్యూడల్ దర్బారులోనే ఉంది. అష్టావధానాలు, శతావధానాలు, పద్య వైభోగాలతో పండితులకే పరిమితమైంది. కందుకూరి వీరేశలింగం కలం పట్టుకొని, సంఘ సంస్కరణకు అంకితం చేసినప్పటి నుంచీ తెలుగు సాహిత్యం ఆధునికత్వాన్ని సంతరించుకొంది. ఆయన నవల, నాటకం, ప్రహసనం, చరిత్ర, వ్యక్తుల చరిత్ర, పత్రికారచన .. ఇలా అన్ని రకాల ప్రక్రియల్లోనూ ఆద్యుడై కొత్త ఒరవడి సృష్టించారు. ప్రహసనాల్లోనూ, నాటకాల్లోనూ పాత్రోచిత భాషను వాడి ఛాందసులు వేసిన సంకెళ్ళను తెంచిపారేశారు.

ఈ కృషికి కొనసాగింపు మహాకవి గురజాడ అప్పారావు నుంచి మరింత విస్తారమైంది. విజయనగరం సంస్థానంలో కొలువు చేస్తున్నా, ఆయన ఫ్యూడల్ పరిధినుంచి బయటపడి, ప్రజాపక్షంగా, ప్రజాస్వామికంగా రచనలు వెలువరించారు. సమాజానికి సిగ్గుచేటైన 'దురాగతాలను బహిర్గతం చేస్తూ ఉన్నత నైతిక భావాలను వ్యాప్తి చేయడంకన్నా మిన్న అయిన లక్ష్యమూ, ప్రయోజనమూ సాహిత్యానికి లేదని' చాలా స్పష్టంగా, గాఢంగా విశ్వసించారు. 'ప్రజల్లో పఠనాసక్తి, అభ్యాసమూ కలిగేవరకూ నాటకరంగం వైపు మన దృష్టి మళ్ళించక తప్పదు' అనుకున్నారు. ఈ ఆలోచనలే ఆయన్ని కన్యాశుల్క నాటక రచనకు ప్రోత్సహించాయి. ఆ కాలంలో వీరేశలింగం గారి బ్రాహ్మవివాహం (పెద్దయ్య గారి పెళ్ళి పుస్తకం), వ్యవహార ధర్మబోధిని (ప్లీడరు నాటకం), గురజాడ వారి కన్యాశుల్కం తప్ప మిగతావన్నీ పౌరాణికాలే! కొన్ని చారిత్రక నాటకాలున్నా అవి సనాతన నాటకాల బాణీలోనే ఉండేవి. చుట్టూ ఉన్న జీవితం గురించి ప్రస్తావించిన కందుకూరి, గురజాడ నాటకాలు సమాజంలో ఎంతో చైతన్యాన్ని కలిగించాయి.

తొలి తరం తెలుగు నవలల్లో సమకాలిక సమాజాన్ని చిత్రించాలనే కోరిక మన రచయితలకు కలిగింది. న్యాయపతి సుబ్బారావు 1891లో చింతామణి అనే పత్రిక నడుపుతూ, నవలల పోటీ నిర్వహించారు. 1893 నుంచి ఈ పోటీల కోసం ఎందరో నవలలు రాశారు. వారందరికీ వీరేశలింగం గారి 'రాజశేఖర చరిత్ర' నవలే మార్గదర్శకం. చిలకమర్తి లక్ష్మీ నరసింహం గారి 'రామచంద్ర విజయం' ఒక ఏడాది పోటీలో నెగ్గింది. చిలకమర్తి 1884లో చెన్నపట్టణంలో జరిగిన కాంగ్రెసు సభలకు వెళ్ళారు. సురేంద్రనాథ బెనర్జీ, మదన్మోహన్ మాలవ్యా ఉపన్యాసాలు విని ఉత్తేజితులయ్యారు. ఈ సభలకు గురజాడ కూడా వెళ్ళారు. వాటిమీద ఆయన ఘాటుగా ఆంగ్లంలో రాశారు. అప్పటికింకా గురజాడ తెలుగు కవితలను ప్రారంభించ లేదు. చిలకమర్తి మాత్రం కవితలల్లసాగారు. అప్పుడు కాంగ్రెసు వారిలో దేశభక్తితో పాటు రాజభక్తి కూడా ఉండేది. చిలకమర్తి వారు ఆంగ్లేయ దొరతనాన్ని సీసపద్య పాదాలతో మెచ్చుకొని 'ఇట్టి యాంగ్లేయ దొరతనం బేలుగాక ధర్మమతితోడ నాచంద్ర తారకంబు' అని దేశీయులకు ప్రబోధం చేశారు. తరువాతి

కాలంలో 1895లోనే శ్రామిక జన పక్షపాతంతో దేశ పరిస్థితు లను చిత్రించారు. చిలకమర్తిని మన ప్రథమ జాతీయ కవి అనొచ్చు.

1905లో బెంగాల్ విభజన పెద్ద చర్చకు దారి తీసింది. బిపిన్ చంద్రపాల్ ఆంధ్రదేశంలోని పలు నగరాల్లో రోజుల తరబడి ఉపన్యాసాలిచ్చి ప్రజలను ఉత్తేజితులను చేశారు. రాజమండ్రిలో ఆయన ఉపన్యాసమిస్తున్నప్పుడు చిలకమర్తి వారే అనువాదకులు. సభ ముగిసేటప్పుడు చిలకమర్తి వారు ఆశు వుగా ... *'భరత ఖండంబు చక్కని పాడియావు/ హిందువులు లేగదూడలై యేడ్చుచుండ/ తెల్లవారను గడుసరి గొల్లవారు/ పితుకుచున్నారు మూతులు బిగియగట్టి'* అని పద్యం చదివారు. ఇది గొప్ప సంచలనాన్నీ, సంతోష పారవశ్యాన్నీ కలిగించింది. అన్ని పత్రికలూ ప్రచురించాయి.

**నాటకాల ద్వారా సంఘ సంస్కరణ, స్వరాజ్య కాంక్ష**

తిరుపతి వెంకటకవుల ఉద్యోగ విజయాలు, చిలకమర్తి కవి గయోపాఖ్యానం ఈ కాలంలోనే వెలువడ్డాయి. విజయనగర సంస్థానం పెద్ద దావాలో తలమునకలైన గురజాడ వారికి 1908 నాటికి కొంచెం వెసులుబాటు చిక్కింది. 1892లో రాసి ప్రదర్శించి 1897లో మొదటిసారి ప్రచురించిన కన్యాశుల్కాన్ని ఆయన పెంచి, తిరగరాసి మధురవాణి పాత్రను వసంతసేనను తలదన్నేటట్లు చిత్రించారు. 1909లో ప్రచురించారు. తెలుగు కవిత్వాన్ని ఆధునికం చేయడానికి పాత ఛందస్సులు పనికిరావని గురజాడ తెలుసుకొని కొత్త ఛందస్సుకోసం కృషి ప్రారంభిం చారు. 'గుత్తునా ముత్యాల సరములు/ కూర్చుకుని తేటైన మాటల/ క్రొత్త పాతల మేలు కలయిక క్రొం మెరుంగులు జిమ్మగా' అంటూ కొత్త స్వరం వినిపించారు.

**'దేశభక్తి' సరికొత్త నిర్వచనం**

ప్రజల్లో ప్రదీప్తమౌతున్న దేశాభిమానానికి ఒక నిర్వచనం ఇవ్వాలని గురజాడ నిశ్చయించుకొని 'దేశభక్తి' గేయం రాశారు. ఇది తెలుగు వాళ్ళ జాతీయగీతం. మన దేశాభివృద్ధికి మానిఫెస్టో. దేశమంటే మట్టికాదు మనుష్యులని మొట్టమొదటిసారిగా గురజాడ హెచ్చరిక చేశారు. "తిండి కలిగితే కండకలదోయ్/ కండగలవాడేను మనిషోయ్!/ దేశమనియెడి దొడ్డ వృక్షం/ ప్రేమయను పూలెత్తవలెనోయ్/ నరుల చెమటల తడిసి మూలం/ ధనం పంటలు పండవలెనోయ్'' అన్నాడు. శ్రమశక్తి ప్రాధాన్యాన్ని ఎలుగెత్తి చాటాడు.

గురజాడ వారి సాహిత్య రథానికి రెండు చక్రాలున్నాయి. ఒకటి సంఘ సంస్కరణ. రెండోది వాడుక భాష. గిడుగు రామమూర్తి, ఆయనా ఒకరికొకరు చేదోడు వాదోడు అయ్యారు. తెలుగు వ్యావహారిక భాషకు వెలుగు తారలు అయ్యారు. 'నాది ప్రజల ఉద్యమం. దానిని ఎవరిని సంతోషపెట్టడానికైనా వదులు కోలేను' అని గురజాడ 1911 మార్చి 27వ తేదీన తన డైరీలో రాసుకొన్నారు.

గురజాడ ఆధునిక కవిత్వానికి శ్రీకారం చుడుతున్నప్పుడు, అదే కాలంలో రాయప్రోలు సుబ్బారావు భావ కవిత్వాన్ని ప్రారంభించారు. అమలిన శృంగారం అనే కొత్త ఆదర్శాన్ని ప్రచారం చేశారు. తరువాతి కాలంలో దేవులపల్లి కృష్ణశాస్త్రి భావకవిత్వానికి బ్రాండ్ అంబాసిడర్‌గా వర్ధిల్లారు. శ్రీశ్రీ వంటి యువకులు ప్రారంభంలో ఆ ప్రవాహంలో మునిగితేలారు కూడా! 1908లో బొంబాయిలో ప్రారంభించిన ఆంధ్రపత్రికను కాశీనాథుని నాగేశ్వరరావు మద్రాసుకు మార్చారు. ఆంధ్రపత్రిక సారస్వతానుబంధం వల్ల చాలా మేలు జరిగింది. ఆ పత్రికతో వాడుకభాషను ప్రవేశపెట్టమని గురజాడ ఎంతో వాదించారు. ఆంధ్రప్రతిక వ్యావహారిక భాషలోకి మారడానికి దశాబ్దాలు పట్టింది.

1913లో బాపట్లలో ప్రథమాంధ్ర మహాసభ జరిగింది. ప్రత్యేక రాష్ట్రం కోసం ఉద్యమం ప్రారంభమైంది. కవులు తమ కర్తవ్యాన్ని గుర్తించారు. రాయప్రోలు సుబ్బారావు 'ఆంధ్రావళి' ప్రబోధాన్ని మొదలు పెట్టారు. ఆంధ్ర పౌరుషాన్ని వేనోళ్ళ చాటారు. స్వాతంత్ర్య సమరం పక్కన 'ఆంధ్రోద్యమం' కూడా సాగింది. ఆధునికాంధ్ర సాహిత్యానికి కొత్త ఒరవడి దిద్దిన గురజాడ 1915లో మరణించారు. ఆయన కొంత కాలమే జీవించి, కొన్ని ఏళ్లే సాహిత్య సృజనకు వెచ్చించినా ఆ కృషి చాలా గొప్పది, తరువాతి వారికి అన్ని విధాలా ఆదర్శనీయ మైనది. తొలితరంలో బసవరాజు అప్పారావు, చింతా దీక్షితులు గురజాడకు వారసులుగా తమ కృషి కొనసాగించారు.

తరువాతి కాలంలో మతం పట్ల వైఖరులు మారడం మొదలుపెట్టాయి. దేశంలో బ్రహ్మ సమాజం బలం పుంజు కొంది. చలం, కృష్ణశాస్త్రి వంటి వారు చురుకుగా పనిచేశారు. యజ్ఞోపవీత ధారణ, విగ్రహారాధన మొదలైన వాటి పట్ల విముఖత పెరిగింది. 'శిథిలాలయమ్ములో శివుడు లేడోయి' అని పాడారు. గుడిలో ఉండేది పూజారే గాని పూజ్యుడైన దేముడు కాదని ఎలుగెత్తి చెప్పారు.

**వెల్లి విరిసిన భావ కవిత్వం**

1919లో తల్లావఝ్ఝుల శివ శంకర శాస్త్రి 'సాహితీ సమితి' ని స్థాపించారు. యువ రచయితలను ఒక వేదిక మీదకు తీసుకు వచ్చారు. పిఠాపురంలోని దేవులపల్లి కృష్ణశాస్త్రి, నూజివీడులోని నండూరి సుబ్బారావు, తెనాలిలో వఝ్ఝు బాబూరావు, వీరరాఘవ స్వామి, గుంటూరులో నోరి నరసింహశాస్త్రి, బెజవాడలో కొడాలి ఆంజనేయులు, బందరులో విశ్వనాథ సత్యనారాయణ, అడవి బాపిరాజు మొదలైనవారంతా దేశమంతా తిరిగి నూతన కవిత్వాన్ని ప్రచారం చేశారు. ఆనాడు దేశంలోనూ, రాష్ట్రం లోనూ, సంఘంలోనూ లేని స్వేచ్ఛను వీరు ఆశించారు. వీరి

నివాసం తొలుత గాంధర్వ లోకమట. 'లోకముతో మనకేటికి? లోలాక్షి పద పోదము' అని పలాయనవాదం వినిపించారు. 'దిగిరాను దిగిరాను దివినుండి భువికి' అని ఊహాలోకంలో విహరించారు. శ్రీశ్రీ విజృంభించే దాకా ఈ ధోరణి తెలుగు నాట కొనసాగింది.

**జలియన్ వాలా బాగ్ ప్రభావంతో ...**

1910 ఏప్రిల్ 13న పంజాబ్లో జలియన్ వాలా బాగ్ ఊచకోత జరిగింది. దేశం అట్టుడికిపోయింది. తెలుగు కవులు గళం విప్పి పాటలు పాడారు. గరిమెళ్ల సత్యనారాయణ 'మా కొద్దీ తెల్లదొరతనం' అని స్పష్టం చేసి దేశంలోని దుర్భర పరిస్థితులను వర్ణించి, వాటిని తొలగించుకొనడానికి స్వాతంత్ర్య ఉద్యమంలో కలవమన్నారు. ప్రచార కవిత్వాన్ని ప్రజల కవిత్వంగా రూపొందించారు. దండాలు దండాలు భారతమాత అంటూ వడ్డాది సీతారామాంజనేయ కవి ఎలుగెత్తి పాడారు.

మరోపక్క నాటకాల్లోనూ స్వాతంత్ర్య కాంక్ష వెల్లడి కావడం మొదలైంది. రామరాజు పుండరీకాక్షుడి గారి పాంచాలీ పరాభవం, శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి గారి తిలకు మహారాజు నాటకం, గాంధీ విజయధ్వజ నాటకం వంటివి వెలువడ్డాయి. సంఘ సంస్కరణకు నాటకాలను మళ్ళీ ఉపయోగించడం ప్రారంభమైంది. కాళ్ళకూరి నారాయణ రావు రచించిన *చింతామణి, వరవిక్రయం, మధుసేవ* వంటి నాటకాలు ఎంతో ప్రాచుర్యం పొందాయి.

**సాహిత్యంలో సామ్యవాద భావనలు**

విదేశాల్లో చదివి, విశాల భావాలు ఏర్పరుచుకున్న ఉన్నవ లక్ష్మీనారాయణ గాంధీ ప్రభావంలో వున్నా సోషలిస్టు ఉద్యమాలను ఊహించారు. సామ్యవాద గ్రంథాలను అధ్యయనం చేశారు. మాలపల్లి నవల రాసి, తక్కెళ్ళ జగ్గడు పాత్ర ద్వారా సమధర్మాన్ని ప్రబోధించారు. తెలుగులో ఆయనే సామ్యవాద సాహిత్య పితామహులయ్యారు. స్వరాజ్య సోది, బుడబుక్కల జోస్యము వంటి ప్రజాకళల ద్వారా ఆనాడే ఆయన ప్రచార సాహిత్యాన్ని ప్రారంభించారు. రష్యాలో విజయవంతమైన విప్లవ ప్రభావం ఉన్నవ వారి మీద ప్రగాఢంగా ఉంది.

రైతుల వెతల గురించి సాహిత్యంలో ప్రవేశపెట్టినది ఉన్నవతో పాటు కవికోకిల దువ్వూరి రామిరెడ్డి. రామిరెడ్డి రచించిన 'కృషీవలుడు' కావ్యం చిన్నదే అయినా ఎంతో ప్రభావం చూపించింది. రైతులాగే కూలీ కూడా ముఖ్య శ్రామికుడు. కూలీల గురించి విపులంగా రాసిన కవి కవికొండల వెంకటరావు. కష్టజీవుల గురించి గేయాలు రాశారు. కూలీలను 'కూలి అన్నలు' అని తొలిసారిగా బాంధవ్యం కలుపుకున్నారు.

1928 నాటికి సోషలిస్టు, కమ్యూనిస్టు సిద్ధాంత గ్రంథాలు తెలుగుదేశంలోకి రహస్యంగా రావడం మొదలైంది. పందిరి మల్లికార్జునరావు హిందీ క్లాసులు నడుపుతూ చాటుగా స్టాలిన్ రాసిన 'లెనినిజం', ట్రాట్స్కీ రాసిన 'రష్యా విప్లవ చరిత్ర' మొదలైనవి తాను చదివి, ఇతరుల చేత చదివించేవారు. పుచ్చలపల్లి సుందరయ్య 'కమ్యూనిస్టు ప్రణాళిక', 'కూలి–పెట్టుబడి' వంటి గ్రంథాలు చదివి మదరాసులో 'సోదర సమితి' అనే సంఘాన్ని స్థాపించి సోషలిస్టు భావం ప్రచారం చేశారు. ఇలా ఎందరో యువకులు కాంగ్రెసు నడుపుతున్న శాసనోల్లంఘనోద్యమంలో ఉంటూనే సామ్యవాదులుగా మారుతూ వచ్చారు.

**కమ్యూనిస్టు పార్టీ స్థాపన**

1930లో ఆర్థిక సంక్షోభం వచ్చింది. యూరప్లో ఫాసిస్టులు బలపడుతూ వచ్చారు. పెట్టుబడులు సన్నగిల్లాయి. నిరుద్యోగం పెచ్చు పెరిగింది. వీటన్నిటికీ సోషలిజం వల్లనే పరిష్కారం సాధ్యమని ప్రగతిశీలురు గాఢంగా విశ్వసించారు. 1934లో కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ ఏర్పడింది. సామ్యవాద భావాలు గల స్వాతంత్ర్య యోధులందరూ దానిలో చేరారు. ఆ పార్టీలో ఉంటూనే కమ్యూనిస్టు ఉద్యమాన్ని నిర్మించడానికి సుందరయ్య కృషి ప్రారంభించారు. కమ్యూనిస్టు భావ జాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లటానికి సాహిత్య, సాంస్కృతిక రంగాల్లో ప్రత్యేక కృషి ఉండాలని ఆయన భావించారు. యూజీన్ పాట్టియర్ రచించిన అంతర్జాతీయ గీతాన్ని సుందరయ్య గారే అప్పుడు కాకినాడలో చదువుకొంటున్న బాలాంత్రపు నళినీ కాంతారావు గారికి వినిపింపజేసి, తెలుగులోకి అనువదించమన్నారు. ఇప్పుడు మనం పాడుకుంటున్న అంతర్జాతీయ శ్రామిక గీతం *'ఆకలి మంటలు మలమలమాడే అనాథలందరు లేవండోయ్'* అన్న గీతం అలా రూపుదిద్దుకొంది. తెలుగువారికి సొంత గీతం ఉండాలనే తలంపుతో గీతాల పోటీ నిర్వహించారు. అప్పుడే పెండ్యాల లోకనాథం 'కూలీలందరు యేకమైతే కూటికీ తరుగేమిరా', తుమ్మల వెంకట్రామయ్య 'ఎగరాలి ఎగరాలి మన ఎర్రజెండా.. కూలోళ్ళ గొంతులో కొనవూపిరుంటే పేదరైతు మేన వేడి రక్తంబుంటే' గేయాలు వెలువడ్డాయి. ఇవన్నీ తెలుగు నాట విస్తృత ప్రచారం పొందాయి.

**ఆంధ్ర యూనివర్శిటీలో కమ్యూనిస్టు బీజాలు**

ఉద్యమంలో వున్నవాళ్ళు ఇలా పాటలు కట్టుకుంటూ వుంటే విద్యాధికులు కమ్యూనిస్టు సాహిత్యాన్ని అధ్యయనం చేస్తున్నారు. సర్వేపల్లి రాధాకృష్ణ ఇంగ్లండు నుంచి వచ్చేటప్పుడు తమ వెంట కమ్యూనిస్టు సాహిత్యాన్ని తీసుకువచ్చి ఆంధ్ర విశ్వవిద్యాలయం గ్రంథాలయంలో పెట్టారు. హిరేన్ ముఖర్జీ, అబ్బూరి రామకృష్ణారావు ఆ విశ్వవిద్యాలయంలో ఆచార్యులు. ఈ ఇద్దరూ ఎన్నో కమ్యూనిస్టు గ్రంథాలను తెప్పించి విద్యార్థులకు అందుబాట్లో ఉంచారు. ఎందరో వీటిని చదివి ప్రభావితులయ్యారు.

1934లోనే ఆచార్య రంగా కాంగ్రెసువాదిగా, రైతు నాయకునిగా ఉంటూ గుంటూరు జిల్లా నిడుబ్రోలులో రైతాంగ

విద్యాలయాన్ని స్థాపించారు. వివిధ కవులు రాసిన శ్రామిక గీతాలను 'రైతు భజనావళి' పేరుతో సంకలనం చేసి 1934లో ప్రచురించారు. ఉపోద్ఘాతంలో 'ప్రపంచ మందొకచోట రైతులు రాజ్యానికి వచ్చినారు. కూలీలు పెత్తనం చేస్తున్నారు. ప్రజా సామాన్యమునకు పరువు ప్రతిష్ఠలచ్చట లభ్యమగుచున్నవి. *ఆంధ్రప్రజలు కూడ అలాంటి స్వరాజ్యమునే కాంక్షించు చున్నారు."* అని రష్యాలోని సామ్యవాదం గురించి పేర్కొన్నారు.

### అభ్యుదయ పత్రికల సాహిత్య సేవ

అభ్యుదయ వాదులు ఎన్నో పత్రికలు స్థాపించి నడిపారు. ముద్దు కృష్ణ జ్వాల, గద్దె లింగయ్య ప్రభ, సోషలిస్టు పార్టీ పత్రిక నవశక్తి రచయితలకు నూతనోత్సాహాన్ని కలిగించాయి. 'రుధిర జ్యోతిని వెలగింపుమురా విప్లవ గీతిని వినిపించుమురా' అని శ్రీరంగం నారాయణ బాబు రాశారు. 1936లో సెప్టెంబరులో రాజమండ్రిలో జరిగిన కాంగ్రెసు సోషలిస్టు పార్టీ సభల్లో విశాఖ జిల్లా నుంచి ఏకైక ప్రతినిధిగా ఆయన హాజరయ్యాడు. శ్రీశ్రీ సోషలిస్టు ఉద్యమ ప్రభావంతో తన గమ్యం తెలుసుకొన్నాడు. మహాప్రస్థానం గేయాన్ని రాసి 'ఎముకలు కుళ్ళిన వయస్సు మళ్ళిన సోమరులను చావమని, నెత్తురుమండే శక్తులు నిండే సైనికులను రా రమ్మని పిలిచి, పదండి ముందుకు' అని ప్రబోధించాడు.

1934 జులైలోనే తుమ్మల వెంకట్రామయ్య గోర్కీ నవల 'అమ్మ' సంక్షిప్తానువాదాన్ని 'మాతృహృదయం' పేరుతో రాశారు. పూర్తి నవలను క్రొవ్విడి లింగరాజు అనువదించారు. వీటిని ఆదర్శ గ్రంథమండలి 1934 డిసెంబరులో ప్రచురించింది. ఆ తరువాతి ఏడాది జులైలో వాటిని ప్రభుత్వం నిషేధించింది. అయితే ఈ నవల ప్రతులను రహస్యంగా చదివి ఎందరో ఉత్తేజితులయ్యారు. ఉద్యమానికి వచ్చారు. 1935లో ఉన్నత విద్య కోసం ఇంగ్లండులో ఉన్న భారతీయ యువకులు అక్కడే ఇండియన్ ప్రోగ్రసివ్ రైటర్స్ సంఘాన్ని స్థాపించి, సామ్యవాద సాహిత్యాన్ని తమ అజెండాగా చేసుకున్నారు. 1936 ఏప్రిల్‌లో ప్రేమ్‌చంద్ అధ్యక్షతన లక్నోలో ఇండియన్ ప్రోగ్రసివ్ రైటర్స్ సభలు జరిగాయి. దానిలో పాల్గొన్న అబ్బూరి రామకృష్ణారావు తిరిగివచ్చి విశాఖపట్నంలో ఆంధ్రవర్ధమాన లేఖక సంఘాన్ని స్థాపించారు. అబ్బూరి వారి ద్వారా ప్రోగ్రసివ్ రైటర్స్ ప్రణాళిక శ్రీశ్రీకి లభించింది. అది తనను మార్క్సిస్టు లైన్లో పడవేసిందని శ్రీశ్రీ చెప్పారు. ప్రతిజ్ఞ, దేశచరిత్రలు గీతాలు మానిఫెస్టోకు ఆచరణాత్మక కవితాత్మక ధ్వనులుగా వినిపిస్తాయి. ఇలా స్వాతంత్ర్యోమం సాగుతున్న కాలంలోనే తెలుగు సాహిత్యం ఉద్యమానికి దోహదపడుతూ ... తానూ సాంప్రదాయ ధ్వని నుంచి అభ్యుదయ ఆకాంక్ష దాకా క్రమ వికాసం చెందింది. ■

## ఒక వీరుడి స్ఫూర్తి పథం

**వీ**రుడు విగ్రహాలకే పరిమితం కాదు
వర్తమానపు వక్రగతిపై ప్రశ్నల పరంపరగా ప్రవహిస్తాడు
నీటి మూటల మాటల నాటకాలపై విల్లంబులు సంధిస్తాడు
అన్యాయాన్ని అన్యాయమని ప్రకటిస్తాడు
అట్టడుగు జనాల వైపు విస్పష్టంగా నిలబడతాడు!

భారీ పూల దండల్లో ముంచెత్తి
ఆశయాన్ని అంతర్ధానం చేసేయకండి మహా ప్రభూ..
భూరి విరాళాల భజా భజంత్రీలతో
ప్రశ్నల గొంతును నొక్కేయకండి ..
పల్లవించే చైతన్యాన్ని చెరశాలలో బందీని చేసి
స్వేచ్ఛ గురించి మాట్లాడకండి ..
గిరిజనుల గుండెల్లో గునపాలు దించుతూ
కొండలను పిండి చేసే కుతంత్రాలు పన్నుతూ
ఉత్తుత్తి నివాళ్లతో ఉవ్వెత్తున ఎగసి పడకండి !

అల్లూరి సీతారామరాజు
ఆ పేరే ఒక ప్రభంజనం
మన్యాన్ని ఉరకలెత్తించిన మహోద్ధృత చైతన్యం..
హక్కులను హరించే ముష్కరుల మీద
దండెత్తి జడిపించిన మిరప టపా శరాఘాతం
కసాయితనం అంటని కాషాయపు నిర్మలత్వం
అది విప్లవాగ్నులు చిమ్మిన వీరోచిత త్యాగాల వారసత్వం!

మీది కాని ఈ త్యాగాల ఒరవడిని ఓట్ల రథంగా మార్చేయకండి
ఉద్వేగాల ఊకదంపుడుతో నోట్ల పథం వైపు మళ్ళించకండి
వీరులు విగ్రహాల్లో విలాసంగా నిద్రపోరు..
నిద్రాణమై ఉన్న చైతన్యాన్ని మేల్కొలిపి మహా యుద్ధంగా మారుస్తారు..
ఏమార్చే సకల దుష్ట కుతంత్ర పన్నాగాలను నేల కూల్చి
ఈ ప్రపంచాన్ని ఒక సకల జన సమతావనంగా తీర్చి దిద్దుతారు..
కొల్లలు కొల్లలుగా తిష్ట వేసిన
అసమాన అన్యాయపు గుట్టలను
సమ సమానంగా సముజ్వల మైదానంగా మార్చే
మహా ప్రస్థానానికి నాంది పలుకుతారు.. !

వీరులు నిలువెత్తు విగ్రహాల్లో
ఊరకనే శిలా సాదృశ్యంగా నిలబడిపోరు..
మార్పు కోసం సకల జన సౌభాగ్య శ్రేయోభిలాషులై ప్రవహిస్తారు
మెట్ట పల్లాలను ఏకం చేసే మహత్తర పోరాటాన్ని నడిపి వెళతారు..
నంగి నంగి మాటలతో వంగి వంగి దండాలతో
మీ దండల దండగ పన్నాగం ఇక చాలించండి..
వీరులు ఎప్పుడూ మీకు ఎడంగానే నిలబడతారు
మీరు మీ మీ నిజ స్థానాల్లో నిలబడండి చాలు..
మీ అన్యాయపు అమ్మకాల జాతరపై
మేం సంధించే అంబుల అగ్నివర్షాన్ని చవి చూడండి చాలు!

**- శాంతిమిత్ర**



# కడగండ్ల వాన

- ధాత్రి

"**యా**లా పాలా లేదు, సలికాలం ఎండాకాలమని లేదు, హొరున కురుస్తాంది పాడు వాన." ముత్యాలమ్మ తిట్టుకుంటూ నీళ్లు కారుతున్న చోటల్లా నొక్కులు పోయిన సత్తు గిన్నెలు పెట్టే ప్రయత్నం చేస్తోంది.

వారం రోజుల నుంచీ ఎడతెరిపి లేదు. ఊరంతా జల్లుల్లో తడిసిపోతా ఉంది. ఊరితో పాటు ఊరి చివరనున్న ఆ 'ఇల్లు' కూడా. ఎన్నేండ్ల కిందటో కట్టిన మట్టి గోడలు నాని, నాని ఎప్పుడెప్పుడు పడిపోదామా అన్నట్లున్నాయి. వెదురు దిమ్మలు గాలికి ఊగుతూ ఉన్నాయి. పైన కప్పిన తాటాకులు సగం ఎగిరిపోగా మిగిలినవి పైనుంచి జాలిగా లోపలి మనుషులను చూస్తూ ఉన్నాయి. నేలలో తడవని భాగం కోసం వెతుకుతూ ఇంట్లో మనుషులు. వాళ్ళు కూడా తడిచిపోయారు. పైనా లోపలా కూడా. మనుషులంటే ముగ్గురు పెద్దవాళ్ళు. ముగ్గురు చిన్న పిల్లలు. బేల్దారి పనికి పోయే కుళ్లాయప్ప, అతని భార్య ముత్యాలమ్మ, వయసుతో పాటు అనారోగ్యమూ పెరిగిన కుళ్ళాయప్ప తల్లి ఇంకా ఇద్దరు కొడుకులూ, కూతురూ. దాదాపు ఆరు నెలల పాటు, కరోనా పుణ్యమా అని పనులన్నీ నిలబడిపోయి, కుళ్లాయప్పకు పని లేకుండా పోయింది. కరోనా కాస్త తగ్గు ముఖం పట్టి, మెల్లగా పనులన్నీ మొదలవుతున్న కాలంలో వాన వదలకుండా పట్టుకుంది. మళ్ళీ పనులు ఆగిపోయాయి. వచ్చిన ఆదాయంలో ఇంట్లో మనుషుల తిండి కంటే కుళ్లాయప్ప తాగుడుకే ఎక్కువ ఖర్చయి, మిగులంటూ ఏమీ లేకపోవడంతో ఇంట్లో ఉన్న నాలుగు గింజలూ అయిపోయాయి. కరోనా కాలంలో కాస్త మేలు, ఎవరో ఒక పుణ్యాత్ములు కాస్త పెడుతుంటే జరిగిపోయింది. ఇప్పుడేమీ లేదు. తినడానికి లేక పిల్లలు ఒకటే ఏడుపు. వాళ్ళను ఎలా సముదాయించాలో ముత్యాలమ్మకు పాలుపోలేదు. మరోవైపు అత్త ముసలిది, అందులోనూ జబ్బు మనిషి, ఆకలికాగలేదు. ఇంట్లో వండేందుకు ఏమీ లేవు. గంజి చేసి పోస్తామన్నా నూకలు కూడా మిగల్లేదు. ముత్యాలమ్మ పిల్లల బాధ చూడలేక, అభిమానం చంపుకొని అడుక్కొచ్చైనా పెడదామని వానలో తడుస్తూనే ఊర్లోకి పోయింది.

''అమ్మా, ఇంతన్నముంటే పెట్టండమ్మా'' గట్టిగా అరిచేందుకు సిగ్గనిపించి సన్నగా సణిగింది.

ఓ వైపు వాన శబ్దం. మరోవైపు ఈమె చిన్నగా అరవడంతో శబ్దం లోపలి దాకా చేరలేదు. ఎవరూ పలకలేదు. ఓ రెండు మూడు ఇళ్ళ నుంచి ఏ స్పందనా లేకపోవడంతో తరువాత కొంచెం గొంతు పెంచింది. కిటికీ లోనుంచే ఓ గొంతు రయ్యన దూసుకొచ్చింది.

"వానలో కూడా ఈ బిచ్చగాళ్ళ తాకిడి తప్పలేదు. ఏం లేదు పో!"

మారుమాట లేకుండా సిగ్గుతో చితికిపోతూనే మరో ఇంటి ముందు నిలబడి పిలిచింది, "తినేకేమన్న పెట్టండమ్మ, సిన్నపిల్లోల్లు ఆకలితో ఉండారు."

ఇంట్లో నుంచి అన్నం రాలేదు కానీ ఉచిత సలహా వచ్చింది, "పనీ పాటా చేసుకొని బతికేకి చేత కాదా?" ముఖం మీదనే

తలుపు దబ్బుని మూసుకుంది.

ఎన్ని ఇళ్ళు తిరిగినా ఇదే పరిస్థితి, అసలు మూసుకున్న తలుపులు తెరుచుకొనే లేదు, ఇంటివీ, మనసులవీ కూడా.

అంత నిరాశలో కాస్త ఆశాజ్యోతిలా ఓ సందు చివర్లో అంత వాన లోనూ ఓ బిల్డింగ్ పై రంగురంగుల దీపాలు వెలుగుతూ కనిపించాయి. ఏదో పెండ్లో, పేరంటమో జరుగుతున్నట్టుంది, అక్కడేమైనా తినడానికి దొరకొచ్చు అని ఆశతో అటువైపు కదిలింది ముత్యాలమ్మ.

ఆ రంగుల భవంతికి యజమాని ఊళ్ళో పేరు మోసిన కాంట్రాక్టర్. వాళ్ళ ముద్దుల మనవడి మొదటి పుట్టిన రోజు వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. అంత వాన లోనూ గొప్ప గొప్ప వాళ్ళందరూ హాజరై పెద్ద పెద్ద బహుమతులు పట్టుకొచ్చారు. ఘనంగా తయారుచేసిన అనేక రకాల వెజ్, నాన్ వెజ్ వంటలు నోరూరిస్తున్నాయి. ఏడాది వయసున్న పుట్టిన రోజు పిల్లాడు మాత్రం ఉక్కిరిబిక్కిరై ఏడుపు మొదలుపెట్టాడు. వాడిని సముదాయిస్తూ తల్లి బయటకు తీసుకొచ్చి, వానకు తడవకుండా అటూ ఇటూ తిరుగుతూ సముదాయించే ప్రయత్నం చేస్తోంది. ఆమెను చూసిన ముత్యాలమ్మ జాలి గొలిపేలా నీరసంగా అడిగింది.

“చిన్న పిల్లలుండారు, తినడానికేమన్నుంటే ఇయ్యండమ్మ!”

అప్పుడే అక్కడి కొచ్చిన పిల్లాడి తాత “ఈ బికార్లు అడుక్కుతినే సాకుతో పిల్లల్నెత్తుకు పోతారు. నువ్వు లోపలి కెళ్ళు.” కోడల్ని కసురుకుని, “గొప్పోళ్ళ ఇంటి కాడి కొచ్చి దొరికింది తీసుకుపోదామనా, పో ఇక్కడి నుంచి.” ముత్యలమ్మను కరిచినంత పని చేశాడు. ముత్యాలమ్మ దెబ్బకు భయపడి పోయి కొంచెం దూరం పోయి, ఆ పెద్దమనిషి లోపలికి పోగానే మళ్ళీ గేటు దగ్గర నిలబడి ఏమన్నా దొరుకుతుందేమోనని చూడసాగింది.

గంట సేపు గడిచాక, అతిథులంతా భోజనాలు చేసిన తరువాత ఎంగిలి ప్లేట్లు బయట పడేశారు. గొప్పోళ్ళు కాస్త కొరుక్కొని వొదిలేసిన స్వీట్లు, తినలేక మిగలబెట్టిన అన్నం, కూరలు ... ఇవన్నీ చూడగానే ముత్యాలమ్మకు కడుపు నిండిపోయినంత పనయింది. పడేసిన పదార్థాలలో కాస్త బాగున్నవి ఏరుకొని మెల్లగా సత్తు గిన్నెలోకి వేసుకోసాగింది. ఎక్కడి నుంచో కుక్కల గుంపు భౌ భౌ మంటూ భీకరంగా అరచుకుంటూ వచ్చింది.

“హేయ్, హేయ్” అంటూ తోలినా ఇంకాస్త గట్టిగా అరుచుకుంటూ ప్లాస్టిక్ ప్లేట్ల మీద పడి చెల్లా చెదురు చేశాయే తప్ప అవి ఏ మాత్రం వెనక్కి తగ్గలేదు. వాటితో పోటీ పడి ఎలాగైతేనేం నాలుగైదు స్వీట్లు చీర చెంగులో మూట కట్టుకొని, ఇంత అన్నమూ, కూరలూ గిన్నెలోకేసుకొని, కొంగు నెత్తిన కప్పుకొని, పెద్ద పెద్ద అంగలేసుకుంటూ ఇల్లు చేరింది. తల్లి చేతిలో పదార్థాలను పసిగట్టిన పిల్లలు శక్తి లేకపోయినా సంబరంగా లేచి కూర్చున్నారు. మీదపడి లాక్కోబోతున్న పిల్లలను గదిమి, తలా యింత పెట్టింది. నీరసంగా సొమ్మసిల్లిన అత్తకూ తినిపించింది. డబ్బుల్లేకపోయినా పావలా పరకా అప్పుచేసి తాగొచ్చి పడిపోయిన భర్తను లేపి, అతనికీ వడ్డించింది.

“హమ్మయ్య, ఈరోజు గడిచిపోయింది.” అనుకుంటూ గోడకానుకొని గిన్నెలో అడుగున మిగిలిన కాస్త నోట్లో పెట్టుకోబోయింది. సరిగ్గా అదే సమయానికి ముసురు వానకు నానిన మట్టి గోడ కూలి, ముత్యాలమ్మ మీద పడింది. ఏమరుపాటులో ఉన్న ముత్యాలమ్మ దబ్బున కిందబడింది. చేతిలో ముద్ద మట్టి పాలయి పోయింది. భోరున వాన... ముత్యాలమ్మ కండ్లలో నుంచి. ■

## నేస్తం

**నే**స్తమంటే వాడే!
కూర్చుని సలహాలివ్వడు
ఓదార్చే సాయమౌతాడు
కాలం మార్చని చైత్రం అవుతాడు
తేనీరైనా, కన్నీరైనా
వన్ బై టూనే అంటాడు
ఎడారైనా, ఏ దారైనా
నీ తోడై ఉంటాడు
దిక్కు తోచని రాస్తాలో
ఠక్కున వాడే గుర్తొస్తాడు
అక్కరకు వచ్చి చేయందిస్తాడు

లోకాన్నే నువు జయిస్తే
మీసాన్నే మెలి వేస్తాడు
తనదే గెలుపని తలుస్తాడు
సమస్త లోకమూ విడిచి పెట్టే
అభయ హస్తమై నడిచొస్తాడు
నిండు ధైర్యమై నిలుస్తాడు

నేస్తమంటే వాడే!
ఒక్కడున్నా చాలు
ఎక్కడున్నా కోరు నీ మేలు!

**- డా. డి.వి.జి.శంకర రావు,** మాజీ ఎంపీ,
పార్వతీపురం, 94408 36931.



# మట్టి మనుషులు

- ఇనాయతుల్లా
98493 67922

**ఆ**గకుండా కాలింగ్ బెల్ మోగుతూనే వుంది.

అసహనంగా కదిలాను. పుచ్చలపల్లి సుందరయ్య ఆత్మకథ పుస్తకంలో నుంచి తలపైకెత్తి కిటికీ వైపు చూశాను. ఎవ్వరూ కనిపించలేదు. 102వ పేజీ మిస్ కాకుండా పుస్తకాన్ని టేబుల్ మీద బోర్లా పెట్టేసి బలవంతంగా లేచి వెళ్ళాను. తలుపు తీశాను.

అంతే...! అవాక్కయి నిలబడిపోయాను.

"అర్రెర్రె!... హ్హా! హ్హా!... ఏమిటీ అకస్మాత్తుగా యిలా వచ్చేశావు .ఫోను కూడా చేయకుండా.." ఇంకా చూస్తూనే నిలబడిపోయాను.

"ఏయ్! చిన్నీ.. ఇటు చూడు. ఇటు చూడు. నోట్లో వేళ్ళు తియ్! ఇదిగో రెండు చేతులు ఇట్లా పెట్టి సారుకు 'నమస్తే' చెప్పు" ఎదురుగా వున్నామె తన బుజ్జితో నాకు నమస్కారం చెప్పిస్తోంది.

"భలే దానివే! నమస్కారం, గిమస్కారం ఏమీ వద్దు గానీ రాజీ! ఏమిటిట్లా సడన్‌గా దిగిపోయారు. నాన్‌డీటైల్ అండ్ టెక్స్ట్‌బుక్ కలిసి వచ్చేశాయి మా యింటికి. రండి! రండి లోపలికి!" తలుపు పూర్తిగా తెరిచి రాజీని లోపలికి రమ్మన్నాను.

"మీరు గుర్తొచ్చారు! వచ్చేశాను. అంతే సార్! ఏయ్ చిన్నీ... చెప్పవే సారుకు గుడ్‌మార్నింగ్... సార్! మా నాన్‌డీటైల్ ఏమి పలకడం లేదు సార్!" కుర్చీలో కూర్చుంటూ చెప్పింది.

నాన్‌డీటైల్ అంటే అంతే గదా! నో డీటైల్స్... ఓన్లీ లుకింగ్స్... కదరా కన్నా!... అబ్బ! ఈ టెక్స్ట్‌బుక్‌కు తగిన నాన్ డీటైల్ పుట్టిందిరా! ఏయ్! యిలారా!" అంటూ బుజ్జి కోసం రెండు చేతులు చాచాను. ఆ పిల్ల ఆర్మెడిల్లోలాగా ముడుచుకు పోయింది.

"ఏం పోలిక చెప్పారు సార్! టెక్స్ట్‌బుక్కు... నాన్ డీటైల్ అని... సార్ మీకు గుర్తుందా! యాక్చువల్‌గా మీరు మాకు నాన్ డీటైల్ చెప్పడానికి వచ్చారు. కాని గుండెల్లో టెక్స్ట్‌బుక్‌లా నిలిచిపోయారు." నవ్వుతూ చెప్పింది రాజీ.

"ఓహో! థ్యాంక్యూ! నాన్ డీటైల్ టీచ్ చేయాలంటే నాకు చాలా యిష్టం రా! బోలెడన్ని కథలు చెప్పొచ్చని కావాలనే నేను నాన్ డీటైల్ తీసుకున్నా." పాత జ్ఞాపకాలు నెమరేసుకుంటూ చెప్పా.

"ఆ.. జయా... ఓ సారి హాల్లోకి రాబ్బా! ఇక్కడ చూడు... పాకెట్ బుక్కు ఎంత క్యూట్‌గా ఉందో చూద్దు రా!" జయను పిలిచాను.

వంటింట్లో నుంచి కొంగుతో చేతులు తుడుచుకుంటూ జయ వచ్చింది. "రాజీ!... వారెవా ఎన్నాళ్ళకొస్తివే. ఏదీ నీ పాకెట్ బుక్... అబ్బో కవర్‌పేజీ అదిరిపోయిందే. అబ్బో! కుందనానికి కుందనం తొడిగినట్లు ఆ డ్రస్సు అబ్బో! చాలా బాగుందే... రా! రా!" అంటూ చేతులు చాచింది జయ.

"వూ! అది వస్తేగిస్తే నా దగ్గరికే రావాలి ఇంకాసేపు ఆగి.. నీ దగ్గరకెందుకొస్తుంది... చూడు..." చేతి పైన బొంగరం తిప్పుతూ అన్నాను. ఆ పిల్ల బొంగరం వైపే కళ్ళప్పగించి చూస్తుంది. సరే జయా... ఏమైనా స్నాక్సో, స్నేక్సో.. తీసుకురా! మా పీకాక్ వచ్చిన సందర్భంగా..." రాజీ వైపు చూస్తూ చెప్పాను.

ఫక్కున నవ్వి... అబ్బా! నా అడ్డ పేరు ఇంకా ఎంత బాగా గుర్తు పెట్టుకున్నారు సార్! పాపను టేబుల్ పై కూర్చో పెడుతూ అంది రాజీ.

ఆ పేరు పెట్టింది నేనే గదా.. ఎట్లా మర్చిపోతాను. ఆ సరే గాని... ఈ బొమ్మ పేరు ఏం పెట్టావ్..

పేర్లు పెట్టేది మీరే కదా సార్.. అందుకే ఇప్పుడు దీన్ని మీ దగ్గరకు పట్టుకొచ్చా! మా వూరు నుంచి... చెప్పింది రాజీ.

ఓహో!... ఇంకా నామకరణం జరగలేదా! వీళ్ళ అవ్వా! తాతా! బాగున్నారా!.. అడిగాను.

బాగున్నారు. ఓ యబ్బ! వీళ్ళ తాతైతే ఒకటే నస. చంద్రయ్య సారు దగ్గరికి నేనొస్తా! నేనొస్తా అని. వద్దులే నాన్న! సాయంత్రానికంతా తిరిగొస్తాం అని. నేనూ, సాయి బాబాయ్ ఆటోలో వచ్చాం సార్! చెప్పింది రాజీ.

అదిగో మాటల్లోనే వచ్చేశాడు సాయి. రా! సాయీ! బాగున్నావా.. జయ సాయిని లోపలికి పిల్చింది.

బాగున్నానమ్మా! సార్! నమస్తే బాగున్నారా! కెమెరా బ్యాగు టేబుల్ మీద పెడుతూ కూర్చున్నాడు.

సాయీ... మీ ఊళ్ళో నా ఫేర్‌వెల్‌కు తీసిన ఫోటో ఆల్బమ్ చూసి నిన్ను భలే గుర్తు చేసుకున్నాం. భలే వచ్చేశారిద్దరూ. పదండి భోజనాలు చేద్దాం! వంటింట్లోకి వెళ్తూ చెప్పాను. జయా... ఏదైనా కొంచెం స్పెషల్ చేయి. రాజీ! లోపలికొచ్చెయ్ నాన్నా... ముందు కాఫీ తాగుదాం... అంటూ సోఫాలో కూర్చున్నాను.

రాజీ పూర్తి పేరు రాజరాజేశ్వరి. బస్తిపాడులో నేను పని చేస్తున్నప్పుడు నా దగ్గర చదువుకుంది. వాళ్ళ నాన్న రామకృష్ణయ్య మంచి మోతుబరి రైతు. యాభై ఎకరాల ఆసామి. ముగ్గురు కూతుళ్ళు. తను చదువుకోలేదని ముగ్గురినీ బాగా చదివించాడు. రాజీ చాలా హుషారైన పిల్ల. మొదటి నుంచి కర్నూల్లో పెద్ద పెద్ద స్కూళ్లలో గనక చదివి వుంటే రాజీ కచ్చితంగా ఐఎఎస్ సాధించగల్గిన సామర్థ్యం ఉండే అమ్మాయి. ఇప్పటికైనా జడ్‌పీ స్కూల్లో చదివి... తర్వాత్తర్వాత బి.టెక్ దాకా చదివి బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తుంది. నేనంటే చాలా అభిమానం. ఫోన్లు చేస్తూనే వుంటుంది. అప్పుడప్పుడూ వచ్చి పోతూ వుంటుంది.

భోజనాలయ్యాక అందరం సోఫాలో కూర్చున్నాం.

ఓయ్!... పాకెట్ బుక్కూ! ఇట్రావే! ఏంటే నీ సంగతి! నువ్వు మీ అమ్మను అబ్బను మించిపోయేటట్లున్నావే! రా! రా! ఇట్లా నిలబడు. పాపను రాజీ దగ్గర నుంచి తీసుకొని టీపాయ్ మీద నిలబెట్టాను.

రాజీ .. అబ్బబ్బ... అదిగో పెట్టేసింది సంతకం నీ బిడ్డ. నా పేపర్లన్నీ తడిసిపోయాయి. పైగా రాగం తీస్తుంది... ఓయ్!... నా కళ్ళద్దాలు పట్టుకో... అనంగానే ఆ పిల్ల కళ్ళద్దాలు పట్టేసింది. అబ్బో! మీ అమ్మేమో రాజరాజేశ్వరి. నువ్వేమో రాగరాగేశ్వరి వున్నట్టున్నావు కదే.. పిల్లను ఒళ్లో కూర్చోబెట్టుకుంటూ అన్నాను.

'సార్! మంచి పేరు పెట్టేశారు. రాజీ కూడా ర అక్షరంతో పేరు రావాలని అనుకుంటుంది.' అన్నాడు సాయిబాబా. 'అట్లాగా... అది సరే గానీ రాజీ! ఈ పిల్ల నాన్న రాలేదా... ఆయన్ను పిల్చు కొచ్చింటే బాగుండేది కదా...' అన్నాను.

రాజీ మొహం అదోలా మార్చేసింది. ఏమీ పలక లేదు.

అదేమిటి రాజీ.. వీళ్ళ నాన్న... వీళ్ళ జేజబ్బ ఏం పేరు పెట్టాలనుకుంటున్నారో... మనం పెట్టే పేరు వాళ్ళకు నచ్చక పోతే... ఏదీ ఓ సారి వీళ్ళ అబ్బకు ఫోన్ చెయ్.' అన్నాను.

రాజీ మాట్లాడలేదు.

సాయిబాబా మాట్లాడాడు. 'వద్దులెండి సార్!... పాప పుట్టి మూడునెలలైనా వాళ్ళెవరూ యింతవరకు చూడ్డానికి రాలేదు. అందుకే రాజీ మనసేం బాగాలేదు.'

నేనూ జయ షాక్‌కు గురయ్యాం. పాపను జయ చేతికిచ్చి నేను కళ్ళద్దాలు తీసి టీపాయ్ మీద పెట్టాను.

'అదేమిటమ్మా.. అబ్బాయి బాగా చదువుకున్నాడు కదా! పెళ్ళిలో ఆ అబ్బాయి, అబ్బాయి తండ్రీ చాలా బాగా మాట్లాడారు.' చెప్పాను.

'మాటలకేం సార్ ! చాలా తీయగా ఉంటాయి. చేతలవరకు వస్తే చాలా చేదుగా ఉంటాయి' సాయిబాబా చెప్పాడు.

'అస్సలేం జరిగింది?'

'ఏముంది సార్! ఆడపిల్ల పుట్టిందని ఫోన్ చేయగానే, అబ్బాయి తండ్రి 'మళ్ళీ దరిద్రం పుట్టిందా!' అని డైరెక్టుగా తిట్టాడు. చూట్టానికి వెళ్ళొద్దని కొడుకును కట్టడి చేశాడు. వాళ్ళింట్లో అందరికీ ఆడపిల్లలే పుట్టారట. మగ పిల్లాడు కావాలని కలలు గన్నారట. అవి కల్లలైనందుకు... యిలా...' సాయిబాబా చెప్తున్నాడు. రాజీ.. జయ ఒళ్ళో తలపెట్టి జల జలా కన్నీళ్ళు కార్చేసింది.

నా గుండె కలుక్కుమంది. ఎంత హుషారైన చలాకీ పిల్ల. ఇంగ్లీషులో టెన్సెస్ చెప్పినా, యాక్టివ్ ప్యాసివ్ వాయిస్ చెప్పినా, మ్యాథ్స్‌లో పైథాగరస్ థియరీ చెప్పినా... చిటికెలో జవాబు చెప్పిన ఏకైక విద్యార్థి రాజీ! నా మొత్తం సర్వీస్‌లో చూసిన ద మోస్ట్ ఇంటిలిజెంట్ స్టూడెంట్. అలాంటి రాజీకి ఇలా జరగడం బాగోలేదు.

'మీతో ప్రతీది చెప్పలేదు గానీ, చేసుకున్నప్పట్నుంచీ... చాలా చాలా కష్టాలు.. పెదవిని పంటికింద నొక్కి భరించింది రాజి. ఇంక ఇది జరగడంతో పూర్తిగా ఆమె మనసు విరిగిపోయింది.' చెప్పాడు సాయిబాబా.

'అబ్బాయి తల్లిదండ్రుల్ని, అబ్బాయిని ఒకసారి పిలిపించి మాట్లాడదాం!' ... అని సాయిబాబాతో అంటుంటే–

'వద్దు సార్... విషపురుగు అని తెలిశాక దాన్ని మళ్ళీ దగ్గరకు తీసి తల దువ్వటం మూర్ఖత్వమే అవుతుంది. నేను అన్నీ ఆలోచించి లాయర్ ద్వారా డివోర్స్ నోటీస్ పంపించాను.' చెప్పింది రాజీ.

సాయంత్రం కాఫీ తాగాక... 'వెళ్లొస్తాను సార్! నా పర్సనల్ విషయాలతో మీకు తలనొప్పి కల్గించివుంటే... మన్నించండి..' రాజీ మా యిద్దరితో చెప్పింది.

'అట్లా ఏమీ లేదమ్మా... నేనే ఓసారి మీ వూరొస్తా. నాన్నతో మాట్లాడతా...' అన్నాను.

◆ ◆ ◆

నేను ఆఫీసు రూంలో ఉన్నప్పుడు ఇద్దరు మధ్య వయస్కులైన దంపతులు మాసిన బట్టల్లో తలుపు అవతలనే నిలబడి వున్నారు.

'ఎవరూ... ఏం కావాలి' అడిగాను.

'మేం సార్... మాధవి వాళ్ళ అమ్మానాన్నలం. మీతో కల్సి పోదామని వచ్చినాం.'

'ఆ ఏమిటో చెప్పండి..'

'నా పేరు నర్సయ్య. దీని పేరు జయమ్మ సారూ. అదే సార్ ఈ రెండొందలు తీస్కో..' అంటూ రెండు వందనోట్లు నాకు యివ్వబోయాడు.

'ఎందుకయ్యా! దేనికోసం...' అడిగాను అర్థంకాక.

'అదే సార్.. మా పాప బిందుమాధవిది నిన్న పుట్టినరోజు.. అదేంది నాకు నోరు తిర్గి సావదు. దాన్నేమంటరే... అది తెప్పిచ్చి కోపిచ్చినవంట గద.' చెప్పాడు నర్సయ్య.

'అదే సార్. నిన్న బడిలో మా పాపకు బర్తుడే కేకు తెప్పిచ్చినవంట. సార్ ! మాకు పుట్టిన దినాలు గిట్టిన దినాలు వుండవు. నిన్న పాప పుట్టిన రోజని తెల్సుకోకుండా మట్టి పనికి పోయినం. రేతిరి మేం పని కాన్నుండి వచ్చినంక యింటికాడ పిల్లలంత గుంపుగూడి సెప్తుంటే నా కడుపు నిండి పోయిందనుకో.' చెప్పింది జయమ్మ. 'అందుకే పద్దన్నే ఈ రొండొందలు నీకిచ్చి పోదామని వచ్చినం. తీస్కో సారు' చెప్పాడు నర్సయ్య.

'ఆ! అదేం పెద్ద భాగ్యమా.. నిన్న తన బర్త్‌డే అని తెలిసి కేక్ కట్ చేయించాను. పిల్లలందరికీ చాక్లెట్లు తెప్పించాను. పిల్లలందరూ హ్యాపీ బర్త్ డే టూ యూ! అంటూ చేసుకున్న సంబరం చూస్తే నాకు భలే సంతోషమనిపించింది. నరసయ్యా! మనం చిన్నగున్నప్పుడు ఈ బర్త్‌డే గిర్త్‌డేలు లేవు. కాని యిప్పుడు పిల్లలందరికీ కేక్ కోయడం, పంచడం సరదా అయిపోయింది. పిల్లల సంతోషం చూద్దామని చేశా... దానికి నూ డబ్బు తీస్కరావడం బాగల్యా! వద్దు తీసుకెళ్ళు' అన్నాను సీటులోనుంచి లేస్తూ.

'సార్! తీసుకోండి.' పదేళ్ళ మాధవి గోముగా వాళ్ళమ్మ కొంగుచాటు నుండి తొంగిచూస్తూ చెప్పింది.

'ఓహో! నువ్వు రెకమండేషనా తల్లీ! తీస్కుంటా! తీస్కుంటా! నూ బాగా చదివి ఉద్యోగం చేసి డబ్బు సంపాదిస్తవు గద. అప్పుడు వడ్డీతో కలిపి తీస్కుంటలేమ్మా!... యిప్పుడు పోయిరా' అన్నాను. ముగ్గురూ గట్టిగా నవ్వారు.

'నర్సయ్యా! మాధవిని మధ్యలో బడి మానిపించొద్దు. పోయిన సంవత్సరం మాదిరి గుంటూరు పొగాకు పనికి పిల్చక పోవద్దు. మాధవి చాలా తెలివైన పిల్ల బాగా చదువుకుంటది' చెప్పా.

'సరే సర్! ఏదో అంతా మీ దయ.' అంటూ నర్సయ్య, జయమ్మ, మాధవి నిష్క్రమించారు.

అప్పుడే సాయిబాబా వచ్చాడు. 'ఏం సార్! మా నర్సయ్యను బడికాడికి పిలిపిచ్చినవు. ఏ మన్నా గుంత తవ్వేపని వుందా... మట్టి పని చేయడంలో మా రాజులెక్కటోడు నర్సయ్య.' అన్నాడు.

'అరే! నీకు నర్సయ్య తెల్సా...' 'తెల్సా.. అంటారేంది సార్... యిరవై ఏళ్ళనుండి తెలుసు. కర్నూల్లో మా యింటి పని చేసింది వాళ్ళిద్దరే సార్.' చెప్పాడు సాయిబాబా.

'అవునా! అదే వాళ్ళ పాప మాధవిది నిన్న బర్త్‌డే ఉండింది. వాళ్ళు పనికి పోతే నేనేదో తమాషాగా కేకు తెప్పించి చిన్న సంబరం చేశా! దానికి డబ్బులియ్యడానికి వస్తే వద్దని చెప్పి పంపించా..'

'అబ్బో! ఆ పిల్లంటే పానమిడుస్తరు సార్ వాళ్లిద్దరూ. కొడుకులిద్దరున్నా గాని వాళ్ళకు ఆ పిల్లమీదే శానా గురి.. ఆ పిల్ల పుట్టినరోజు వెనక ఓ కథ ఉంది సార్. ఎవ్వరికీ చెప్పనంటే చెప్తాను. మీరు చెప్పరులే...' అంటూ మొదలెట్టాడు సాయిబాబ.

'అది కర్నూలుకు వరద వచ్చిన రోజు. అప్పుడు నర్సయ్య, మేమూ అంతా కలిసి గవర్మెంటాసుపత్రి ఎనక వుండే గుడిసెల్లో ఉండేటోల్లం. నేనొక చిన్న పత్రికలో ఫోటోగ్రాఫర్‌గా పని చేస్తుంటి. ఆరోజు నర్సయ్య చెల్లెలుకు కాన్పయి ఆడపిల్ల పుట్టిందంటే చూద్దానికి మేమందరం వెళ్ళినాము. అర్థరాత్రి పొద్దు పోయినాక కాన్పయింది. పిల్లను చూసినం. నర్సయ్య దంపతులకు అప్పటికే పెళ్ళయి పన్నెండేళ్లయింది. పిల్లలు కలుగ లేదు. నన్నడిగేటోళ్ళు. యాడన్నా ఒక పిల్ల దొరికితే సాలు సూడన్నా. మా పిల్లేనని పెంచుకుంటాం... అని. ఆ రోజు ఆస్పత్రిలో శానా పొద్దు పోయింది. ఊరంతా వరద పుకారు పుట్టింది. మేము నడుచుకుంటూ కంటి ఆసుపత్రి గేటు కాడకొచ్చినం. ఉరుము, మెరుపు, గాలివాన ఊపందుకుంది. సరిగ్గా గేటు కాడ పొదల నడుమ నుంచి ఒక సంటిదాని ఏడుపు యినిపిచ్చింది. ముగ్గురం నిలబడిపోయినాం. ఏడుపు వినిపిస్తానే వుంది. నేను బ్యాగులో నుండి టార్చి కెమెరా తీశాను. టార్చి యేసి సూసి ముగ్గురం బొమ్మలెక్క నిలబడిపోయినం. దొండపండు లెక్క ఎర్రటి ఆడపిల్ల. గుక్క పట్టి ఏడుస్తుంది. చుట్టు పక్కల చూసినాం. నేను చాలా దూరం వరకు టార్చి ఏసి సూసినా. మనిషి జాడనే లేదు. నాకు వెంటనే మైండులో బల్బు వెలిగింది. వాళ్ళిద్దరినీ పిల్చి చెప్పాను. ముందు ఆ పిల్లను సేతుల్లోకి తీస్కోండి అన్నాను. ఎవురిపిల్లో ఏం కతనో... అని ఇద్దరూ జంకుతున్నారు.

'ఏం ఆలోచించొద్దు. ముందు ఆ పిల్లపానం కాపాడల.. మా పిల్ల అని ఎవరన్నా వస్తే యిచ్చేద్దాం. ల్యాకుంటే తర్వాత సంగతి తర్వాత సూసుకుందాం. అమ్మా! జయమ్మా! ముందు ఆ పిల్లను కొంగులో సుట్టుకో...' అని గట్టిగా చెప్పినా... వాళ్ళిద్దరూ తడబడుకుంటూ జోరువానలో తడుస్తూ ఆ పిల్లను చేతుల్లోకి తీసుకున్నారు. ఆమె స్పర్శ తగలంగానే ఆ పిల్ల ఏడుపు నిదానంగా ఆగింది. నా బండి మీద వాళ్ళిద్దర్నీ కూర్చోబెట్టుకుని మా ఇళ్ళు చేరినాం. మరుసటి రోజు కర్నూలు నిండా నీళ్ళు. మేం గూడా తట్టా బుట్టా ఆ సంటి పిల్ల నెత్తుకొని జగన్నాథగట్టుకు పోయినాం. ఆ తర్వాత ఇదిగో ఈ వూర్లో గవుర్మెంటు యిల్లిస్తే ఈడికొచ్చి వున్నారు. ఆ పిల్ల గురించి ఎవ్వరు అడగలేదు. ఆ పిల్ల నర్సయ్య వాళ్ళ యింట్లో పెరగడం మొదలు పెట్టినాల్నుండి నర్సయ్య చేతి రేఖ తిరిగింది. తకరారులో వుండే ఒక నాలుగు

సెంట్ల స్థలం నర్సయ్య కొచ్చె. వాళ్ళమ్మది మూడు తులాల బంగారొచ్చె. ఒకసారి నవ్వులాటకు నేను జయమ్మా! ఆ పిల్ల వద్దులే. పోయి పోయి ఆడప్లిను ఏం సాకుతావ్! నాకు తెల్సినోళు మొగపిల్లోన్ని యిస్తరంట. ఆ పిల్లను యిడ్సిపెట్టు అంటే, జయమ్మ... 'వాయబ్బ! బాగ జెప్పినవ్. నేను పండ్రెండేళ్ళు నాకు ఆడప్లినే యియ్యమని దేవుండ్లకి మొక్కిన. అందుకే నాకు ఆడపిల్ల లచ్చిమి లెక్క దొరికింది.' అని చెప్పింది సార్.

'తర్వాత వాళ్ళిద్దరికీ ఇద్దరు మొగపిల్లలు పుట్టినారు. అదంతా ఆ పిల్ల పుణ్యమే అని వాళ్ళు ఆ పిల్లను బంగారు లెక్క చూస్కుంటున్నారు. ఆ పిల్లను తీస్కోని జయమ్మ తన పుట్టినిల్లు మద్దికెరకు పోయి యింటి దేవత మద్దమ్మ అని పేరు పెట్టుకున్నారు. తర్వాత బాగుండదని బిందు మాధవి అని మార్చుకున్నారు. అదీ సార్ ఆ పిల్ల కత...' సాయిబాబా చెప్తుంటే నా ఒళ్ళు గగుర్పొడిచింది.

నేనా దిగ్భ్రమ నుండి తేరుకోకముందే సాయిబాబా 'సార్! మర్చిపోయినా.. ఈ కత ఆ పిల్లకు గూడా తెలియదు. తెలియనియ్యకూడదు. పొరపాటున కూడా తెలియగూడదు సార్!' అన్నాడు.

'వస్త! ఇదిగో! బస్తిపాడు స్కూల్లో జరిగిన ఫంక్షన్ ఫోటోలు యింకా కొన్ని నా దగ్గర ఉండ్యా .అవి యిచ్చిపోదామని వచ్చిన. తీసుకోండి.' అంటూ సాయిబాబా లేచి నిబడ్డాడు.

'అది గాదు సాయీ! మన రాజేశ్వరి కథ.. ఈ మాధవి కథ వింటుంటే నాకు... అస్సలేమీ అర్థం కావటం లేదు.' కళ్లు చెమర్చి... యిక మాట్లాడలేక ఆగిపోయినాను.

'సార్... మనసున్నోల్లు గాబట్టి మీకు బాదేస్తుంది. ఆ! అన్నట్టు చెప్పడం మర్చిపోయినా. రాజీకి భర్తతో విడాకులు అయిపోయినై సార్! అంతే.. కొన్ని అలా జరిగిపోతుంటాయి. రాజీ భర్త, తండ్రి మోడ్రన్ మనుషులు సార్.. కానీ మురికి మనసులు. నర్సయ్య జయమ్మ చేసేది మట్టి పనే కానీ వాళ్ళవి మాణిక్యాల్లాంటి మనసులు సార్!' అంటూ సాయిబాబా వెళ్ళిపోయాడు.

ఆ రోజు రాత్రంతా నాకు రాజి అత్తామామ ఒక కంట్లో... నర్సయ్య, జయమ్ము మరో కంట్లో మెదులుతూనే వున్నారు. పెద్ద పెద్ద చదువులు... సాఫ్ట్వేర్ ఉద్యోగాలు... ఫారిన్ కొలువులు .. ఆడపిల్ల పుట్టుకే వినలేని సంస్కారాలు.. అటు... ఆడపిల్ల లచ్చిమి లెక్కడిది. ఆడపిల్లే కావాలనే జయమ్మ నర్సయ్య... తల్చుకుంటే వాళ్ళిద్దరూ గొప్ప దంపతుల్లా... కళంకం లేని కమ్యూనిస్టుల్లా.... మట్టి విలువ తెలిసిన మహామనుషుల్లా అనిపించారు. నా కళ్ళ నుండి జారే బాష్పాల పొరల్లో వాళ్లు కదలాడుతూనే వున్నారు. ■



## బొంకులదిబ్బ


- రత్నాల బాలకృష్ణ
9440143488


అంకం మారినప్పుడల్లా
అక్కడొక కొత్త వర్ణపటం
తనను తాను చిత్రించుకుంటూ వుంటుంది
గంటస్తంభం ముళ్ళు
స్థానభ్రంశం చెందినప్పుడల్లా
టీవీ తెరపై చానళ్ళు మార్చుతున్నట్లు
అక్కడొక కొత్త దృశ్యం రంగులు పులుముకుంటుంది
నలుపు తెలుపు తెరపై నల్లదేహం
కావిడితో దేశాన్ని మోస్తూ వుంటుంది
దృశ్యం మారినప్పుడల్లా
సరికొత్త వర్ణం తెరకి జోడించబడి
క్షణానికొక కొత్తరూపు జతపరుస్తుంటుంది
రంగులు ఎన్ని రకాలైనా
కాలభ్రమణంలో ఏకమై
చిక్కటి చీకటిని పట్టపగలు
స్రవిస్తూ వుంటుంది

దేహాలు ఒకపక్క వేలం వేయబడుతూవుంటాయి
సమస్త దేహాల భాషనూ
రంగుల సుద్దముక్కతో
రోడ్డుపై వర్ణరంజితంగా గీయబడుతువుంటుంది
దేశంలోని సమస్త కూడళ్ళలో
ఇదే దృశ్యం ప్రతిఫలిస్తూవుంటుంది
వర్ణపటంలో చిత్రించిన ప్రతి రంగూ
ఆకలి కుంచెతో గీయబడినదే! ■



## చినుకు చిరు స్పర్శ

అనుక్షణం నిరీక్షించి
నీరసించి నిర్వేదమైన వేళ
తపించిన మనసును చల్లని పిల్లగాలి చుట్టుకున్న
ఆనందహేల
ఉరుములే మంగళవాద్యాలై
నల్లని మబ్బు తునకలు ఏడువారాల కానుకై
మెరుపు దివిటీలు దారి చూపిస్తుంటే
మేఘాల గుర్రమెక్కి
తలంబ్రాలై తొలకరి జల్లులు జాలువారగా
తపనల చినుకుల చిరు స్పర్శలో
ఒక్కసారిగా ఝల్లుమన్న
పుడమి అణువణువున పులకరింపుల వేణువులే
ఎదురుచూస్తున్న ఆ మట్టిరేణువుల
గుండె గూటిలో
వేవేల వేకువల సంబ్రమలే
దూరం భారమై విరహము వేదనై
ఇక వల్లకాదంటూ వర్షమైన
ఆ ప్రేమ తడిని
తనువంత నలుగుల పూసుకుంటూ
గుప్పెడు మల్లెలు ఫక్కున నవ్వినట్లు
మట్టివాసన మధుపర్కమే అయ్యింది
ఏడడుగుల ఏరువాకే అయ్యింది
రేపటి పచ్చని పందిరిని తలుచుకుంటూ ...

**- మంజుల సూర్య**

**97040 22244**

## మేఘవర్ణాలు

నేలకోసం
తరలివచ్చిన మేఘ వసంతం
కొన్ని పచ్చని దృశ్యాలను వెదజల్లింది

ఎక్కడో
సముద్ర కెరటాలనుంచి ప్రయాణించి
ఎలా రూపాంతరం చెందిందో ఏమో
రాలిన చినుకులు
చెట్లపై రంగులు
సీతాకోక చిలుకలుగా పూసాయి!

నిజానికి
ఆకాశం గొప్ప అబ్ స్ట్రాక్ పెయింటర్
చినుకుల జల్లింపులో
సప్తవర్ణాలను గుమ్మరిస్తుంది


ఏ రంగుతో ఏ వర్ణం మిశ్రమం చేస్తుందో
తెల్లారేసరికి నగ్నతరువులు
చిలకపచ్చ పావడా తొడిగిన తరుణులవుతాయి

ఎడారులు
హరిత మొలకల నక్షత్రాలను పూస్తాయి
షడ్రుచుల పండ్లను పరిమళిస్తాయి
మొత్తంగా తులిప్ వనాలను నాటి
భూమిని పూల స్వర్గం చేస్తాయి!

**- గరికపాటి మణీందర్**

**99483 26270**








# స్వరాజ్య సమరంలో తెలుగు కవులు

- ఎస్ఆర్ పృథ్వి
99892 23245

**మ**న దేశానికి వ్యాపార నెపంతో వచ్చి, దేశ పాలనను చేజిక్కించుకున్న కుతంత్ర రాజకీయానికి ప్రత్యక్ష వారసులు ఆంగ్లేయులు. వారి హయాంలో భారతీయులు స్వేచ్ఛను కోల్పోయి, బానిసలుగా జీవనం గడిపారు. అటువంటి తెల్లదొరల దోపిడీని, దౌర్జన్యాలను దుయ్యబడుతూ ఎందరో తెలుగు కవులు అక్షరాలను అస్త్రాలుగా ప్రయోగించారు. పాటలతో, గేయాలతో కదనరంగం సృష్టించారు.

1885వ సంవత్సరంలో జాతీయ కాంగ్రెస్ స్థాపించబడింది. అదే సంవత్సరం ప్రథమ గోదావరి మండల సభ కాకినాడలో ఏర్పాటు చేశారు. ఆ సభకి న్యాపతి సుబ్బారావు అధ్యక్షత వహించారు. ఆంధ్ర బీష్ముడుగా ఆయన ఖ్యాతిగాంచారు. అంతర్జాతీయ ఖ్యాతినొందిన 'హిందు' పత్రికను ఆనాడు స్థాపించారు. వారి అధ్యక్షతన జరిగిన తొలి సభకు చిలకమర్తి లక్ష్మీనరసింహం కూడా హాజరయ్యారు. ఆనాటి ఆంగ్లేయుల పాలనా విధానాన్ని దయ్యబడుతూ చక్కని పద్యాలు ఆ వేదికపై చదివారాయన. మచ్చుకి ఒకటి..

నేల దున్నుదుమన్న జాల తరము పన్ను
నీరు గావలెనన్న నీటి పన్ను
వాణిజ్య మొనరింపవచ్చు రాబడికి పన్ను
సరకులమ్ముదమన్న సంత పన్ను
కఱ్ఱలమ్ముదమన్న గలపకింకొక పన్ను
పట్టణంబుల మున్సిపాలు పన్ను
పారిపోవుదమన్న బండి హాసీల్ పన్ను
కొంపమ్ము కొన్నచో స్టాంపు పన్ను
ఉన్నమట్టుకు తినకుండ నుప్పు పన్ను
ననెడి పన్నులె దిగదీసి జనులనెల్ల
కటకటా! ఎట్టులున్నదో కాపుల దశ
సుగుణ ధనులార! జనులార చూడరయ్యా!

ఆంగ్లేయుల పాలనలో పన్నుల పేర జరుగుతున్న దోపిడీని నిష్కర్షగా ఆనాడు వేదిక మీద చెప్పారు చిలకమర్తి వారు. కాని, ఇప్పటి దేశ పరిస్థితి అప్పటి కంటె దారుణంగా ఉంది. ఇప్పుడు పన్ను బారినుంచి తప్పించుకున్న వస్తువు లేదేమో! పన్నుల పేర ప్రభుత్వాలు ప్రజలను ఎంతగా, ఎన్ని రకాలుగా దోపిడీ చేస్తున్నాయో మనమెరుగుదుం. చిలకమర్తి వారి పద్యాన్ని న్యాపతి సుబ్బారావు గారు గురజాడ అప్పారావు గారికి పంపి, ఇంగ్లీషులోకి తర్జుమా చేయించారు.

1906, 1907 ప్రాంతంలో బిపిన్ చంద్రపాల్ దేశమంతటా పర్యటించి, వారి ఉపన్యాసాలతో ప్రజలను స్వాతంత్ర్యోద్యమం పట్ల ఉత్తేజితులను చేశారు. అందులో భాగంగా 1906లో బిపిన్ చంద్రపాల్ కాకినాడ, రాజమండ్రిలో పర్యటించారు. రాజమండ్రికి వచ్చిన సందర్భంలో వారి ఆంగ్ల ఉపన్యాసాన్ని ఆంధ్రీకరించే బాధ్యతను చిలకమర్తి వారు స్వీకరించారు. కిక్కిరిసిన ప్రేక్షకులున్న సభలో బిపిన్ చంద్రపాల్ గారి ఉపన్యాసమంతా జాగ్రత్తగా విని, మనసులో ధారణ చేసుకుని, తెలుగులో తర్జుమా చేసి చెప్పారు. అనంతరం బ్రిటిషు వారి

పాలనా వైఖరిని విమర్శిస్తూ సూటిగా ప్రజల హృదయాల్లోకి చొచ్చుకుపోయే విధంగా చక్కని పద్యమొకటి చిలకమర్తి వారు చెప్పారు.

"భరత ఖండంబు చక్కని పాడియావు
హిందువులు లేగదూడలై యేడ్చుచుండ
తెల్లవారను గడుసరి గొల్లవారు
పితుకుచున్నారు మూతులు బిగియగట్టి"

ఆ పద్యం విని ఆనందోత్తేజంతో ప్రజలు చప్పట్ల వర్షం కురిపించారు. ఊరూరా పాడుకొని చర్చించుకొని పరాయి పాలకుల దౌర్జన్యాలపై కోపం పెంచుకున్నారు.

చిలకమర్తి పద్యం కూడా నేటి పరిస్థితికి అద్దం పడుతుంది. హిందువులు అంటే దేశ ప్రజలు; తెల్లవారంటే పాలకులు; పితకడం అంటే దోపిడీయే కదా! నేటి పరిపాలనకి కూడా ఈ పద్యం చక్కటి ఉదాహరణగా నిలుస్తుంది.

గౌతమీ కోకిలగా పిలవబడే జాతీయ తెలుగు కవి వేదుల సత్యనారాయణ శాస్త్రి గారు కూడా వారి కవిత్వం ద్వారా దేశభక్తిని ప్రకటించారు. వీరి రచనల్లో దేశభక్తిని ప్రేరేపించే కవితా ఖండికలెన్నో కనిపిస్తాయి. 'రాణా ప్రతాప్ సింగ్' నాటకం దేశభక్తికి మారుపేరు. అందులోని ఒక అంశాన్ని తీసుకుని, 'జయగీతి' కవితా ఖండికగా 'దీపావళి' కావ్యంలో ప్రకటించారు. చూడండి..

"తృణము తృణమున శాంతి విరిసెను
దిక్కు దిక్కుల కాంతి మెరిసెను
దేవళమ్ముల మెరిసె జయ
ఘంటాది తానమ్ము
అదే త్రివర్ణ ధ్వజ పటాంచల
ముద పవనోచ్చలితమయ్యెను
వదిలె జయశంఖారావమ్ముల నిదురమైకమ్ము
వీరశౌర్యము, సతుల తేజము
పేదభక్తియు, సాధు దీక్షయు
వృద్ధా పౌరుష మొక్క నూత్నా
వేశమున వెలుగన్"

స్వాతంత్ర్యోద్యమం పట్ల ప్రజలను ఆకర్షించేందుకు ఇటువంటి కవితాఖండికలు అవసరమయ్యాయి. 1919లో జలియన్ వాలాబాగ్‌లో జరిగిన అమానుషమైన కాల్పులు, డయ్యర్ దురంతానికి ప్రతీకగా 'కాగడా'యను గీత రచన చేసినట్లు డా॥ పంపన సూర్యనారాయణ, వారి సిద్ధాంత గ్రంథంలో పేర్కొన్నారు.

"వెలిగించు కాగడా వెలిగించవోయి
ప్రళయ రుద్రుని పాలభాగమ్మునందు
అతని నిశాత శూలాగ్రమ్మునందు
అతని నేత్ర గోళాంతమ్ములందు
జ్వలించు శిఖశిఖ జ్వాలనమ్ము తోడు
వేడిగా, వాడిగా వెరపుగొల్పేదిగా
వెలిగించు కాగడా వెలిగించవోయి"

ప్రళయ రుద్రుడంటే మహేశ్వరుడు. ఈశ్వరుడి ఫాలభాగం వేడినీ, శూలాగ్రం వాడినీ, నేత్రాలు ఎరుపునీ కలిగి ఉంటాయి. అందువల్ల ఈ మూడు లక్షణాలను తీసుకుని ప్రజలను ఉత్తేజపరిచే విధంగా రాశారు. వేదుల వారి కావ్యాల్లో 'ముక్తఝరి' మరొకటి. ఇందులో అనేక కవితా ఖండికలు దేశభక్తిని ప్రేరేపిస్తాయి.

స్వాతంత్ర్యోద్యమ సమయంలో గుర్తుకువచ్చే మరొక కవి గరిమెళ్ళ సత్యనారాయణ. 'ఎల్.టి.' విద్యనభ్యసించేందుకు రాజమండ్రి వచ్చి, బ్రిటిష్ వారి పాలనా విధానాలకు వ్యతిరేకంగా అనేక పాటలు రాసి, స్వయంగా పాడుతూ ప్రజలను ఉత్తేజితులను చేశారు. అదే క్రమంలో అరెస్టయి, కారాగార శిక్ష అనుభవించిన కవి.

"మాకొద్దీ తెల్లదొరతనము దేవ
మాకొద్దీ తెల్లదొరతనము
మా ప్రాణాలపై పొంచి
మా మానాలు హరించే
మాకొద్దీ తెల్లదొరతనము దేవ" అని ఆయన రాసిన పాట ప్రజలను ఉగ్రూతలూగించింది. ఆ పాట ఊరూరా ప్రజల నోట ప్రభంజనమై సాగింది. ఇది పాటకి పల్లవి మాత్రమే. 39 చరణాల్లో ఆంగ్లేయుల దుశ్చర్యల్ని ఎండగడుతూ రాజమండ్రి పురవీధుల్లో స్వేచ్ఛా విహారం చేసిన ధైర్యశాలి గరిమెళ్ల. వడ్డాది సీతారామాంజనేయులు కవి రచించిన దండాలు దండాలు భారత మాత గేయం ఎంతో ప్రాచుర్యం పొందింది. ఆ పాట ఆంగ్లేయుల పాలనను విశదపరుస్తుంది.

"దండాలు దండాలు భారతమాత
నీవందుకోని దీవించు భారతమాత
నీవందుకోని దీవించు భారతమాత
దండాలు దండాలు భారత మాత
మా కొంపల్ని కూల్చినారే భారతమాత"

భావ కవితావనంలో వికసించిన కృష్ణశాస్త్రి రచనల్లో కూడా దేశభక్తి ప్రవహించింది.

“జయ జయ జయ ప్రియభారతి
జనయిత్రీ దివ్యధాత్రి !
జయ జయ జయ శత సహస్ర
నరనారీ హృదయ నేత్రి!” అంటూ ఆయన రాసిన గీతం ఎంతో ప్రసిద్ధి చెందింది.

“ స్వాతంత్ర్య రథం! స్వాతంత్ర్య రథం!
అదిగదిగో అదే అదే అదే
స్వాతంత్ర్య రథం ! స్వాతంత్ర్య రథం !
శీత ధరాధర నేత్వంతర నర
నారులతో స్వాతంత్ర్య రథం
.. .. .. ..
గతహత సాక్షులు గళవిగళద్రుధి
రాంకముతో స్వాతంత్ర్య రథం
శత శత మానవ మాంసల భుజ ధృత
పాశముతో స్వాతంత్ర్య రథం” గేయం కూడా ఆయన కలం నుంచే జాలువారింది.

ఇటువంటి నేపథ్యంలోనే డా॥ పి. తిరుమలరావు ‘నేను స్వాతంత్ర్య సమరయోధుడను’ అని గర్వంగా ప్రకటించుకున్న సందర్భం కూడా లేకపోలేదు.


“నేను స్వాతంత్ర్య సమరయోధుణ్ణి
నాటికీ నేటికీ సమిథలా
యజ్ఞంలా ఆహుతి అయ్యే
ఆలోచనలో వున్న వాణ్ణి ”

స్వాతంత్ర్య సిద్ధికోసం, తెలుగు వెలుగు కోసం నిరంతరం తపించిన తెలుగు కవులెందరో ఉన్నారు. అందరినీ విశ్లేషించటం సాధ్యం కాదు గనుక, విశ్లేషిస్తే ఒక గ్రంథమే అవుతుంది గనుక, చివరిగా ‘జంపన’ గారి ‘ఆంధ్రజ్వాల’ అనే కావ్యంలోని ‘ప్రబోధము’ కవితా ఖండిక వారి హృదయార్తిని వెల్లడి చేస్తుంది.

“నేను తెలుగు వాడను; తల్లి నేల కొరకు
రాల్చు కన్నీళ్ళె రత్నాల రాసులగును
నేను తెలుగువీరుడు; తల్లి నేల కొరకు
కార్చు రుధిరమ్మె స్వాతంత్ర్య సుధల నొసగు” అంటారు.

ఇంకా శ్రీపాద, నాళం కృష్ణారావు, సోమసుందర్, కోటితలపూడి సీతమ్మ మున్నగు వారెందరో ఈ రహదారిలో నడిచి, దేవభక్తనెడి మొక్కలు నాటారు. స్వాతంత్ర్యోద్యమంలో కవుల పాత్ర మరువరానిది. వారి అక్షరాలు జ్వాలా చిత్రాలై ప్రకాశిస్తాయి. ■

## నానీలు



■ ఆశయాలు
పరీక్షల్ని పెడతాయి
ఓర్పు నేర్పులు
గెలుపు నిస్తాయి

■ ఆధునికుడివా
కిరాతకుడివా!
పరువు పేరిట
ఈ హత్య లేందిరా!

■ ఊరెళ్ళాను
జ్ఞాపకాలను తెచ్చాను
మట్టి మమతల్లో
మళ్ళీ పుట్టాను

■ కథలన్నీ
ఎక్కడి కెళ్ళాయి?
కాళీపట్నం వారి
కథా నిలయానికి!

■ కదిలే కాలంలో
తరిగే వయస్సు
వద్దనుకున్నా
మేల్కొనదా! ఉషస్సు

■ కష్టపడరు
పనిచెయ్యరు!
ఓ బ్యూరోక్రసీ
ఎక్కడ! నీ డెమాక్రసీ!


■ కరోనా చెప్పిన
గొప్ప పాఠం!
‘అంతా ఒక్కటే’
అదే దాని తత్వం!

■ కల్తీల మయం
నేటి వ్యాపారం!
మూడు పువ్వులు
ఆరు కాయలు !

■ కరెంటు కోత
చీకటిని తెచ్చింది!
మిణుగురులారా
ఇటు వస్తారా!

■ గాలి మేడల్లో
జీవితముందా?
మట్టి బతుకుకు
మన్నిక ఎక్కువ!

**- బి.గోవర్ధనరావు**
**94419 68930**




# అప్రమత్తత, బాధ్యత కలగలిసిన దుఃఖం

- సాంబమూర్తి లండ
96427 32008

**చొ**క్కాపు ఎప్పుడూ నిద్రపోడు. ఆ మాటకొస్తే ఉత్తరాంధ్ర మట్టి మీద మొలిచిన ఏ అక్షరాల చెట్టూ నిద్రపోవడానికి లేదు. ఇక్కడ బతుకులు అంత త్వరితగతిన విధ్వంసమవుతుంటాయి. ప్రజలను మభ్య పెట్టి మెడలు నరికే కరవాలాలకు లెక్కే లేదు. ఇది దుఃఖగని. ఏ పిడికెడు మట్టిని తవ్వినా ఏదో శోకఖనిజం బయట పడుతుంది. నిరంతర మెలకువ చొక్కాపు శిల్పం. సామాజిక బాధ్యత లక్ష్మునాయుడి శైలి. వర్తమాన సకల అస్తవ్యస్త వ్యవస్థలూ జీవితాలూ అతడి కవితా వస్తువులు. ఉపాధ్యాయుడిగా సామాజిక, రాజకీయ, ఆర్థిక వ్యవస్థల పట్ల అవగాహన మాత్రమే కాకుండా వాటి లోగుట్టు తెలిసినవాడు కాబట్టి కవిత్వమై అతడు కలవరించేదీ అవే వస్తువులు. అవే దృశ్యాలు. అవే ప్రతిబింబాలు.

'చొక్కాపు'ది ఉత్తమ కవిత్వం. తెలుగు నేలలో కవిత్వానికి ఇస్తున్న ప్రతి పురస్కారాన్నీ గెలుచుకున్నాడు. జాతీయ అంతర్జాతీయ సంస్థలు తెలుగులో నిర్వహించే ప్రతి పోటీలోనూ గట్టి గింజ అని నిరూపించుకున్నాడు. ఇంత ప్రయాణం తర్వాత 'కుంకుమ పువ్వుల దుఃఖం'గా పుస్తక ప్రపంచంలోకి తొలి అడుగు వేసాడు. ఒక్కమాటలో చెప్పాలంటే ఇది అతడి ఉత్తమ కవితల సంపుటి. సహజంగానే చొక్కాపు వాక్యాలకు సామాజిక అప్రమత్తత ఎక్కువ. ఆ దృష్టితో చూసినప్పుడు ప్రతి చోటా అతడికి దుఃఖమే కనిపించి వుంటుంది. అన్ని దుఃఖాల్లోనూ స్త్రీ దుఃఖమే ఎక్కువగా తారసపడి ఉంటుంది. కవి చూపు సున్నితమూ సునిశితమూ కాబట్టి స్త్రీల నెలసరి వేదనను 'కుంకుమ పువ్వుల దుఃఖం' అని రూపకీకరిస్తున్నాడు. కుంకుమ పువ్వులు అనగానే కశ్మీర్ లోయ గుర్తొస్తే మాత్రం అందులో ఈ కవి తప్పేం లేదు.

'ఉద్దానం' అనే పదం 'ఉద్యానవనం' అనే పదం నుంచి వచ్చి వుండవచ్చని అంటారు. శ్రీకాకుళంలో ఉద్దానం ఏడు మండలాల్లో విస్తరించిన తీర ప్రాంతం. ఒక వైపు కోనసీమను మరిపించే పచ్చని కొబ్బరి తోటలు. మరోవైపు అందమైన సముద్ర తీరం. కానీ ఉద్దానం ఇప్పుడొక శోక తీరం. కిడ్నీ వ్యాధులతో జనం పిట్టల్లా రాలిపోతున్న విషాదం. ఈ విషాదమే కవి 'ఉద్దాన పర్వం'. 'ఇక్కడి మనుషుల్ని కదిలించకండి!/ ఇంటికో కథ/ గడప గడపకో కన్నీటి గాథ/.. వర్తమానం ఆర్తనాదమై రగులుతున్న చోట/ రేపటిని కోల్పోతున్న రంపపు కోత'. దాదాపు రెండు దశాబ్దాలుగా కిడ్నీ వ్యాధుల భూతం విజృంభిస్తున్నా ప్రభుత్వం పూర్తి స్థాయిలో స్పందించకపోవడాన్ని తలచుకుని తీవ్ర అసహనానికి గురైన కవి.. ముగింపులో – 'ఇక్కడి మనుషుల్ని మభ్య పెట్టకండి/... ఇక ఉత్తరించేది పాగా కుచ్చుల్ని కాదు/ కుత్తుకల్నే.' అంటాడు. ఇది ధర్మాగ్రహమే తప్ప బ్యాలన్స్ తప్పడం కాదు.

ఒక కవితలో వస్తువు యొక్క అన్ని డైమెన్షన్స్ ఆవిష్కరించడం చొక్కాపు అలవాటు. 'పంట పువ్వు' కవితలో రైతు భారతాన్ని సంపూర్ణంగా చిత్రిస్తాడు. 'కమతం సిగలో మెరిసిన పంటపువ్వు/ కరువు రక్కసి కాళ్ళ కింద నలిగి/ రెక్కలు వీడి, వాడుతున్నప్పుడు/ అతని గుండెల్లో పదిలంగా నిద్రపోతున్న దేశపు శ్వాస/ ఓడిపోతున్న సంగతి అతనికి తెలుస్తుందో లేదో!' ఈకవితకు ప్రాణం ఈ చివరి వాక్యంలో ఉందనిపించింది.

ఈ దేశంలో రైతు అనేకానేక విధాలుగా ఓడించబడుతున్నాడు. సేద్యం లాభసాటి కాదని నమ్మించడానికి అన్ని వర్గాలూ ఉమ్మడిగా ప్రయత్నిస్తున్న వాస్తవాన్ని కవి బాధాతప్త స్వరంలో ఇలా వ్యాఖ్యానిస్తున్నాడు. రాజు అయ్యే అన్ని అర్హతలు ఉన్న వాడు రైతు. ఈ నిజాన్ని 'అతనెలా రాజవుతాడు?' అనే కవితలో కవి తనదైన అక్షరాల్లో ఇలా సమర్థిస్తారు. తనకొక మట్టి సామ్రాజ్యముంది. చుట్టూ పాదులు కట్టిన పచ్చని సామ్యాజ్యముంది. అతని చేతిలో సర్వశ్రేష్ట హలాయుధముంది. తనకొక మంచె సింహాసనముంది. అయితే, రైతే రాజు అన్న ఆర్భాటం ఎంత సత్య దూరమో చెప్పడానికి – 'మట్టి పాదాలపై మేకులు దిగబడుతుంటే/ అప్పుకొండ కింద వెన్నెముక విరిగిపోతుంటే/ దళారీ తలారీలు తల తెగ్గోస్తుంటే/ అతనెలా రాజవుతాడు?' అని సూటిగా ప్రశ్నిస్తాడు.

శీర్షిక కవిత కవి సున్నితత్వానికి, పరిశీలనా శక్తికి, బాధిత వర్గం పట్ల సహానుభూతికి సాక్ష్యం. 'పాదాలకు పని సంకెళ్లు బిగుసుకుని/ పొత్తి కడుపులో కత్తులు దిగబడే క్షణాల్లో/ నీలి చూపుల నిప్పు కణికల్ని దాటి/చాటు దక్కే చోటుకోసమై చిట్లిపోతున్న చెమట చినుకులం' అంటూ స్త్రీ గొంతుతో సమస్యను సమాజం ముందుకు తీసుకువస్తాడు. స్త్రీ రుతుచక్రం వల్ల పడే కష్టాన్ని కుటుంబంతో పాటు సమాజంలోని అన్ని వర్గాల వారు అన్ని స్థాయిల వారు గుర్తించాలనే తపన ప్రతి వాక్యంలోనూ మనకు కనిపిస్తుంది.

పల్లెలు విధ్వంసం కావడం అందరి కంటే ఎక్కువగా కవిని కలవరపెడుతుంది. అందులోనూ 'పంటకు అమృతాన్ని పంచే అమ్మ' లాంటి చెరువులు చేపల పెంపక కేంద్రాలుగా మారిపోవడం అంతులేని వేదనను కలిగిస్తుంది. ఆ వేదనే 'కన్నీటి ముద్ర'. "అమ్మ ఉండీ అనాథ అయ్యింది ఊరు/ పాలుండీ పరాయిదయ్యింది చెరువు/... ఒడ్డునపడి చేపలు/ ఒడ్డున పడలేక మనుషులు/... చెరువిప్పుడు కలలు లేని నిద్రలో వుంది/ కన్నీటి ముద్రలా కనబడుతోంది.' పర్యావరణ పరిరక్షణ అనే వస్తువు మీద నాలుగైదు వరకూ కవితలున్నాయి. పర్యావరణ వినాశనానికి గల ప్రధాన హేతువుల్లో మనిషికి గల అత్యాశ ఒకటి. దీనిని, చిన్నప్పుడు విన్న పులి – ఉంగరం కథతో ముడిపెట్టి 'విష లిపి' అనే కవితలో చెప్పే విధానం బాగుంటుంది. 'బతుకు జాతరలో/ పులి వేషంలో ప్రత్యక్షమైనప్పుడల్లా/ ఇంకా ఆ చేతిలో ధగధగా మెరుస్తూ/ చిన్నప్పుడు చదివిన పాఠంలోని/ దివ్యమైన బంగారు కడియం/ ఆశగా వెంపర్లాడే అమాయకపు ప్రాణులను/ ఊరిస్తూనే ఉంటుంది.'

కరోనా మింగేసిన జీవితాలు, ఛిద్రం చేసిన బతుకులు, వ్యవస్థలు అన్నీ ఇన్నీ కావు. కోవిడ్ భయానక విషాద సమయాలను కవులు కవిత్వం చేశారు. కరోనా బీభత్సం ఒక ఎత్తయితే ముందస్తు సంసిద్ధత లేని లాక్‌డౌన్ కారణంగా కొనసాగిన వలస నడక దేశ చరిత్ర పుటల్లో ఎప్పటికీ చెరగని నెత్తుటి చారిక. ఈ సంపుటిలోని 'నిషిద్ధ దారుల్లో', 'పరుగులెత్తింది చాలు' కవితలు ఈ నేపథ్యంలోంచే వచ్చాయి. 'నిషిద్ధ దారుల్లో' కవితలో వలస కూలీలను 'కుబుసం విడిచిన కాలనాగులా/ మెలికలు తిరిగిన మృత్యు మార్గంలో/ క్రిమి తాట్లాడిన త్రోవలో/ నేల నెత్తి మీద నడయాడుతున్న నెత్తుటి నెలవంకలు' అంటాడు కవి. కనీవినీ ఎరగని కష్టాన్ని పాఠకుడికి చూపెట్టేటప్పుడు ఈ కవి ఎంచుకునే ప్రతీకలు, భాష, దృష్టి కోణం కూడా స్పష్టంగా నిర్దిష్టంగా ధ్వనించడాన్ని గమనించవచ్చు. వస్తువు పట్ల కవిలో కలిగిన భావావేశం పాఠకుడిలోనూ కలుగుతుంది. రెండో చీకటి అల దేశాన్ని ఎలా కుదుపేసిందో తెలిసిందే. ఊహకు కూడా అందని మహా విషాదాన్ని 'దేశమిప్పుడు' అనే కవితలో కళ్ళముందుంచుతాడు. 'దేశమిప్పుడు../ దారితప్పి తోడేళ్ళ మందలో ఇరుక్కుని/ చప్పుడు చెయ్యని కుందేలు పిల్ల/ దేశమిప్పుడు ఖనన ప్రయోగశాల/.. ఆరడుగుల మట్టి మందసం' అంటాడు. 'పరుగులెత్తింది చాలు' కవితలో, కవి చెల్లా చెదురైన జీవితాలను, భయంతో ప్రకంపిస్తున్న సమూహాలను – 'బతుకు దారుల్లో పరుగులెత్తింది చాలు! కాస్త నిమ్మళించండి' అంటూ కర్తవ్యబోధ చేస్తాడు. రేపటి పట్ల ఆశను నింపే ప్రయత్నం చేస్తాడు.

కవి ప్రజల పక్షం. బాధితుల వర్గం. ప్రజల పక్షాన నిలబడి రాజ్యం చేసే ప్రతి కుట్రనూ బట్టబయలు చేస్తాడు. విశాఖ ఉక్కు పరిశ్రమను కార్పొరేట్లకు కట్టబెట్టే కుట్రను 'ఉక్కుపోత' కవితలో ఎండగడతాడు. ఆంగ్ల మాధ్యమాన్ని నిర్బంధం చేస్తున్న సందర్భంలో ఆ 'దగ్ధస్పృహ' ఎద్దేవా చేస్తాడు. దళిత స్వరంతో 'అంటరాని ఋతువు'ను రాస్తాడు. లక్ష్మునాయుడు వస్తు విస్తృతి ఎక్కువున్న కవి. 68 కవితలున్న ఈ సంపుటిలో అతడు విభిన్న వస్తువులను కవిత్వం చేశాడు.

ఈ నాలుగు విషయాల్లో కవి కొంత ఆలోచన చేయాల్సి వుంది.

1. వస్తువును వర్ణిస్తూ పోవడం వల్ల కవిత నిడివి పెరుగుతుంది. (ఉదా: 'ఊడా'మణి కవిత) అందమైన దృశ్యాల మధ్య నడకే అయినా కొంత దూరం తర్వాత మనసు అలసిపోతుంది.

2. కవిత్వం గంభీరంగా ఉండాలనేం లేదు. కవి భాష కవిని సామాన్యుడి నుంచి దూరం చేయకూడదు. 'పచ్చని చెట్టుని పల్లె ఆడపడుచుని చేస్తుంది ఊరు' అన్నప్పుడు ఉండే ఉద్వేగం, దగ్గరితనం… 'శత సహస్ర వట పత్రపు సత్రమై' అన్నప్పుడు ఉండదు. అమ్మభాష అవసరాన్ని చెప్పే కవితకు 'ద్వారబంధం' అని సరళమైన పేరు పెట్టి, 'మాతృభాష – ఆయత్న సిద్ధ స్వాస్థ్యం' అనే వాక్యంతో మొదలు పెట్టడం సమంజసం కాదు. 'ఎవరి కోసం రాస్తున్నాం' అనే ప్రశ్న మనకు మనం వేసుకుంటూ ఉండాలి.

3. వాక్యానికీ వాక్యానికీ మధ్య ఖాళీలో పాఠకుడు వస్తువు గురించి ఆలోచిస్తాడు. సన్నివేశాన్ని కొంత ఊహించుకుంటాడు. తర్వాత కవి చూపించబోయే దృశ్యాలను లేదా పరిష్కారాలను పరికల్పన చేసుకుంటాడు. ఆ 'స్పేస్'ని కవి పాఠకుడికి ఇవ్వాలి. కొన్ని కవితల్లో స్టాంజా బ్రేక్ అనివార్యం అనిపించింది.

4. చొక్కాపు తనకు తానుగా నిర్మించుకున్న దారిలో వడివడిగా సుఖంగా ప్రయాణిస్తున్నాడు. అతడి వాక్యనిర్మాణం పాతదైనా కొత్తదైనా అది అతడి సొంత అధ్యయనం, సాధన, కృషి నుంచి పుట్టింది. కానీ కవిలో కొత్త వస్తువు కోసమో, తాజా పరిమళం కోసమో, నూతన నిర్మాణాల కోసమో వెతుకుతూ వుంటుంది ప్రపంచం. అందుకని కవి శోధనా సాధనా కొనసాగాలి.

'కుంకుమ పువ్వుల దు:ఖం' వర్తమానం యొక్క అన్ని పార్శ్వాలను దృశ్యీకరిస్తుంది. సమాజం ఎలా వుంటే బాగుంటుందో అన్న చిత్రాన్నీ, ఇప్పటి వివర్ణ దృశ్యాలనీ పక్కపక్కన పెట్టి చూపించి ఎంతగా శిథిలమైందో పోల్చుకో మంటాడు కవి. కవితా వస్తువును అత్యుత్తమ కవిత్వంతో జోడించి మనసు మీద గాఢమైన ముద్ర వేశాడు. ఇది ఎవరి వారు చదువుకొని ఆనందించి ఆలోచించి ఆచరణ వైపు కదిలేలా చేసే కవిత్వం. ముఖచిత్రం శీర్షికకు తగ్గట్టుగా ఉంది. ముఖచిత్రాన్ని కవే స్వయంగా గీయడం విశేషం. అభినందనీయం. ప్రతుల కోసం 95732 50528 నెంబర్‌లో కవిని సంప్రదించవచ్చు. ■

**సాహితీ ప్రస్థానం**

**చందాదారులుగా చేరండి**

**మీ మిత్రులను చేర్పించండి**



## నవ్వుల చిల్లర విసిరి …

**వా**డెళ్ళి చాలాసేపైనా
ఖరీదైన వాసన దర్పం చూపుతునే ఉంది
మాటల అత్తరు వీస్తూనే ఉంది
వాడి పలుకు మెరుపునకు
కళ్ళు కాస్త తేరుకున్నా
స్పర్శ లేక మనసుకు మాత్రం నీరసంగా ఉంది

ఎదిగాడని మాటగాని బుద్ధి కురచగా
చూపే మర్యాద మరుగుజ్జుగా
వంకర చూపులు, వేడి మాటలు
అన్ని హుదా మాటున లోపాలే!

కారులో వచ్చాడని గుమిగూడిన జనాన్ని
కోటు హుందాతనం లారీలా నెట్టినట్లే ఉంది
మనోడనే రుచి మనసుకు లేకపోగా
చప్పని చూపులతో
నవ్వుల చిల్లర విసిరిన చేతులను చూసి
గొంతుకు మంటెక్కింది


తళుక్కుమనే మెరిసే మాట నాడిని బట్టి
డబ్బు కరిచిన మనోడు మనోడు కాలేదని

వెళ్ళొస్తానని అనే వాడనేలోపలే
వీధి వీధిని పొలిమేర దాకా
డబ్బుకంపును కడిగేసుకుంది పల్లె సువాసన…!

**- చందలూరి నారాయణ రావు**

**97044 37247**

## పరిచయం




# కవిత్వం విలువ చూపిన ప్రాణదీపం

- డాక్టర్ అమ్మిన శ్రీనివాసరాజు
77298 83223

**'సా**హిత్యం అంటే సమాజహితం కోరేది' అనే నానుడి ఉంది. కానీ ఒక్కోసారి దాని నడక మారి దారి తప్పుతుంది. తద్వారా అభాసుపాలై ఆదరణ మసకబారుతుంది. నేటి ఆధునిక సాహిత్య క్షేత్రంలో విరివిగా మొలకెత్తుతున్న 'కవితాలతలు' కూడా కొన్ని సరైన లక్ష్యం శైలి లేక రాశిలో ఎత్తుగా నిలిచిన, వాసిలో కురచై బక్క పలచనై పోతుంది.

సాధారణంగా కవి వర్తమాన పరిస్థితులపై ప్రతిస్పందిస్తూ తనదైన భావాలతో సమాజాన్ని జాగృతం చేస్తూ లోపకారకులను హెచ్చరించడం పరిపాటి. అందుకు భిన్నంగా రాయబడింది గాజోజు నాగభూషణం కవిత్వం 'ప్రాణదీపం'. అందరి కవులవోలే తాను సామాజిక పరిస్థితులపై ప్రతిస్పందించిన, అందులో ఓ వైవిధ్యం, విశిష్టత, రేఖామాత్రంగా కనిపిస్తూ పాఠకులకు నవీన అనుభూతిని అందిస్తుంది. అందుకు కారణం కవి ఎంచుకున్న వస్తువులు, పదబంధాలు, శైలి వగైరా.

అక్షరం మీద కవికి గల ఆత్మీయత గౌరవం చూస్తే ఆశ్చర్యం నిండిన ఆనందం కలగకమానదు. కలాన్ని విరవగలవు కానీ కాలానికి కాగడాలిచ్చిన ఇచ్చిన అక్షరాగ్ని జ్వాలల్ని ఆపగలవా? అంటూ 'కలం సైనికుల్ని' కుట్రపూరిత హత్యలు చేస్తున్న బూర్జువా వాదులను ప్రశ్నిస్తూ... అక్షరం అంటే ఆర్పేస్తే ఆరిపోయే దీపం కాదని, అది నిత్యం విస్ఫోటనాల 'సూర్యగోళం' అంటూ అక్షర విలువను అభివర్ణిస్తారు. కూల్చలేనిది కాల్చలేనిది 'అక్షరం' మాత్రమే అని హెచ్చరిస్తారు కవి 'గౌరీ లంకేష్' హత్యకు తన నిరసన గళం పలికిస్తూ.

ఆధునిక సమాజంలో అవతరిస్తున్న 'అవకాశవాద మానవ సంబంధాలు' గురించి మదనపడ్డ కవి 'కొత్తగా మొలకెత్తాలి' అంటూ వ్యంగ్య రీతిలో పదునైన భావాల మేళవింపుతో... 'మనిషికి మనిషికి మధ్య ఉన్నదల్లా/ అవసరాల ముసుగుల సయ్యాట/ అవకాశాలకై నవరస నటనల దోబూచులాట' అంటూ మానవ సంబంధాల మధ్య అల్లు కుంటున్నవన్నీ అనురాగపు బంధాలేనా? అని ధర్మాగ్రహం వ్యక్తం చేస్తారు. విద్యార్థులు అనాలోచనలతో పాల్పడుతున్న బలవన్మరణాలపై స్పందిస్తూ యువత విలువ భావితరానికి ఎంత అవసరమో చక్కగా చెబుతారు. చిగురించే మాను, చీమల ఐక్యత, గద్దల పోరును తార్కాణంగా చూపుతూ... యువతకు ఎంతో భరోసా ఇస్తాడు. 'మీరు ఉండాలి' అంటూ 'కాగితాలపై చెరిగిన ఆశల అంకెల తేడాలకు/ జీవితాల పుటలను చింపేసుకున్న బేలతనం/ నువ్వు పెంచిన కుక్కపిల్ల మరణిస్తే/ వెక్కి వెక్కి ఏడ్చావు/ మా రక్తంతో వెలిగిస్తున్న ఊపిరి దీపానివి ఆరిపోతే/ నిత్యం మాకు సూర్యుడు లేని చీకటి లోకమే కదా?/ అంటూ బిడ్డలను కోల్పోయిన తల్లిదండ్రుల కడుపుకోత ఆర్తిని అక్షరీకరించి ఆలోచింపచేస్తారు.

ప్రపంచాన్ని తన అదృశ్య హస్తాలతో పట్టిపీడించిన 'కరోనా' పై కూడా కవి తనదైన సామాజిక స్పృహ వ్యక్తం చేస్తూ తన భావాలను కొన్ని కవితల ద్వారా వెల్లడించారు.

'కత్తివి నీవే..... ఖండిత శిరస్సు నీదే!' అనే కవితలో..

మనిషి ఎంతటి వాడైన ప్రకృతి ముందు తల వంచాల్సిందే అంటూ మనిషిని మనిషే కాపాడుకున్న 'దృశ్యానంతర సందేశం'గా కరోనా మహమ్మారిని అభివర్ణిస్తూ.... 'ఆట ముగిసే సమయానికైనా/ అసలు సత్యం తెలుసుకో/ మనిషి అణువంత/ ప్రకృతి బ్రహ్మాండమంత/ దానికి లొంగి ఉంటే బతుకు/ లొంగ

దీస్తానంటే చావు........' అటు ప్రకృతి జీవన సత్యాన్ని కవి ఎంతో సృజనాత్మకంగా చెబుతారు.

"కరోనా హమే చోడకర్ జావోన...." "బడి నారుమడి కావాలి" వంటి కవితలన్నీ కరోనా కాలంలో సమాజంలో కలిగిన మార్పుల పట్ల ఆవేదనతో సాధారణ స్థితికి చేరాలన్న ఆశయంతో వెలువడ్డాయి.

సామాజిక సంగతులపై మాత్రమే దృష్టి మరల్చకుండా మానవ సంబంధాల పట్ల కూడా తనదైన కవితా దృష్టి సారించారు కవి నాగభూషణం. పునరుద్ధాన పుష్పం, అమ్మమ్మ ఊరు, పోయి రావాలి మొదలైన కవితల నిండా మానవ సంబంధాలు, గ్రామీణ సౌందర్యాలు ఆరబోశారు. తన సోపతిగాండ్లపై అల్లిన కవన లతలు ఈ కవికి గల స్నేహభావం, గురుభక్తి వెల్లడిస్తాయి. తన సాహితీ గురువు 'నలిమెల సార్' భాషా సొగసులు భావితరానికి పంచాలనే తపనతో రాసిన 'భాషల చెట్టు' అందుకు ఓ ఉదాహరణ.

"ఈ చెట్టు/ నిజాయితీ వేళ్లపై నిటారుగా నిలబడింది/ తాల్యపు తుఫానులకు పొంగిపోలేదు/ కాల పరీక్షలో వచ్చే శిశిరాలకు ఎండి పోలేదు/ తన నీడన చేరిన కలధారుల/ కలలకు మెరుగులద్దుతూ/ పత్రహరితమై ప్రాణవాయువు పంచింది" అంటూ అక్షర సత్యాలని ఆత్మీయంగా అక్షరీకరించారు. "నొప్పి ఒక్కరిదైనా బాధ సామూహికం/ సంబురమెవ్వరిదైనా సందడి అందరిదీ/ కళ్యాణమైన కాటి కాడికైనా/ ఊరు ఊరంతా కలిసి నడిచే కలకలం....." అంటూ మానవాళికి ఉండాల్సిన అసలైన ఐక్యత భావం గురించి గుంభనంగా చెబుతాడు "పగిలినసల్ల కుండ" కవిత ద్వారా.

ఎనభై కవితా మొక్కల ఈ 'కవన పూదోట'లో మొలకల ఎత్తులు ఎక్కువైనా వాటిలోని సరళ గుబాళింపులు, స్వచ్ఛమైన తెలంగాణ తెలుగు పలుకుబడులు, పూపిందెలతో పొదవులోని అలసట, విసుగు, అసలే కనిపించవు. 'ప్రాణదీపం' అనే తొలి కవితలో కన్నతల్లి పడ్డ కష్టాలను కళ్ల ముందుంచుతూ తన స్వగతం మాత్రమే చెప్పుకున్నా ... ప్రతి సగటు జీవికి అది తన బాల్యపు పేదరికమే కదా! అన్న భావం కలగకమానదు.

నేటి ఆధునిక కాలంలో అందివచ్చిన ఓ కొత్త వెలుగు దీపం ఈ ప్రాణదీపానికి ప్రతిష్ఠాత్మకమైన 'కందికొండ రామస్వామి స్మారక పురస్కారం 2021' లభించడం అభినందనీయం. ■

## స్నేహమెంత మధురం!

**కొ**న్ని స్నేహాలు దూరం
అయిపోతున్నాయ్
అపోహలు – అపార్థాలు
అనుమానాలతో

కొన్ని పరిచయాలు
అంతమైపోతున్నాయ్
సంభాషణలు –
సత్ప్రవర్తన లేకపోవడంతో

కొన్ని ప్రేమలు
సమాధి అయిపోతున్నాయ్
జెలసి – ఈర్ష్య – ఇగోలతో

కొన్ని బంధాలు
తెగిపోతున్నాయ్
సమన్వయం – సర్దుబాటు లేకపోవడంతో

కొన్ని అనుబంధాలు
విడిపోతున్నాయ్ నమ్మకం –
అభిమానం ఆత్మీయత లేక

కొన్ని నమ్మకాలు
సమాధి అయిపోతున్నాయ్
చెప్పుడు మాటలు –
చెడు చేష్టలతో కొన్ని వాస్తవాలు
కనుమరుగైపోతున్నాయ్

అవాస్తవాల ఆధిపత్యం
పోరులతో ఎన్నో మనసులు గాయపడుతున్నాయ్
మన అనాలోచిత –
తొందరపాటు చర్యలతో

కాబట్టి మీ మనసుల్లో
అభిమానాన్ని ఆవిరి కానీయకండి
స్నేహ మాధుర్యాన్ని మరవకండి!

**- అనిత దావాత్**
93942 21927



# మళ్లీ చిగురించారు !

- దొండపాటి కృష్ణ
90523 26864

**సా**యంకాలమైంది.

సూర్యకిరణాలను కబళిస్తున్నట్లుగా కమ్మేశాయి మేఘాలు. దేవశిల్పి చేతుల్లో సరికొత్తగా రూపుదిద్దుకున్న ఆ మేఘాలు చిన్న కొండల్లా కనిపిస్తున్నాయి.

"సార్! వర్షం వచ్చేలాగుంది" రాజు చెప్పడంతో కర్టెన్ తీసి ఆకాశం వంక చూశాడు వసంత్.

ప్రకృతి చిరు అల్లరులు వాతావరణానికి గిలిగింతల పెట్టాయి. మేఘం తనువు పులకించింది. వర్షపు చినుకులతో పుడమి స్నానం చేసింది. ఆ చినుకుల్లో తడుస్తూ తమని తామే మర్చిపోయి ఆడుకుంటున్న చిన్నారులు కనిపించారు. వర్షం వచ్చిన ప్రతిసారీ తన కూతురు వర్షంలో తడుస్తూ చిందులేసే దృశ్యాలు కళ్ళముందుకొచ్చాయి. సంబరంతో అతని పెదవులు విచ్చుకున్నాయి.

''ఇక బయల్దేరదాం రాజు...'' పెద్ద ఉరుము వినిపించడంతో తేరుకున్నాడు.

వసంత్ మాటని శిలాశాసనంలా భావించే రాజు, అతని లగేజీని కారులో పెట్టాడు.

పొడవైన ఫ్లైఓవర్ పైకి కారు ఎక్కింది. వర్షం పెరగడంతో వైపర్ ఆన్ చేశాడు. ఎక్కడ ఇంకాలో తెలీక రోడ్ల వెంబడి నీళ్ళు పరిగెడుతున్నాయి. ఫుట్‌పాత్ మీద చిరిగిన బట్టలతో చలికి వణుకుతూ బిచ్చగాళ్ళు కనిపించారు. వాళ్ళు ప్లాస్టిక్ కవర్లను కప్పుకోవడానికి ప్రయత్నం చేస్తున్నారు. బలంగా వీస్తున్న గాలి వాటిని దూరంగా నెట్టేసింది.

జోరుగా కురుస్తున్న వర్షానికి ఆకాశానికి చిల్లులు పడ్డాయనిపించి పైకి చూశాడు. తన ఆలోచనకు నవ్వొచ్చి తిరిగి రోడ్డువైపు దృష్టి సారించగానే గుండె ఆగినంత పనైంది. సడన్ బ్రేక్ తొక్కాడు. 'సర్ర్ ...' మని శబ్దం చేస్తూ కారు ఆగింది. సెకను కాలంలోనే ఆనందం కాస్తా ఆందోళనగా మారింది.

కారు ముందు చక్రాల అంచున చిక్కుకున్న చిన్న పాప ఏడుస్తోంది. పాప ఏడుపుకు కడుపులోని పేగులు లోపలికి, బయటికి వస్తున్నాయి. అచ్ఛాదన లేని ఆ పాప నల్లగా ఉంది. జుట్టు గోధుమ రంగులో ఉంది. రిబ్బన్ లేకపోవడంతో జుట్టు గాలికి ఎగురుతోంది. ముక్కునుంచి చీమిడి కారుతోంది. అది సరాసరి పాప నోట్లోకి వెళ్ళిపోతుంది. అక్కడే ఉన్న బిచ్చగాళు ్ళ లబోదిబోమంటూ గుండెలు బాదుకుంటున్నారు. ఒక పెద్దామె ఏడ్చుకుంటూ వచ్చి పాపని గుండెలకు హత్తుకుంది. గాయాలేమైనా తగిలాయేమోనని పాప ఒళ్లంతా తడిమి చూసింది.

వసంత్‌కి తన కూతురు గుర్తుకొచ్చింది. 'ఆ పాప స్థానంలో తన కూతురే ఉంటే?' ఆలోచన రాగానే 'పాపకేం కాకూడదు ...' అనుకుంటూ కారు దిగాడు. అతన్ని చూసిన భయంతో పాప మరింతగా ఏడుపు అందుకుంది. అతని మనస్సు చివుక్కుమంది. అక్కడున్న వారివంక చూశాడు.

ఎవరి మొహాల్లోనూ జీవం లేదు. జీవితం పట్ల సంతృప్తి లేదు. భవిష్యత్ పట్ల ఆశ లేదు. కాటికి కాళ్ళు చాపుకుని, దొరికింది తిని కడుపు నింపుకుంటున్నట్లుగా ఉన్నారు. వాళ్ళనలా చూశాక అతని మెదడులో ఆలోచనలు ఇల్లు కట్టసాగాయి.

పాపకేమీ కాకపోవడంతో బిచ్చగాళ్ళు రాద్ధాంతం చేయలేదు. వాళ్ళ సంస్కారానికి అబ్బురపడి, క్షమించమన్నాడు. ఇంతలో ట్రాఫిక్ బాగా పెరిగిపోయింది. అతని కారు వెనకనే

ఆగిన వాళ్ళు గట్టిగా హారన్ కొట్టారు.

◆ ◆ ◆

ఇంటికి చేరుకున్నాడు వసంత్. ఆ సంఘటన అతన్ని నిలువనివ్వడం లేదు. మర్చిపోలేకపోతున్నాడు. పాప మొహం గుర్తుకొస్తుంది. వాళ్ళు ఎందుకలా మగ్గిపోతున్నారో అంతుచిక్కడం లేదు. అతని వేదనను చూడలేకపోయింది శ్రావణి.

"ఏంటండి! అదోలా ఉన్నారు?"

"ఎంతోమంది ధనవంతులున్నారు. సాయం చేయగలిగే వాళ్ళున్నారు. అయినా ఎవ్వరూ వాళ్ళను ఆదుకోవట్లేదు."

"ఎవరి గురించి?" ఆరా తీసింది. ఫ్లైఓవర్ మీద జరిగినదంతా చెప్పాడు.

"ఎవర్నో నిందించే బదులు మీరే ఏదన్నా సాయం చేయొచ్చు కదండీ!" సూచన చేసింది.

"నేనా... ఎలా?" అయోమయంగా చూశాడు.

"వీలైతే ఇలా చేసి చూడండి..." సలహా ఇచ్చింది.

ఈ ఆలోచన తనకు రానందుకు సిగ్గుపడ్డాడు. కార్యాచరణ బోధపడింది. శ్రీమతిని మనస్ఫూర్తిగా అభినందించాడు.

మరుసటిరోజు ఆఫీసుకు బయల్దేరేముందు కారు డిక్కీలో లగేజీ పెట్టుకున్నాడు వసంత్. ఏదో తెలియని ఆందోళన అతన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తుండగా ఇంటినుంచి బయటపడ్డాడు. జడివానకు పట్నం తలారా స్నానం చేసినట్లుంది. ఇంకా మేల్కోలేదు. అది చూస్తున్న అతనికి, 'వాళ్లకీరోజు ఆహారం ఎలా?' అనే ప్రశ్న ఉత్పన్నం అయ్యింది. వెంటనే ఇరవై ప్లేట్లు ఇడ్లీ కట్టించుకుని కారులో పెట్టుకున్నాడు.

సరాసరి ఫ్లైఓవర్ మీద బిచ్చగాళ్ళ పక్కన కారు ఆపాడు. ఒంటి మీద సరైన బట్టలు లేకపోవడంతో వాళ్ళ ఎముకుల గూడు కనిపిస్తోంది. వాళ్ళు అతన్ని గుర్తుపట్టారు. మున్సిపల్ ఆఫీసర్ కారు ఎందుకు ఆపాడో తెలీక బిక్కమొహం వేశారు. అక్కడ్నుంచి వెళ్లగొట్టేస్తాడేమోనని భయపడ్డారు. కారు దిగి వాళ్ళను సమీపించాడు వసంత్. ఆలస్యం చేయకుండా ఆ టిఫెన్ ప్యాకెట్లు వాళ్లకు ఇచ్చాడు. వాళ్ళు అనుమానంగా చూశారు. తీసుకోలేదు. వాటిని ఫుట్‌పాత్ మీద పెట్టాడు వసంత్.

డిక్కీనుంచి పాత బట్టల మూట బయటికి తీశాడు. అతనేం చేస్తున్నాడో అర్థంకాక ఒకరి మొహాలు ఒకరు చూసుకోసాగారు. పాత బట్టల్ని ఒక్కోటి తీసి వారికిచ్చాడు. అప్పటికి అతని మనసును అర్థం చేసుకున్నారు. వాటితోపాటు అక్కడ పెట్టిన ఇడ్లీ కూడా తీసుకున్నారు. ఆ క్షణంలో వాళ్ళ కళ్ళల్లో కోటి దీపాల కాంతులు విరిశాయి. కృతజ్ఞతాపూర్వకంగా చేతులు జోడించారు. సున్నితంగా తిరస్కరించాడు. 'ఎలా స్పందిస్తారా?' అని సందేహించిన వసంత్ మనసు దూదిపింజలాగా తేలికైంది.

◆ ◆ ◆

సుబ్బయ్య ఆఫీసర్ పిలుపుకోసం ఎదురుచూస్తున్నాడు. 'సార్ పిలుస్తున్నారు' అని రాజు కేకేశాడు. లోపలికెళ్ళాడు సుబ్బయ్య. వసంత్ కు నమస్కరించాడు.

"ఏంటి సుబ్బయ్యా.. అంతా మంచేనా.." కుశలమడిగాడు.

"తమరి దయవల్ల అంతా మంచేనండి.." వినయంగా చేతులు కట్టుకున్నాడు సుబ్బయ్య.

"చెప్పు, ఏంటి పని.."

"రంగుల డబ్బాలు అయిపోయాయి సారూ.."

"సరే, రాజుకి చెప్తాను. ఏ తేడా రాకుండా చూసుకోండి.."

"అట్టాగేనయ్యా.." నిష్క్రమించాడు సుబ్బయ్య.

"నమస్కారమండీ ఆఫీసరు గారు!" అతను బయటకెళ్తుంటే లోపలికొస్తూ పలకరించాడు నవీన్.

"ఎన్నాళ్ళయ్యిందిరా నిన్ను చూసి! కూర్చో.." బాల్య స్నేహితుణ్ణి చూసిన క్షణాన వసంత్ వదనం చిరునవ్వుతో విచ్చుకుంది. కదిలెళ్లిన కాలం జ్ఞాపకాలుగా వాళ్ళ ముందుకొచ్చింది.

"రాజేష్ మీకోసమొచ్చాడు సార్" సమాచారమిచ్చాడు రాజు. చేతికున్న వాచీ చూసుకుని లోపలికి రమ్మన్నాడు వసంత్. లోపలికొచ్చిన రాజేష్ మొహమాటంగా చూస్తున్నాడు.

"పనంతా అయిపోయిందా?" అడిగాడు వసంత్.

"బ్రష్‌లు పాడైపోయాయి సార్"

"ఈమాత్రం దానికి నన్నే అడగాలా? రాజుకి చెప్తే ఏర్పాటు చేసేవాడు కదా! రాజూ.." బెల్ కొట్టాడు వసంత్. ఏదో ఫోన్ రావడంతో మెల్లగా మాట్లాడుకుంటూ బయటకెళ్ళిన రాజు హడావుడిగా లోపలికొచ్చాడు.

"వెంకటాద్రికి యాక్సిడెంట్ అయ్యిందంట సార్... హాస్పిటల్లో చేర్పించారంట..." ఫోన్ సారాంశం చేరవేశాడు రాజు.

దిగ్భ్రాంతికి గురయ్యాడు వసంత్. సీటుల్లోంచి లేచాడు. పరిస్థితిని అర్థం చేసుకున్న నవీన్, స్నేహితుణ్ణి అనుసరించాడు. కారు హాస్పిటల్ వైపు వేగంగా పరుగులు పెడుతోంది.

"ఎవరతను?" అడిగాడు నవీన్.

"వెంకటాద్రి అని మా మున్సిపాలిటీలోనే పని చేస్తాడు." వసంత్ మనసంతా గమ్యం వైపే ఉంది.

"ఒక వర్కర్ కోసం ఎందుకింత ఇదైపోతున్నావ్?" అది సహజమే అన్నట్లుగా మాట్లాడాడు నవీన్.

కోపంగా చూశాడు వసంత్. అంత కోపం తెప్పించేలా

ఏమన్నాడో అర్థంకాక అయోమయంగా చూస్తుండిపోయాడు నవీన్. హాస్పిటల్ రావడంతో కారుకు బ్రేకులు పడ్డాయి. స్నేహితుణ్ణి పిలవడం మర్చిపోయిన వసంత్, సరాసరి యాక్సిడెంట్ వార్డువైపు వెళ్ళాడు.

"ఎలా జరిగింది?" అక్కడే ఉన్న సూరయ్యను అడిగాడు.

"బండిని పక్క సందులోకి తిప్పుతుండగా లారీ వచ్చి గుద్దింది సారూ... తల గట్టిగా అద్దాలకు తగిలింది. అప్పుడు నేను బండిలో లేను. చాలా రక్తం పోయింది. వీడి రక్తం అంత తొందరగా దొరకదంట. బ్లడ్ బ్యాంకులకు ఫోన్లు చేస్తున్నారు. మీ దయవల్ల ఓ దారిన పడ్డాడనుకున్నా... ఇంతలోనే..." తువాలు నోటికి అడ్డంగా పెట్టుకుని రోదించసాగాడు సూరయ్య.

"అతనికేం కాదు. పదా... డాక్టర్ దగ్గరికెళ్దాం..." సూరయ్యను తీసుకుని డాక్టర్ కేబిన్ కెళ్ళాడు వసంత్.

"పేషెంట్ కండిషన్ ఏంటి సార్?" ఆదుర్దాగా అడిగాడు.

"డోంట్ వర్రీ. బ్లీడింగ్ ఎక్కువైంది. వీలైంత త్వరగా బ్లడ్ ఎక్కించాలి. అతనిది 'ఓ' నెగిటివ్. మా దగ్గర లేదు. ఆ బ్లడ్ గ్రూప్ దొరకడం కష్టం. అందుకే లేట్ అవుతోంది. ఉయ్ ఆర్ ట్రయింగ్ అవర్ లెవెల్ బెస్ట్..." పరిస్థితి వివరించాడు డాక్టర్.

"నాదీ సేమ్ బ్లడ్ గ్రూప్. టెస్ట్ చేసి సరిపోతుందేమో చూడండి." ఆపన్నహస్తం అందించడానికి సిద్ధపడ్డాడు వసంత్.

అవసరమైన టెస్టులు చేసి, అన్ని విధాలా సరిపోతుందని నిర్ధారణ అయ్యాక అతన్నుంచి బ్లడ్ తీసి, ప్లేట్‌లెట్లను వేరు చేసి, బ్లడ్‌ను మళ్ళీ డోనర్ శరీరంలోకి పంపించారు. తీసిన ప్లేట్ లెట్స్‌ను వెంకటాద్రికి ఎక్కించారు. కొన్ని ఫ్రూట్స్ వసంత్ చేతిలో పెట్టారు.

"మీరు మా దేవుడయ్యా..." గండం గడవడంతో వసంత్ కాళ్ళ మీద పడబోయాడు అక్కడే ఉన్న ముసా వ్యక్తి.

"నాకు చేతనైందే చేశాను." అతన్ని పైకి లేపాడు వసంత్.

"మీరు ట్రాన్స్‌ఫర్ అయ్యి వెళ్ళిపోతే మమ్మల్ని ఇలా ఎవరు పట్టించుకుంటారయ్యా?" అతని గొంతు గద్గదమైంది.

"ఇక్కడిదాకా తీసుకొచ్చినవాడిని, మధ్యలో ఎలా వదిలేస్తాను? వెంకటాద్రిని కోలుకోనివ్వండి. ఇక మీ డ్యూటీకి వెళ్ళండి" వాళ్ళను ఓదార్చి పంపించాడు వసంత్.

♦ ♦ ♦

కారు ఆఫీస్ వైపు వెళ్తోంది.

తనకింద పనిచేసే వాడి కోసం వసంత్ ఎందుకు అంతలా తపనపడుతున్నాడో నవీన్ ఆలోచనలకు అందడం లేదు. 'ఒక సాధారణ మున్సిపల్ ఆఫీసర్ ఇంతమందికి ఎలా దేవుడయ్యాడు?' అనే ప్రశ్న అతన్ని సీట్లో కుదురుగా కూర్చోనివ్వడం లేదు.

'సంస్కృతి, సాంప్రదాయాలు, ఆచార వ్యవహారాలంటూ పాత పద్ధతులనే పట్టుకుని వేలాడుతుండే వసంత్ నేనా చూస్తున్నది? ప్రభుత్వ నియమాలకు తిలోదకాలివ్వడు. ప్రభుత్వ నిధులను పక్కదారికి పోనివ్వడు. అందరిచేతా 'చండశాసనుడు, రాక్షసుడు' బిరుదులు పొందిన వసంత్ నేనా చూస్తున్నది?' ఆలోచనలతో సతమతమైపోతున్నాడు నవీన్.

"ఏంటిరా? బెల్లం కొట్టిన రాయిలా అయిపోయాయ్?" గట్టిగా హారన్ కొట్టడంతో ఈలోకంలోకొచ్చాడు నవీన్.

"ఒకప్పుడు ఈ బిల్డింగ్ శిథిలావస్థకు చేరుకున్నట్లు ఉండేది. ఇప్పుడు కళకళలాడుతోంది. చుట్టూ ప్రహరీగోడ నిర్మాణం... పూల మొక్కలతో ఆహ్లాద వాతావరణం... వాహనాలకు ప్రత్యేకమైన చోటు.... గవర్నమెంట్ ఆఫీస్ ఒక ఉద్యానవనంలా ఉందంటే నీవు ఎంతలా మార్పు చేశావో అర్థమవుతుంది. అర్థం కానిదేమన్నా ఉందంటే, అది ఇప్పుడు జరిగింది... ఏంటి ఇదంతా?" ఒక ప్రశ్నాపత్రాన్నే వసంత్ ముందుంచి జవాబు కోసం ఎదురుచూడసాగాడు నవీన్.

"ఒకప్పుడు వాళ్ళంతా బిచ్చగాళ్ళు. ఇప్పుడు ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్..." చాలా సింపుల్‌గా చెప్పాడు వసంత్.

"వాట్! బెగ్గర్సా?"

వీధిలో తడిపిన వాన, వీధి మలుపు తిరిగేసరికి ఆనవాలు లేనప్పుడు కలిగినంత ఆశ్చర్యం పొందాడు నవీన్.

"ఇకనుంచి వారికీ ట్యాగ్ లైన్ ఉండదు. ఇప్పుడు వాళ్ళ జీవితం మళ్ళీ చిగురించింది."

"ఎలారా?" ఆసక్తిగా అడిగాడు నవీన్. ఆరోజు జరిగిన సంఘటన మొత్తాన్ని చెప్పాడు వసంత్.

"చేసేది మంచి పనైతే మనం మొదలుపెట్టిన క్షణమే మంచిది. ప్రత్యేకించి ముహూర్తాలు చూడాల్సిన అవసరం లేదు. ముందుకు సాగిపోవడమే!' అనే సూత్రం విలువ తెలిసిందిరా." వసంత్ చెప్పేది శ్రద్ధగా వినసాగాడు నవీన్.

"పాత బట్టలు సేకరించి మున్సిపల్ ఆఫీసులో అప్పగించిన వారికి, రోజూ ఇంటికొచ్చి చెత్తను తీసుకెళ్తున్నందుకు వసూలు చేసే మొత్తంలో రాయితీ ఇస్తామన్నాను. అనూహ్య స్పందనొచ్చింది. రాయితీ ఇచ్చేసరికి నాపై ప్రజల్లో నమ్మకం కుదిరింది. స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చాయి. వాళ్ళ సాయంతో ట్రాలీ బండి కొన్నాను.

నా ఆలోచనను ఆచరణలో పెట్టడానికి మార్గం సుగమమైంది. బిచ్చమెత్తుకోవద్దని, పని నేనే చూపిస్తానన్నాను. కొంతమంది నమ్మారు. అదిగో.. ఆ డివైడర్ మీద ఉండే మొక్కలకు నీళ్ళు పెడుతున్నారే వాళ్ళు బిచ్చగాళ్ళే..." కారును నెమ్మది చేసి చూపించాడు వసంత్.

వాటర్ టాంకర్ వెనకవైపు పైపు పట్టుకుని మొక్కలకు నీళు ్ళ పడుతున్న వాళ్ళు కనిపించారు.

"ఇదిగో ఇటు చూడు. ఈ ఫ్లైఓవర్ పిల్లర్స్ మీద, గోడల మీద బొమ్మలు వేసింది కూడా వారే..." కారు ఫ్లైఓవర్ ఎక్కుతుండగా చూపించాడు వసంత్.

ఆ ఫ్లైఓవర్ దిగగానే రోడ్డు పక్కనే ఉన్న స్తంభాల మీద, నిరుపయోగంలో ఉన్న సిమెంట్ చెత్త కుండీల మీద ఈ ప్రాంత చరిత్రను బొమ్మల రూపంలో గీస్తున్న వాళ్ళు కనిపించారు.

"ఒకరు బండి నడిపితే, ఇంకొకరు బట్టలను సేకరిస్తారు. ఒక్కొక్కరిలో ఒక్కో కళా నైపుణ్యం ఉంటుంది. దాన్ని గుర్తించి అటువైపు ప్రోత్సహించాను. ఇంకా బిచ్చగాళ్ళుగానే జీవితం గడుపుతున్న వాళ్లకు పాత బట్టల్ని అందిస్తూ, వీళ్ళ నేపథ్యం, వీళ్ళు మారిని వైనం, ఇప్పుడు వీళ్ళు గడుపుతున్న స్వచ్ఛమైన జీవితం గురించి చెప్పమన్నాను. అలాగే చేశారు. ఇలా జీవించడాన్ని ఇష్టపడని వాళ్ళల్లో మార్పు వస్తోంది." క్షుణ్ణంగా వివరించాడు వసంత్.

"భిక్షాటనను వ్యాపారంలా చూసే వాళ్ళుంటారు. అలాంటివాళ్ళు తిరిగి వెళ్లిపోరని, నిన్ను మోసం చేయరని గ్యారంటీ ఏంటి?" సందేహం వెలిబుచ్చాడు నవీన్.

"జీవితంలో బాగా దెబ్బతిన్న వాళ్ళే, జీవితం విలువ తెలిసిన వాళ్ళే మార్పుకు ముందుకొస్తారు. అదో వ్యాపారంలా చూసేవాడు మారనే మారడు. ఒకవేళ నువ్వన్నట్లే చేస్తే మోసపోయేది వాళ్ళే! ఆ భయం ఉన్న వాళ్ళు బుద్ధిగా చేసుకుంటున్నారు. మూడు పూటలా తృప్తిగా తింటున్నారు."

"బాగుంది. నెక్ట్స్ ఏంటి?"

"మొన్ననే కలెక్టర్ గారిని కలిసి విషయం చెప్పాను. లేబర్ వర్క్స్ కి గవర్నమెంట్ నోటిఫికేషన్ ఇస్తే ఇక్కడ వీళ్ళనే పరిగణనలోకి తీసుకోమన్నాను. చూద్దామన్నారు. నేనిక్కడ లేకపోయినా వాళ్ళు ఈ జీవితాన్నే కొనసాగించాలి. దానికోసం మరికొన్ని స్వచ్ఛంద సంస్థలతో మాట్లాడుతున్నాను. నేను ఎక్కడికి ట్రాన్స్‌ఫర్ అయి వెళితే అక్కడ ఇలాగే చేయాలనుకుంటున్నాను." కార్యాచరణ చెప్పాడు వసంత్.

"గుడ్ లక్ వసంత్. కారు ఆపేయ్. నేనిక్కడ దిగిపోతాను. పెళ్ళికని వచ్చాను. అక్కడ నాకోసం ఎదురు చూస్తుంటారు. మళ్ళీ కలుద్దాం." బయలుదేరాడు నవీన్. అతన్ని సాగనంపి ఆఫీసుకొచ్చాడు వసంత్.

◆ ◆ ◆

కొన్ని రోజులకు...

ఏదో కొరియర్ వచ్చిందని తెచ్చి ఇచ్చాడు రాజు. కవర్ చించి చూశాడు వసంత్. అందులో ఒక లెటరుతో పాటుగా

## అంకితం

**ఆ** మిద్దె అంతా
లిల్లీ పూల వాసన.
నువ్వు అంతే కదూ
లిల్లీ పూలలా గుబాళిస్తూ ..

అప్పుడే కదూ ఆ నల్లని చీకటి
వికృత శబ్దాలతో వస్తుంది.
ఆ శబ్దాలకు, ఆ చీకటికి భయపడి
నువ్వు ముడుచుకుపోతుంటావు
అప్పుడు, ఆ సమయంలో
నీ వెన్ను నిమిరిన
చేతిలో ఒదిగిపోతుంటావు
ఇక ఆ చేతిని ఎప్పటికీ వదలక
అంకితమవుతుంటావు!

**- లక్ష్మీ కందిమళ్ళ**

బ్యాంకు చెక్ ఉంది. ఆత్రుతగా లెటర్ తీసి చదవసాగాడు.

"ప్రియమైన వసంత్‌కు...

ఇలా ఉత్తరం రాస్తున్నాడేమిటానని ఆశ్చర్యపోతున్నావా? ఉత్తరమైతే భాషను, భావాన్ని దగ్గర చేస్తుందని రాస్తున్నా. అందరూ కలలు కంటారు. లక్ష్యాల్ని నిర్దేశించుకుంటారు. కానీ, వాటిని అమలుపరిచే దారే తెలియదు. ధైర్యం చేయడానికి భయపడతారు. వెనకడుగు వేస్తారు. నువ్వా కేటగిరీలో లేవు. అందుకు అభినందిస్తున్నాను.

'నీళ్ళల్లో పడి కొట్టుకుంటున్న చీమను చూసి జాలిపడడం మానేయ్యాలి. దానికో ఆకును ఆసరాగా అందివ్వాలి. అప్పుడది బయటపడుతుంది. దాని దారి అది చూసుకుంటుంది.' అన్న నీ మాటలు, దానికి తగ్గ నీ చేతలు నన్ను ప్రభావితం చేశాయ్. నాకూ ఏదైనా సాయం చేయాలనిపించింది.

నీకో చెక్ పంపిస్తున్నాను. స్వీకరించు. వినియోగించు. నువ్వు ఎంతోమందికి ఆదర్శమవ్వాలి. నువ్వు చేసే ప్రతి మంచి పనిలో తోడుగా ఉండే నీ స్నేహితుడు .. నవీన్" చదవగానే గుండె బరువెక్కింది.

వసంత్ కళ్ళల్లో ఆనందబాష్పాలు కమ్ముకున్నాయి. ■

## మీ చేతిని అందించండి

ప్రేమతో మనసు చిగురించే కొమ్మ
వార్ధక్యం మనసు తొడగని మహావృక్షం
వాన చినుకులక్కరలేని బ్రహ్మజెముడు
ఎడారి గొంతులోంచి సైతం కూసే కోయిల
నిత్యం మనిషినీ కప్పుకున్న ఆకాశం ప్రేమ

ఇప్పుడది వాట్సాప్, ట్విట్టర్లా
డిలీట్ ఆప్షన్‌కి రాలిపోయే పువ్వు
ఒకే ఒక్క బ్రేకప్‌తో పుటుక్కున
గాజు పాత్రలా పగిలే మీడియా ప్రభావిత యుగం!

ఆనాడు రక్తంతో రాసుకున్న ప్రేమ ఉత్తరాలు కావు
అంతర్జాలంలో ఇప్పుడు ఒకే ఒక్క టచ్‌తో
అంతర్థానమయ్యే ఒక కల
ఒక ఆప్షన్‌తో మరొక ఆటను ఎన్నుకునే
సౌకర్యవంతమైన ఆట

ప్రేమ కాంపిటీషన్ గేమ్ కాదు
సవాళ్ళు విసురుకుంటూ నువ్వా నేనా అనుకోడానికి
వాడుకొని వదిలేసే భౌతిక పదార్థం అంతకన్నా కాదు

ప్రేమను ఎలా ప్రేమించాలో
ఒకరి ఇన్స్పిరేషన్ వాక్యాలు అక్కరలేనిది
మనసులో మాటను
చేతిలో చెయ్యేసి కలిసి బతకడం
షాజహాన్ ముంతాజ్
కుతుబ్ షాహ్ భాగమతి!

అక్బర్ సలీం అనార్కలి
లైలా మజ్ను, రోమియో అండ్ జూలియట్
ఓడిపోయిన ప్రేమలు
ఇంకా పాత గోడల పగుళ్ళలోంచి చిగురిస్తూనే ఉన్నారు

మల్లెతీగకు వాడిపోయిన
కొన్ని పువ్వులు ఉంటాయి
వాటి చెక్కిలి మీద జారే అమృతం లాంటి కన్నీటిని
మీ చూపుడు వేలితో తడమండి
ఈ కాలంలో కూడా కొత్తగా అవి చిగురిస్తాయి!

**- ఇబ్రహీం నిర్గుణ్**
**90636 96968**

## అణువణువూ ...

**అ**ప్పుడెప్పుడో ఒకసారి పుట్టాను
అప్పుడు నేను నాకు తెలీదు
ఏదీ అర్థం కాని పసితనం
బోసినవ్వుల్ని, అల్లరి చేష్టల్ని, ఆటపాటల్ని,
కోపతాపాల్నీ ఒక్కటొక్కటిగా పరిచయిస్తూ వచ్చేశాక..
అప్పుడు మొదలైంది!
మెల్లమెల్లగా నాలోంచి నేను దూరం జరగడం
మనసు చెప్పిన మాట వినడం మానేసి
సమాజంలోకి నాకు తెలియకుండానే ఇంకిపోయి
జీవితంలో జీవాన్ని పోగొట్టుకుని బతికేయడం!

పుస్తకాల్లో చదివిన దానికంటే
తిన్న ఆటుపోట్లు మస్తిష్కానికి జ్ఞానం ఇచ్చినా
ప్రేమానురాగాలే నిలబడేదని నమ్మి
అయిన వాళ్ళ కోసం కాలం కరగబెట్టేసుకున్నాక
అవసరాల నీడల తోడుకోసం
దాపరికాల మొహం వాళ్ళంతా ముసుగు తీసి ముందుకు
వచ్చాక..
కోరలు చాపుకున్న స్వార్థాలు
నన్ను కబళించాయన్న స్పృహలోకొచ్చాను

మనుషులు కొందరు
మనసుని తింటారని తెలిసినప్పుడు
మనసు మృతి చెందాక
నేర్చుకున్న కొత్త జ్ఞానంతో
విప్పారిన నేత్రాలతో
ప్రపంచాన్ని.. విశాల విశ్వాన్ని..
శాశ్వతాల మధ్య దూరాన్ని తెలుసుకుని
అప్పటి ఆ నేను
గతించిన గతంలోకి
నన్ను నేనుగా జారవిడిచి
మళ్లీ కొత్త జ్ఞానంతో పుట్టాను
అప్పుడు నా ప్రపంచం చిన్నది
ఇప్పుడు నా ప్రపంచం..
విశ్వంలోని అణువణువుదీ..


**- యామినీ దేవి కోడె**
**94928 06520**

# సాహితీ ప్రజ్ఞ

**నిర్వహణ : పిల్లా కుమార స్వామి**

1. 'పురాణం సర్వ సాహిత్య ప్రక్రియలకు మాతృభూమి' అని ఏ పురాణంలో చెప్పారు?
   ఎ. విష్ణుపురాణం బి. బ్రహ్మపురాణం సి. అగ్ని పురాణం డి. నారద పురాణం
2. తెలుగులో వచ్చిన మొదటి ఆత్మకథ
   ఎ. నా ఎరుక (ఆదిభట్ల నారాయణదాసు) బి. హింపి నుంచి హరప్పా దాకా (తిరుమల రామచంద్ర)
   సి. శతపత్రం (గడియారం రామకృష్ణశర్మ) డి. అనుభవాలు – జ్ఞాపకాలూనూ (శ్రీపాద)
3. 'వడగాడ్పు నా జీవితమైతే, వెన్నెల నా కవిత్వం' అని చెప్పుకున్న కవి ఎవరు?
   ఎ. కుసుమ ధర్మన్న బి. ఎండ్లూరి సుధాకర్ సి. వద్దెబోయిన శ్రీనివాస్ డి. గుర్రం జాషువా
4. 'దిగిరాను దిగిరాను దివి నుండి భువికి/ నవ్విపోదురు గాక నాకేటి సిగ్గు' అన్న కవి ఎవరు?
   ఎ. దేవులపల్లి రామానుజరావు బి. దేవులపల్లి కృష్ణశాస్త్రి సి. బాలగంగాధర్ తిలక్ డి. శ్రీశ్రీ
5. 'వనజ' పదానికర్థం? ఎ. రోజాపువ్వు బి. సంపెంగ సి. తామరపూవు డి. కనకాంబరం
6. 'నాలుగ్గాళ్ళ మండపం' రచయిత ఎవరు?
   ఎ. పులికంటి కృష్ణారెడ్డి బి. నరలా రామారెడ్డి సి. రావిశాస్త్రి డి. రాసాని
7. 'రాయలసీమ' అన్నపేరు ఎప్పుడు వ్యవహారంలోకి వచ్చింది?
   ఎ. 18.11.1928 బి. 28.11.1928 సి. 1.1.1928 డి. 31.12.1928
8. 'ఋతు సంహారం' కావ్య రచయిత
   ఎ. కాళిదాసు బి. భోజరాజు సి. అల్లసాని పెద్దన డి. శ్రీనాథుడు
9. 'కైశికి' అనగా
   ఎ. ఒక అలంకరణ బి. నృత్యరూపం సి. నాటకం డి. వ్యక్తిపేరు
10. నాట్యశాస్త్ర రచయిత
    ఎ. నందూరి రామకృష్ణ బి. నటరాజ రామకృష్ణ సి. అభినవగుప్తుడు డి. భరతముని
11. బృహత్కథ రచయిత
    ఎ. క్షేమేంద్రుడు బి. గుణ్యాఢ్యుడు సి. జాయప డి. హాలుడు
12. యక్షగానం ఏ జిల్లా నుంచి ప్రారంభమైంది?
    ఎ. కడప బి. కర్నూలు సి. అనంతపురం డి. చిత్తూరు
13. 'పండితారాధ్య చరిత్ర' రాసిన కవి
    ఎ. పాల్కురికి సోమనాథుడు బి.బసవేశ్వరుడు సి. తెనాలిరామకృష్ణ డి. వేములవాడ భీమకవి
14. కాకతీయుల కాలంలో ప్రసిద్ధి చెందిన నృత్యం
    ఎ. చర్చురా బి. తెగల సూడ సి. పేరిణి డి. కోలాటం
15. 'రామాయణ విషవృక్షం' రచయిత ఎవరు?
    ఎ. విశ్వనాథ సత్యనారాయణ బి. సుజరె సి. రంగనాయకమ్మ డి. సి.వి.
16. 'సత్యకామ జాబాలి' రచయిత ఎవరు?
    ఎ. సి.వి. బి. నార్ల వెంకటేశ్వరరావు సి. త్రిపురనేని రామస్వామి చౌదరి డి. ఆరుద్ర
17. 'శూద్రులు– ఆర్యులు' గ్రంథకర్త
    ఎ. డి.డి. కోశాంబి బి. డా॥ బి.ఆర్. అంబేద్కర్ సి. ఆరుద్ర డి. రాహుల్ సాంకృత్యాయన్
18. 'గుడిలో సెక్సు' గ్రంథ రచయిత
    ఎ. రావిపూడి వెంకటాద్రి బి. ఆరుద్ర సి. తాపీ ధర్మారావు డి. జయగోపాల్

జవాబులు : **1. డి 2. ఎ 3. డి 4. బి 5. సి 6. ఎ 7. ఎ 8. డి 9. ఎ**
**10. డి 11. బి 12. సి 13. ఎ 14. సి 15. సి 16. ఎ 17. బి 18. బి**




# అనుభవ గాథ వీరయ్య కథ

- విఎంకె లక్ష్మణరావు
94417 49192

**వీరయ్య .. నామవాచకం కాదు.**

**వీరయ్య .. ఓ కథా నాయకుడు కాదు.**

**వీరయ్య .. ఓ బహువచనం.**

**వీరయ్య .. ఒకానొక కాలపు జీవితానికి ప్రతిరూపం.**

**వీరయ్య .. దుర్భర, దారిద్ర్య, కాటక పరిస్థితులను తాళలేక బతుకుదారి వెతుక్కున్న బాటసారులకి ఓ నిలువెత్తు రూపం.**

**వీరయ్య .. జీవితమంటే ఎత్తుపల్లాలని సర్దుకుపోవడమే కాకుండా లేమి ఎంతటి శాపగ్రస్తమో వివరించే ఓ జీవితం. ఆ జీవితానికి నిలువుటద్దం ఈ పుస్తకం.** పేజీలను తిరగేస్తుంటే అక్షరాల్లోంచి దృశ్యం కదలాడుతుంది. ఒకానొక ఆలోచన దృశ్య రూపం దాల్చాలంటే అందుకోసం ఎంతగా శ్రమించాల్సివస్తుందో మనకి తెలుస్తుంది. పేరుకు ముత్తాత వీరయ్య గురించి ఆరాయే. కాని, దేశం కాని దేశానికి, ఖండంకాని ఖండానికి తన ముత్తాత ఎందుకు వెళ్లాల్సి వచ్చిందో? ఆ పరిస్థితులు తెలుసుకునే ప్రయత్నం కనిపిస్తుంది. అతను, అతనితో పాటు వెళ్లిన అనేక శ్రమ చేతులూ ఆ క్రమంలో కనుగొనడం జరిగింది. ఆ చరిత్రను తగిన పుస్తకాల నుంచి సేకరించడంతో పాటు తన నాయనమ్మ చెప్పే ఊసులను జోడించి అద్భుతమైన కల్పనతో, సరళమైన వాక్యాలతో ఆద్యంతం ఆకట్టుకుంటుంది. ముత్తాత మీద ప్రేమ, అనురాగం, ఆప్యాయత, ఆపేక్ష అనువణువునా అక్షర రూపంలో వ్యక్తమవుతూనే ఉంటుంది. కలని అందరూ కంటారు. ఆ కలను సాకారం చేసుకునేందుకు ఎంతగా ప్రయాశపడాలో రచయత కఅష్ట శ్రమలో ప్రస్ఫుటమవుతుంది. ఆ శ్రమ ఎంతో కఠోరమైంది. ఎన్నో వ్యయప్రయాశలతో కూడింది. విరామం ఎరగంది. కొన్నిసార్లు విసుగు పుట్టిస్తుంది. మరికొన్ని సార్లు ఇంత అవసరమా అనిపిస్తుంది. ఇంకొన్ని సార్లు దీని వలన ఏమి ప్రయోజనం అనిపిస్తుంది. కాని, శోధనలో తెలుసుకునే కొత్తకొత్త విషయాలు మనసును ఆహ్లాదపరుస్తుంది. ఉత్సాహంతో ఉరుకులు పెట్టేటట్లు చేస్తుంది. పదుగురితో పంచుకోవాలన్న తపనను రేకెత్తిస్తుంది. అటువంటి కోరిక ఫలితమే ఈ పుస్తకం. 190 ఏళ్ల క్రితం జరిగిన విషయాలు గురించి తవ్వి తీయాలంటే గతంలో ఎంతో కష్టమైన పని. 'ఇండెంచర్' రిజిస్టర్లు దొరికినా సరైన సమాచారాన్ని సేకరించేందుకు పడ్డ పాట్లు అన్నీ ఇన్నీ కావు. దీనికి కారణం అదొక గాథ. పేర్ల నమోదులో దొర్లిన తప్పులు. వలసదారి పట్టిన వారిలో కొందరు కులం రీత్యా తమను దాచుకునేందుకు తమ పేర్లని తప్పుగా నమోదు చేసుకోవడం, పేర్లను నమోదుచేసిన వారికి ఆ పేర్లతో భాషాపరమైన సమస్యలు ఉండడం... ఇటువంటి కారణాలు రీత్యా వీరయ్య ఆచూకీ పట్టుకోవడానికి రచయత ఎక్కిన గుమ్మం, దిగిన గుమ్మం తప్పింది కాదు. ఆయన అడుగులు సౌత్ ఆఫ్రికాలో పదిలంగా ఉన్నాయని తెలిసినా అవెలా కనిపెట్లాలన్నది రచయత కఅష్ణ గుబిలికి ఓ ప్రశ్న. ఎన్నెన్నో ప్రయత్నాలు. చివరికి తన కుటుంబ వఅక్షంలో ఓ కొమ్మ ఫేస్ బుక్ ద్వారా చేతికి చిక్కింది. అలా మెసేజీలలోంచి ఫోన్లలోకి సంభాషణలు సాగించే అనుబంధం ఏర్పడింది. ఆ అనుబంధంతో, ఆ చేయూతతో రెక్కలు కట్టుకుని సౌత్ ఆఫ్రికాలోకి అడుగుపెట్టడం, అక్కడ నుంచి పరిశోధనా కేంద్రాలకు పరుగులు తీయడం, ఆ కేంద్ర నిర్వాహకురాలి సూచనతో తిరుగు ప్రయాణ రిజిష్టర్‌ని సంపాదించడం, అక్కడ దొరికిన తీగను పట్టుకుని ఒక్కొక్క అడ్రస్‌ని కనుగొనడం, వారి గురించి ఆరా తీయడం, అలా తమ వంశ వఅక్షాన్ని రూపొందించడం... ఇవన్నీ సాంకేతికత పురోగతి సాధించి

పెట్టిన సౌకర్యాల పుణ్యమేనని మనకి తొలి రెండు అధ్యాయాలు అర్థం చేయిస్తాయి.

ఈ కథ ప్రధానంగా ఇండెంచర్ జీవితాలు చుట్టూనే తిరుగుతుంది. 1830లలో సాగిన ఈ విధానం గురించి విపులీకరిస్తుంది. నిరక్షరాస్యత, ఆర్థిక లేమి, నీటి వనరుల కొరత, గంపెడుమంది పిల్లలు, కూలి ఆడితేనే గాని పొయ్యి వెలగని పరిస్థితి. వీటికి తోడు కరవు కాటకాలు. వీటన్నింటితో ఒక్క ఆంధ్ర రాష్ట్రమే కాదు దేశ వ్యాపితంగా కూడా గ్రామీణ జీవితం కడు దుర్భరం, దయనీయం. తిండి కోసం పరితపించాల్సిన దుస్థితి. ఈ గాయాలకి తోడు వడ్డీ భారాలు మనషులను మనషులుగా ఉండేటట్లు చేయని పాడుకాలం. కసింత భూమి ఉన్న వాడి పరిస్థితే ఇంతటి దయనీయంగా ఉంటే లేని వాడి పరిస్థితి ఊహించడానికే ఉలికిపడే పరిస్థితి. వాటి పర్యవసానంగానే ఉత్తరప్రదేశ్, బీహార్, కలకత్తా, మద్రాస్ ప్రెసిడెన్సీ నుంచి ఇండెంచర్ కింద లక్షలాది మంది కూలీలు దక్షిణాఫ్రికా చెరుకు తోటల్లో పనికి తరలిపోవల్సి వచ్చింది. గ్రామాలలో బతకలేని స్థితిలో ఉన్న వారికి ఈ ప్రయాణం ఓ హామీ. మెరుగైన జీవితానికి భరోసా. ఇక్కడ ఉండి పస్తులు ఉండే కన్నా అక్కడకి వెళ్లి బలుసాకు తినైనా బతకవచ్చునన్నది తొలి అడుగులు చెప్పే చేదు నిజం. ఈ పరిస్థితులే శ్రామికుల మారకానికి ఓ వ్యవస్థనే నెలకొనేటట్లు చేసింది. తరలించేందుకు ఓ కంపెనీ, ఆ కంపెనీ పరిధిలో లైసన్సుదారులు. ఆ లైసన్సుదారుల కింద ఏజెంట్లు, ఆ ఏజెంట్లు కింద మాటలతో బురిడీలు కొట్టించేవారు. ఇలా ఉంటుంది. వీరి పని అంతా గ్రామాలలో తిరగడం, పట్టణ కూడలల్లో మాటు వేయడం, నిస్సహాయి స్థితిలో ఎవరు కనిపించినా, ఏ పనీ దొరకడం లేదని నిరాశా, నిస్పృహలో కొట్టిమిట్టాడుతున్నట్లు ఏ మాత్రం కనిపించినా, ఒంటరి బతుకులు వెళ్లి దీస్తున్న వారి అగుపించినా 'ఎక్కువ ఆదాయం' అని మంత్రం వేసి వారిని వశపరుచుకోవడం. గేలానికి చిక్కిన దగ్గర నుంచి ప్రేమంతటినీ ప్రదర్శించడం, వారి అవసరాలకి కొన్ని పైసులు ముట్టజెప్పడం, ప్రయాణానికి బయలుదేరేటట్లు వశీకరించడం ఎంత నేర్పుగా సాగుతుందో కళ్లకు కదుతుంది. అలా మూట సర్దుకుని బయలుదేరిన వారందరినీ ఒక దగ్గరికి చేర్చుతారు. బెజివాడలో అయితే ఆనాడు అటు మద్రాసుకిగానీ, ఇటు కలకత్తా లేబర్ డిపోలకే వారిని తరలించేవారు. వాస్తవానికి, వారివారి స్వస్థలాల నుంచి తీసుకుని వెళ్లే ట్రైన్‌లలో ఉన్న స్థాయీ బేధాలు, ఆ బోగీలు చాటి చెప్పేవి. ఇప్పుడు మనం చూసినట్లయితే పశువులను తరలించే బోగీలు నాడు వీరిని తరలించేందుకు ఉపయోగించేవారు. శారీరక అవసరాలు తీర్చుకోవాలన్న కూడా ట్రైన్ ఆగాల్సిన పరిస్థితులు నెలకొని ఉండేవి. అటువంటి అస్పుఅశ్యత కొనసాగేది. అది కూడా బగ్గుతో నడిచే ట్రైన్లు. అంటే ఎంత సమయం పడుతుందో మనం అర్థం చేసుకోవచ్చు. ఆయా గమ్య స్థానాలకు చేరుకున్న తరవాత వారిని డిపోల వద్దకు తోలుకుని వెళ్లేవారు. ఆ బందెల దొడ్డిలోకి చేర్చిన తరువాత అక్కడ నుంచి వారు బయటకి వెళ్లడానికి అవకాశం లేదు. ఇండెంచర్ కింద వెళ్లేందుకు ఓడ వచ్చేందుకు వేచి ఉండాలి. అది వచ్చేంత వరకే కాదు. అది నిండేంత వరకూ అక్కడే పడిగాపులు కాయాలి. ఆ ఏజెంట్లు పెట్టింది తినాలి. ఓడ వచ్చే సమయానికి ఒప్పంద పత్రాలు వస్తాయి. అంతకముందు వారు అక్కడ పనిచేసేందుకు తగిన ఆరోగ్యవంతులా కాదా అన్నది కూడా మెడికల్ రిపోర్టు తీసుకోవల్సి ఉంటుంది. ఇందుకోసం పట్టణం నుంచి వచ్చే డాక్టర్ బాబు సర్టిఫికేట్ చేస్తేనే ఓడ ఎక్కుతారు. లేకుంటే ఇంటికి వారి మానాన వారు వెళ్లాల్సిందే. ఈ క్రమంలో కొన్ని కుటుంబాలు విచ్ఛిన్నమైన పరిస్థితి కనిపిస్తుంది. భార్యాభర్తలు విడిపోవడాలు తటస్థిస్తాయి. అక్కా చెల్లల్లూ, అన్నాదమ్ముళ్లూ ఒకరిని మరొకరు వదలుకోవల్సీ వస్తుంది. ఈ అడ్డంకులన్నీ దాటుకుంటే గాని దక్షిణాఫ్రికా తోటల్లో పనికి వెళ్లలేని పరిస్థితి. వీటన్నింటి రీత్యానే బంధాలనూ, బంధుత్వాలనూ, రక్త సంబంధాలనూ తెంచుకుని తమ తమ గ్రామాలలో పడ్డ కష్టాల నుంచి గట్టెక్కాలని చావోరేవోకో సిద్ధపడిన తీరు తరుమకొచ్చిన జీవన పరిస్థితులు కళ్లకు కడతాయి. కదిలిన ఓడల్లో స్థాయీ బేధాలు కనిపించినా, మూడో తరగతిలో ఉన్న ఇండెంచర్ కూలీల్లో మాత్రం ఎటువంటి కులాల, వర్ణాల పట్టింపులూ కనిపించనైనా కనిపించవు. కాని, బలహీన స్థితిలో ఉన్న మహిళల పట్ల వివిధ స్థాయిల్లో ఉండే మగవాళ్ల అసభ్యకరంగా ప్రవర్తించడం కూడా ఈ ఓడలో ఓ ఘటన చాటిచెబుతుంది. ఇటువంటి ఎన్నో ఘటనలతో కూడిన ఆ ప్రయాణ అనుభవాలన్నీ సినిమాని మరిపిస్తాయి.

సుదీర్ఘకాల ప్రయాణం తరువాత బతికిన వారు పనికి అమ్ముడుపోయేందుకు మరో ఒడ్డుకు చేరుతారు. అక్కడ కూడా తమని కొనుగోలు చేసుకునే వారి కోసం నిరీక్షణ. కొన్ని రోజులు తరవాత వచ్చే దొరలు తమకి పనికి వచ్చే వారెవరో వైద్య పరీక్షలు చేయించి మరీ కొనుగోలు చేస్తారు. ఆ అదఅష్ట పరీక్షలో ఎంపికైన వారు అయిదేళ్ల కోసం ఇండెంచర్ చేయాల్సిందే. గ్రామాల నుంచి తరలించేందుకు ఏజెంట్లు చెప్పిందానికీ, మద్రాసులో ఓడ ఎక్కే ముందు సంతకం చేసిన కాగితాలకీ, ఇక్కడకి చేరిన తరువాత జరిగిన అంగీకార పత్రాలకీ ఏ మాత్రమూ సంబంధం ఉండదు. ఆ విషయం

కూడా నిరక్షరాస్యత రీత్యా తెలుసుకునే అవకాశం లేదు. రోజుల తరబడి కాలి నడకన చెరుకు తోటలకి పయనం, ఎంతో కఠినమైన అక్కడి పని విధానం, ఆ పనిలో ఏమాత్రం అలసట చెందినా సర్దార్ చేత కొరడా దెబ్బలు, జీతం కోతలూ... ఇలా చెప్పుకుంటూ పోతే అదో కన్నీటి గాథ. వీటన్నింటి మధ్యనే వీరయ్య నడిచాడు. ఈ క్రమంలోనే స్నేహితులను కూడగట్టాడు. ఒకరికిమరొకరు చేదోడువాదోడు అయ్యారు. కులమతాల పట్టింపులు లేకుండా అందరూ కలిసికట్టుగా పనిచేసేవారు. ఆ పనిలో దెబ్బ తగిలిన ప్రతి సారీ పుట్టిన ఊరి బంధాలు కదిలేవి. అమ్మానాన్నల జ్ఞప్తికి వచ్చి తుళ్లిపడే వారు. బెంగపెట్టుకునేవారు. ఎవరి గతాలను వారు ఒకసారి అవలోకనం చేసుకోవడంతో కన్నీటి చారికలు కట్టేవి. అంతలోనే వారికి వారే ఓదార్చుకునే వారు. మరొకరి భరోసాతో తేరుకునే వారు. ఈ కష్టాలు కలకాలం ఉండవని, డబ్బులు సంపాదించుకుని ఇంటికి పోవచ్చనని ఎవరికి వారు తమాయించుకుని తెల్లేరే ఎవరి పనిలో వారు పడే వారు. కాని, వారాంతంలో డబ్బులు అందుకునే సమయానికి చేతిలో చిల్లిగవ్వ కూడా మిగలక లబోదిబోమనేవారు. మోసం పోయామని అనుకునేలోపే సర్దార్ గాండ్రింపు తుళ్లిపడేలా చేసేది. ఈ లోకంలోకి తిరిగి వచ్చేసరికి ఎదురుగా చేయాల్సిన పని కనిపించేది. నిర్ణీత పనిని నిర్దేశిత కాలంలో పూర్తికాకపోతే ఇచ్చిన ఈ అరకొరలో కూడా కోతలు పడేవి. దీంతో బతుకు దుర్భరంగా మారేది. ఒక్కసారిగా పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డామన్న బాధ నలిపేది. అయినా ఒప్పుకున్నాక తప్పుకుందామన్న వీలులేని పరిస్థితి.

జరిగిన మోసం గురించి చెప్పుకునే వీలు ఆ దేశంలో చట్టం కల్పించింది. ఆ చట్టం ముందు మొరపెట్టుకునేందుకు వెళ్లాలంటే ఎవరి మీదనైతే ఫిర్యాదు చేయాలో వారి వద్ద నుంచే 'పాస్ ' పొందాలి. ఆ పాస్ లేకుండా ఆ తోట దాటి వెళ్తే పోలీసులతో నానా అవస్థలు పడాల్సిన పరిస్థితి. అంటే ముందుకు వెళ్తే గొయ్యి, వెనక్కి వెళ్తే నుయ్యి అన్న చందాన వారి పరిస్థితి తయారైంది. అయినా అడిగే వారు ఉండరు. కడిగే వారు అసలే ఉండరు. దేశం కాని దేశంలో నోరుమూసుకుని అనుభవించడం, తమ తలరాతలని ఎవరికి వారు నిందించుకోవడం అక్కడ పరిపాటి. పొరపాటున కష్టమనిపించి గొంతెత్తి తన గోడు వినిపించుకుంటే సర్దార్ పెట్టే వాతలతో వారి పని సరి. ఎంతో విషాదభరితమైన ఈ ప్రయాణంలో పని దొరికిందన్న చిన్నపాటి ఆశ. కన్న ఊరిలో ఇదికూడా లేదన్న యాతన. ఆ దుర్భిక్ష పరిస్థితుల వలనే ఎంత దూరం వచ్చామన్న తలపు. అలా సర్దుకుని పోయారు ఏళ్లకు ఏళ్లు. అయిదేళ్లు గడిచిన తరవాత చట్టం ప్రకారం ఫ్రీ లేబర్ అవుతారు. ఎక్కడైనా పనిచేసుకునే స్వేచ్ఛను ఇచ్చిన ఆ చట్టమే అలా బతికేందుకు కొంత రుసుం చెల్లించాలని ఆంక్ష విధించడం విస్తుగొల్పుతుంది. చట్టం ఉన్న వాడి చుట్టం ఇందుకనే అంటారనిపిస్తుంది. ఆ బాధలన్నింటినీ తాళలేక ఎంతకాలమైనా అక్కడే ఆ ఎస్టేట్ ల్లోనే కాలం గడిపేవారు. అలాంటి వాస్తవిక జీవితంలోంచి ఒకానొక రోజున వీరయ్య గాంధీ ఆశ్రయానికి వెళ్లాల్సిన రావడం, అక్కడ మరో ఎస్టేట్ సర్దార్ కిషన్ సింగ్‌తో పరిచయం ఏర్పడడం, ఇండెంచర్ పూర్తి అయిన తరువాత సింగ్ సహకారంతో 'హ్యూలెట్' ఎస్టేట్‌కి తరలిపోవడం జరుగుతుంది. అక్కడ వీరయ్య నాయకత్వ పటిమను గుర్తించిన కిషన్‌సింగ్ మరింతగా ప్రోత్సహించడం, అతను ఎస్టేట్ వదిలే సమయానికి ఆ సర్దార్ పదవిలోకి వీరయ్యను సిఫార్సు చేయడం, అందుకు ఆ ఎస్టేట్ యజమాని అంగీకరించడం జరిగిపోతాయి.

అలా సర్దార్ వీరయ్య అయ్యాడు. అమాంతం జీవితంలో కొత్త వెలుగులు తొంగిచూస్తాయి. అలా ఓ కుటుంబం ఏర్పడుతుంది. కష్టమయ జీవితం నుంచి సుఖమైన జీవనయానం సాధ్యమవుతుంది. అందివచ్చిన అవకాశాన్ని అందిపుచ్చుకుని నిలదొక్కుకున్న వైనం మనకి కనిపిస్తుంది.

ఒకానొక రోజున వీరయ్య తన కుటుంబాన్ని బలవంతంగా ఒప్పించి ఇండియాకి తిరిగి రావడం జరుగుతుంది. విజయవాడ వద్ద గల తన సొంతూరు కుర్లపాడు వెళ్లడం అక్కడ తన తల్లిదండ్రులు చనిపోయారన్న వార్తతో కలత చెందడం, సికింద్రాబాద్‌లో తలదాచుకోవడం, తను తెచ్చుకున్న బంగారం, డబ్బూ కొంత తన స్నేహితులకీ, తన బంధువులకీ దానం చేయడం జరిగిపోయింది. ఆ తరువాత కుటుంబ కష్టాలు ప్రారంభమవుతాయి. వీరయ్య భార్య అనుమానించినట్లుగానే సొంత గడ్డ మీద పరాయివాళ్లుగా మసలాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. అక్కచెల్లెళ్లని కలుసుకున్నా జీవితంలో వెలితి మాత్రం తీరలేదుగాక తీరలేదు. విషాదపు ఛాయలు తొలగలేదు. కుటుంబంలో సంక్షోభం ఏర్పడింది. చెల్లాచెదరు అయ్యారు. ఒకరి తరువాత మరొకరు వ్యధాభరితమైన జీవితాలను గడిపి తనవు చాలిస్తారు. ఈ మధ్యలో ఆనాటి కాలంలో మద్రాస్ ముఖ్యమంత్రి మునిస్వామి విజయవాడ వచ్చినప్పుడు ఇంగ్లీష్‌లో వారిని ఆకర్షించేందుకు వీరయ్య కుమారుడు నాగూరు ఎంతో ఉపకరించేవారు. అది ఎంతగానో నాగూరికి ఉపయోగపడింది కూడా. ఇండెంచర్ కింద బ్రిటీష్ ప్రభుత్వం ఇవ్వాల్సిన భూమి కోసం ఎన్నిమార్లు ప్రయత్నించినా ఫలితమివ్వనది, 'ఆంగ్ల భాష' ఆ అదృష్టాన్ని కల్పించింది. దక్కిన భూమిని చదును చేసుకుని

ఆదాయంగా మారుతున్న సమయానికి సినిమాలో ట్విస్టు మాదిరిగా ఆ భూమి మీద మనసు పడిన గ్రామ పెత్తందారు బయటకి వస్తాడు. దాని స్వరూప, స్వభావాలను కూడా మార్చారు. ఆ పెత్తందారు వేసిన ఎత్తుగడలతో వీరయ్య కుటుంబం ఛిన్నాభిన్నమవుతుంది. మళ్లీ కొత్త జీవితాల కోసం వెంపర్లాట మొదలవుతుంది. ఆ నాగూరు కుమారుడే గురుమూర్తి, ఆ గురుమూర్తి కుమారుడే కలష్ణ. ఆ కలష్ణే ఈ రచయత.

ప్రస్తుతానికి రచయత కలష్ణ అమెరికాలో ఉద్యోగం చేస్తున్నారు. తెలుగునాట సాహితీవేత్తల సహచర్యంతో, నాయనమ్మ చెప్పే కథలతో సాహిత్యం పట్ల అనురక్తిని పెంచుకున్నారు. ఆ క్రమంలోనే ఈ శోధనకి సిద్ధపడ్డారు. వృత్తి రీత్యా ఎన్నో దేశాలు సంచరించారు. ఆ క్రమంలో అనేక జీవితాలను చూశారు. వారితో సంభాషించారు. అలా దొరికిన మరో జీవితమే మల్లేష్. చివరి అధ్యాయంలో ఆయన పరిశీలనా క్రమం ప్రశంసనీయం. ఇండెంచర్ కి కాలం చెల్లినా అది అధునికతను సంతరించుకుని 'కఫాలా' రూపంలో కొనసాగుతుందన్న వాస్తవం మనకు అర్థం చేయిస్తుంది. అందుకు దుబాయ్‌లో భారతీయ కూలీల జీవితానుభవాలు మన కళ్లకు కడతాయి. మల్లేష్ జీవితాన్ని ఆధారం చేసుకుని నాటికీ, నేటికీ పరిస్థితుల్లో ఏ మార్పూ లేదన్నది బోధపడుతుంది. ఆనాడు చట్టాలూ, హక్కులూ అనేవి లేని కాలం. కాని, ప్రపంచ స్థాయిలో ఎన్నో సంస్థలు, హక్కుల కోసం పనిచేసే ఎన్నో వ్యవస్థలు ఉన్నప్పటికీ అవేమీ కూలీ జీవితానికి భరోసాని ఇవ్వడం లేదన్నది తేటతెల్లమవుతుంది. ఈ పరిస్థితులు మారేందుకు ఓ ప్రయత్నం చేయాలని, అందుకు అందరి సహకారం కావాలన్న అభ్యర్ధనతో ఈ కథ ముగుస్తుంది.

255 పేజీల ఈ వీరయ్య పుస్తకంలో కిల్లీ క్యాంప్ బిల్ గ్రంథం నుంచి అనేక ఫోటోలను మనకి అందించారు. అధ్యయనం చేసిన వివిధ పరిశోధనా పత్రాల నుంచి సమాచారాన్ని సమీకరించారు. మహాత్మాగాంధీ ముని మనవరాలు ఉమామేస్త్రీతో సహా వివిధ పరిశోధనా పత్రాల నుంచి, పుస్తకాల నుంచి సమాచారాన్ని సేకరించారు. ఈ రచనల సహకారంతో వీరయ్య కథను ఆకట్టుకునే విధంగా, ఆసక్తికరంగా రూపొందించారు. ఇంగ్లీష్‌లో కృష్ణ రచన చేస్తే తన తండ్రి గురుమూర్తి తెలుగీకరించడం ఓ విశేషం. చదివించే గుణమున్న ఈ రచనకి ముందుమాట రాసిన తనికెళ్ల భరణి 'ఘనీభవించిన తమ పాత తరాల కన్నీటి బిందువుల్ని వజ్రాలుగా మూటగట్టి 'వీరయ్య'గా మన ముందు పరిచారు' అని చెప్పడం ఈ పరిచయానికి ముమ్మాటికీ సందర్భోచితమవుతుంది. ■




## కలల పిట్ట

మెరుపులాంటి కల
పెదాల మీద చిరునవ్వులా
మదిలో మెదిలి అంతర్ధానమైంది
మంచు తాకిన మైకంలో
సీతాకోకచిలుక రంగుల్ని
వలకబోసుకుని కన్నీరై కరుగుతోంది
రెక్కలు తెగి నేలపడ్డ
ఇంద్రధనస్సు జటాయువులా విలపిస్తూంది
వనాలనుంచి తప్పిపోయిన వసంతం
కాంక్రీటు భవనాల గాజు కిటికీలకు వేలాడుతోంది
సన్నజాజి పందిరి కూలి
నిండు జాబిలి కరిగిపోయింది
ఆనందానికి విషాదం తోడయింది
పూలు, కన్నీళ్ళైన వాన
గుండెల్ని తడిపేస్తుంది ఇక ఈ రాత్రి
బతుకు అలిసిన కనురెప్పల కిటికీలు
ఎంతకీ తెరుచుకోవు కదా
వేకువ రాకముందే
కలలపిట్ట కన్నుమూసింది
లోకమంతా దుఃఖపు ముసురు అలుముకుంది

◆◆◆

మనసున్న చేతులు ముందుకు వచ్చి
ఈ అనాధ శవాన్ని పక్కకి తీస్తే బాగున్ను..!

**- లోసారి సుధాకర్**
99499 46991





# అరచేతిలో పువ్వు బువ్వ ఆరగిద్దామా?

- పిల్లా తిరుపతిరావు
70951 84846

**ఉ**త్తరాంధ్ర నేలతల్లి నుంచి ఉద్భవించిన కవులలో సహజసిద్ధమైన, సుందరమైన దేశీయ కవిత్వాన్ని పండిస్తున్న సృనశీలిగా 'చింతా అప్పలనాయుడు' గారికి విశిష్ట స్థానం ఉంది. ఈయన కవి మాత్రమే కాదు, మంచి కథకుడు కూడా. ఇతని సాహిత్యం ఎటువంటి ఆర్భాటాలకు, భేషజాలకు పోదు. అత్యంత సాదాసీదాగా సరళమైన భాషలో సొగసు ఉట్టిపడేలా వాక్య నిర్మాణం ఉంటుంది. సిక్కోలు జానపదుల మాండలిక శోభ తన నవరసభరిత భావనలతో మరింత పరిమళిస్తుంది. కప్పిపుచ్చేది కవిత్వం అంటారు పెద్దలు. వారే సంక్లిష్టత, మార్మికత మొదలగు లక్షణాలతో నిర్మించబడిన కవిత్వం శ్రేష్టమైనదిగా భావిస్తారు కూడా. కానీ లోతైన భావనలను సులువుగా పాఠకులకు అర్థమయ్యేలా రాయడం కూడా ఒక ప్రావీణ్యతే. అందుకు తగిన భాషా పనిముట్లు ఎంపిక చేసుకోవడం కూడా కవికి తెలియాలి. అదే కదా 'చింతా' కవిత్వం యొక్క ప్రత్యేకత. ఈ మధ్యకాలంలో వస్తున్న కవిత్వంలో 25% నుంచి 50% వరకు వస్తువులోని అంతరంగం పామరులకే కాదు, పండితులకు కూడా అర్థం కావడం లేదు. గాఢత పేరిట నవ కవిత నిర్మాణం పక్కదారి పడుతున్నది. అనునిత్యమూ సంఘర్షించే పీడిత వర్గానికి అందనంత ఎత్తులో ఉన్న కవిత్వం ఎప్పటికీ శ్రేయోదాయకం కాదు. వీటికి విరుగుడుగా చింతా కవిత్వం ఉంది.

ఈ  సంపుటిలో గల 55 కవితలలో ఒక్క వాక్యం కూడా సామాన్య జనానికి అర్థం కాకుండా ఉండదు. అంటే జన సామాన్యమైన కవిత్వాన్ని నిర్మించడంలో మాస్టారిది అందెవేసిన చేయి. ఒకపక్క వివిధ సమస్యలను  ఎత్తిచూపుతూ మరోపక్క పరిష్కార మార్గాలను అన్వేషిస్తూ అలతి అలతి పదాలతో ఇతని కవిత్వం స్వచ్ఛంగా ఉంటుంది. భౌతికత, స్వాభావికతే ప్రామాణికంగా తీసుకుని ఇతని కవనం ముందుకు పోతుంది. ఈ సంపుటిలో చింతా అనేక సామాజిక కవితా వస్తువులను పఠితులకు పరిచయం చేసారు.

ఈ 'అరిసేతిలో బువ్వపువ్వు' పుస్తకంలో అంశాలను కవి సాధికారకంగా ప్రస్తావించారు. మాతృభాష-తెలుగు భాష వైశిష్ట్యం, మాతృమూర్తి-అవ్యాజనురాగ బంధం, పల్లెల్లో మార్పులు- గతకాలపు వైభవాలు, వ్యవసాయం - రైతు ఆవేదనలు, వృద్ధాప్యము- అంతర్మథనం, అంతర్జాలము- స్మార్ట్ ఫోన్ల వినియోగం, సామాజిక అడవులు- జల వనరులు, కరోనా వ్యాధి- మానవుని స్థితిగతులు, వలస జీవనము- అగచాట్లు, ప్రైవేటీకరణ-ఉక్కు ఉద్యమం, బడిబాటలు- విద్యార్థి బేలచూపులు మొదలగు వస్తువులతో ఈ సంపుటి కవిత్వీకరించబడి నూత్న రూపుదాల్చింది.

ఈ సంపుటిలో మొదటి కవిత 'తెలుగు నా కంటి వెలుగు' లో తెలుగు భాష అందాన్ని, దానికి మనిషితో గల అనురాగ బంధాల్ని కవి తన కోణంలో వివరిస్తాడు. 'చీకటిని చీల్చుతూ/ మా ఇంటి కోలగూడు లోంచి/ కొక్కురోకోమన్న కోడి కూత తెలుగు/ వలపలదాపల ఎడ్లను పలకరించి/ అయ్య చేతిలో పూసిన ఏరు పూత తెలుగు/ ఏరెనకాల అడుగులేస్తున్న/ అయ్య నడుముకు చుట్టి ఉన్న/ ఐదు మూల గావంచ తెలుగు/ మా అమ్మ కట్టుకున్న ఏడు గజాల నేత కోక తెలుగు' భాషను సాధారణమైన జనజీవనములో బంధించి తెలుగు ప్రాశస్త్యాన్ని కవి చూపిస్తాడు.

నేడు రైతు కరువు కాటకాలను ఎదుర్కొనడం సర్వ సాధారణమైంది. వాటిని ఎంతో హృద్యంగా వివరిస్తూ సాగిన

కవిత 'ఒక్క తడి కోసం'. 'ఒక్క తడి తగిలితే సరిపోను/ పొట్ట మీదుంది వొరిసేను/ అటు ఆకాశంకి ఇటు భూదేవతకీ/ సూపుల దాపకట్రల మీద తచ్చాడుతూ/ నిలువెల్లా నీరు గారిపోతున్నాను' ఇలా కర్షకవీరులు కన్నీరు కారుస్తూ వానమ్మ కోసం అనుక్షణం ఎదురుచూస్తుంటారు. కానీ ఆ తల్లి కనికరించక పంటలు ఎండినపుడు ఒకానొక క్షణంలో తీవ్ర మనస్తాపానికి గురై ఎందరో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. దాన్ని కవి ఎంతో ఆర్ద్రంగా 'తమ కొమ్మలకే ఏలాడి పేనాలు తీసుకుంటున్నా/ ఏమీ సెయ్యలేకపోతున్నందుకు/ సెట్లు తమలో తామే కుమిలిపోతన్నాయి' అంటాడు.

'తూరుపుకొండ తొలి పొద్దులం'లో గతంలో జరిగిన సిక్కోలు ప్రజల అసమాన్య పోరాటాన్ని జ్ఞప్తికి తెస్తాడు కవనయోధుడు. 'కాదు పోదని అరిచినందుకు జైళ్ళు నోరుసాపడం/ ఈ నేలకు కొత్తేమీ కాదు/ ఎదురు తిరిగిన పాపానికి/ చావులే సమాధానమవ్వడం/ ఇక్కడి చరిత్రకు ఎన్నో సాక్ష్యాలు/ మీరు వీరులు/ సిక్కోలు సిందవలు/ అల్లూరి వారసులు' అంటూ ఉత్తరాంధ్ర ఉద్యమ వారసత్వాన్ని వీరోచితంగా ప్రస్తావిస్తాడు.

50 ఏళ్లకే అకాల వృద్ధాప్యం చెంత చేరడం నేటి మానవ జీవనశైలికి అద్దం పడుతున్నది. ఈ క్రమంలో షుగరు, బిపి, కీళ్లవాతం సంక్రమించడం షరా మామూలయ్యింది. దీన్ని పరిశీలించిన కవి ఇలా అంటాడు. 'ఇల్లరికపు అల్లుడిలా వచ్చిన షుగరు/ ఎన్ని మాత్రలేసి కొట్టినా/ ఇంటివొంటిని వదలి వెళ్ళనంటుంది/ ఆనప తుంబలాంటి/ ఈ పొట్ట ఎలాగొచ్చి పడిందో ఏమో/ అయినా పట్టించుకోకుండా/ మనసు గట్టిచేసుకున్నాను గానీ/ తలమీదికి పట్ట వచ్చిన తరువాత/ పట్టాల మీద పడాలనిపించింది' ఇలా వ్యక్తి మధనపడడాన్ని భౌతికతతో నింపి చెబుతాడు.

మరో కైత 'రోజుకో కథ'. ఇందులో మానవుడు తరచూ అంతర్జాలంలో చెడు అంశాలను చూసి, మృగంగా మారడాన్ని వివరిస్తాడు. ఆడపిల్లలపై అనునిత్యమూ అత్యాచారాలు జరగడానికి గల కారణాలు విశదీకరిస్తాడు కవి. 'వాడి మత్తు కళ్ళకి ఆడపిల్లలంతా తోలుబొమ్మలే/ ఈ రెండు పాదాల పశువులన్నీ రంకెలేస్తూ/ అవి వచ్చిన ద్వారంలో దూరడానికి/ కాలు దువ్వడం ఎంత నీచం' అంటూ కవి తీవ్ర మనస్తాపం చెందుతాడు. 'మదపుటేనుగులు మీదికొస్తున్నప్పుడు/ మల్లెతీగల్లా కాదు/ పల్లేరుల్లా నేలంతా అల్లుకోవాల/ తోడేళ్ళు చుట్టుముట్టినప్పుడు/ అత్తిపత్తిలా ముడుచుకోవడం కాదు/ విచ్చుకత్తులై మొలకెత్తలా' ఆడది అబల కాదు సబల అంటూ తిరగబడాలి ఈ మానవ మళగాలపై అనే వైప్లవికి సందేశాన్ని కవి ఇస్తాడు.

వానను 'వాన' అనే కవితలో జానపద సౌందర్యాన్ని మేళవిస్తూ వర్ణిస్తాడు కవి. 'వాన ఇలాంటలాంటి వానా/ రూపాయల వాన/ మడికట్టు వాన/ ముత్యాల వాన/ వాన ఇలాంటలాంటి వానా/ ఏడాది బతుక్కి ఎదురులేదని చెప్పిన వాన' అనావృష్టిలో పల్లెల్లో ప్రజలు వాన కోసం ఎదురు చూసినపుడు పెద్ద వర్షం వచ్చి పడి, భూమంతా నీటి కళకళలు నింపితే ఆ క్షణాన రైతులు వర్షాన్ని రూపాయలతో కొలవడం పరిపాటి.

'చెట్టు' అనే కవితలో పరోపకారానికి ప్రతిరూపాలు చెట్లే, అని వృక్షరాజాలను కవి గొప్పగా వర్ణిస్తాడు. 'తల్లిలా లాలించాలన్నా/ వైద్యుడై రోగాలు నయం చేయాలన్నా/ పందిరి కోలు పట్టిమంచమవ్వాలన్నా/ కడసారి మనిషితో కలిసి బూడిదవ్వాలన్నా/ చెట్టుకే చెల్లింది' అంటూ ప్రకృతి ప్రసాదించిన జీవజాలాన్ని రక్షించుకోవలసిన బాధ్యతను ప్రకటిస్తాడు కవి.

గిరిజనుల జీవనశైలిని 'కొండా కొండా దండగుచ్చుకొని' కైతలో ప్రశంసిస్తాడు. కొండ దిగునున్న ప్రాంతపు మనుషులతో స్నేహాన్ని వారు కోరుకుంటారు. ఈ క్రమంలో లభించే ప్రతి వస్తువుకూ పులకరించి పోతారు. పట్టెడు మెతుకులకు మురిసిపోతారిలా. 'మా ఆవిడ పెట్టే పట్టెడు మెతుకులకే/ అమాయకం నిండిన మనుషులు/ నెలవంకలై మెరిసిపోతుంటే/ ఇటికీ పున్నమి వెన్నెల/ నా ఇంటి ముందే విరగగాసినట్టుండీది' వీరు కొండమీద పండిన పంటలన్నీ మైదానవాసులకు ప్రేమతో ఇస్తూ పరవశించిపోతారు. ఇది గిరిజన అమాయక ప్రజల సుందర జీవనశైలి. ఈ జీవన మాధుర్యాలను నేడు వారికి దక్కకుండా నాగరిక సమాజం కుట్ర పన్నడం దారుణం కదా!

నల్ల చట్టాలపై నిరసనగా చేపట్టిన ఉత్తర భారత రైతు ఉద్యమం ధాటికి కేంద్రం మెడలు వంచక తప్పలేదు. ఆయా చట్టాలను రద్దు చేసింది కూడా. 'కుకుందువుగాని కుర్చీ మీద' అనే కవితలో పాలకుల వైఖరిని కవి ఇలా ఆక్షేపిస్తాడు. 'నీ నల్ల సట్టాల బెల్లం పూతలు/ నాకడానికి మాకింకా ఓపిక లేదు/ మద్దతు ధర సట్టబద్ధం కాదంటే/ఉన్న గోసిల్ని ఊడదీయడమే గదా/ తిరగల్లో గింజల్లా మీము గింజుకొని/ కలోగెంజో తాగి నిరసన గీతాలమైతే/ దున్నపోతు మీద వాన కురిసినట్టే ఉంది/ కూకుందువుగాని కుర్చీమీద/ నిన్న కుర్చీలమీద కూకున్నోలు/ ఇప్పుడు ఎక్కడ ఉన్నారో ఒక్కసారి ఎనుదిరిగి సూడు/ కూకుందువుగాని కుర్చీమీద' పాలకులకు చురకలంటిస్తాడు కవి. రాబోవు ఎన్నికలలో కుర్చీ దిగక తప్పదని హెచ్చరిస్తాడు కూడా.

పాఠశాలల్లో కనీస వసతులు కల్పనా లక్ష్యంతో ప్రభుత్వం నిధులు మంజూరు చేయగా, బళ్ళు సర్వాంగ సుందరంగా

తయారయ్యాయి. కానీ ప్రభుత్వం అస్తవ్యస్త విధానాలతో పాఠశాలలను విభజించడం, విలీనం చేయడానికి పూనుకుంది. దాంతో బడి-పిల్లలు-ఉపాధ్యాయుల మధ్య దూరం పెరిగింది. విద్యా ప్రమాణాలు దిగజారే ప్రమాదముంది. రెండు మాధ్యమాలను కొనసాగించాల్సిన స్థితిలో పరభాష మాధ్యమాన్ని మాత్రమే కొనసాగించడం అప్రజాస్వామికం. 'బడికెళ్ళమంటే/ బెదిరిన బేపికూనలా/ యనకడుగులేస్తండు/ బడి అనీసరికి/ పాలకొదిలిన కుడుబ్బెయ్యలా పారిపోయాడు/ పరబాస గొంతులో/ యలంకాయలా పడుతందనో/ మూతికాలిన పిల్లికూనలా/ తెగులొచ్చిన కోడిపిల్లలా బడికెళ్ళమంటే ఎల్లడు' అని నేటి దుస్థితిని కళ్ళ ముందుపెడుతూ రాజ్యం అనాలోచిత విధానాలను కవి ఎండగడతాడు.

ఈ సంపుటి నిండా సిక్కోలు పదబంధాలు, సామెతలు సొగసు చూడతరమా అనేలా పాఠకులను రంజింపజేస్తాయి. 'కోలగూడు, వలపల దాపల, ఎర్రి బాగులోడా, గోర్జి, బేపి, సేరు సితకల, ముంత, పుంజిడు, అగ్గసం, పర్రాకులు, బంగురుతూ, సిగ్గుకు సిమిడిపోయి, ఇటికీ పున్నమి, ఒద్దునపడిన మిట్టపిల్లే, తియ్యోరుగు బద్ద, నిండా ములిగినోలికి సలేటి, అచ్చేసి అప్పన్నకోడిని సేసి, అనువులనలేదు మినువులనలేదు, సిలకపిట్టలు సిందులేసినట్టే, ఆమాసకి కబురంపితే పున్నానికి వచ్చిన ఆడపిల్లలా, ఏ రాయి ఐతేటి ఏటి బుర్ర బద్దలు కొట్టడానికి, పులి బక్కిరిన తరువాత అయ్య బతుకుతాడేటి, ఓరెం మీదొచ్చి వాలతాయేటి, ఏసినప్పుడే యాపకొమ్మ తీసినప్పుడు అసిరమ్మ' లాంటివి ప్రతి వాక్యంలోనూ గోచరిస్తాయి.

ఇటీవల రాస్తున్న ఉత్తరాంధ్ర కవులలో హెచ్చు శాతం 'ప్రపంచీకరణ- ఉత్తరాంధ్ర విధ్వంసకరం' అనే అంశాన్ని ప్రధాన వస్తువుగా తీసుకొని కవన యజ్ఞం చేస్తున్నారు. ఒకే రకమైన అంశానికి అందరు కవులు ప్రాధాన్యత ఇస్తుండడంతో అన్ని కవితలు ఒకేలా కనిపిస్తున్నాయి. ఎంతసేపూ ప్రపంచీకరణ పైనే సాహిత్యం నడుస్తున్నది. ఇది తప్పితే మరో అంశం లేనట్లు ఆయా సాహితీవేత్తలు భావిస్తున్నారు. అనాదిగా ఉత్తరాంధ్రను పీడిస్తున్న సమస్యలు అనేకం ఉన్నాయి. వాటి పరిష్కార దిశగా సృజనశీలురు ప్రయత్నించాలి.

ఈ విషయంలో కొందరికి భిన్నంగా 'చింతా' సాహితీ సేద్యం చేయడం గమనార్హం. ఆచరణాత్మకమైన జీవనశైలి గల కవివరేణ్యుల వలనే సామాజిక ప్రాయోజకత్వం ఉంటుందనేది సత్యం. ఆ రకంగా చూస్తే మాస్టారు కవనం ప్రశంసనీయం. మరిఇంకేమి 'అరిసేతిలో బువ్వపువ్వ'ను ఆరగించడానికి మీరూ సిద్ధమేనా? ■



## భ్రమ బురద

**కొ**ండ నుంచి బండ దొర్లుతున్నట్లు
ఆశ వేగం ఎక్కువైంది!
దేశ పటంలో నదులనన్నింటినీ
లెక్క పెట్టుకొని జాగ్రత్తగా దాచిపెట్టండి
ఏమో ఒక అశాంతి రేతిరి
అవి కనబడకుండా పోయి
వెక్కిరించిన వచ్చు!

నదులు... పర్వతాలు...
అడవులు... గనులు ... ఏదైనా
చేపని తోమినట్లు
పొలుసులు పొలుసులుగా రాలిపోవచ్చు!

♦ ♦ ♦

బిస్కెట్లు ఇచ్చి కుక్కని లోబర్చుకునే నేర్పు
బాగా అలవాటైందిగా ...
కాళ్లు కదిపే శ్రమ నీకెందుకు..?
నెల నెల ఇంతేస్తుంటాంగా...
ఐదేళ్లకోసారి బోనస్సూ...

దొర్లే బండ కింద
ఎన్ని కన్నీళ్ళు పొర్లుతాయో
అన్న ఆలోచన నీకెందుకు...?
మీ మెదళ్లని మా కాళ్ల
కింద తివాచీలను చేసి చాలా రోజులైంది.

మాచేతులెపుడూ
ఆపన్న హస్తాలే అన్న
భ్రమ బురదలోంచి
కాళ్ళు వెలికి తీయకండి... అంతే..!

**- అవ్వారు శ్రీధర్ బాబు**
**85001 30770**

## ఫేస్‌లెస్ ..!

దేశం వెలిగిపోతోంది
ముఖాలు మాత్రం తగలబడి పోతున్నాయి
మనుషులు చిత్రవధ అనుభవిస్తున్నారు
పాలకులకు ప్రజల మోహం
మొత్తేసిందో ఏమో
పాలితులపై కసి పేట్రేగి పోతోంది
సొంత ముఖం లేని
వాళ్ళ దయనీయతే
కదా పట్టాభిషిక్తం చేసింది
ముఖాన్ని మొలిపించడానికి
ముఖాన్ని తగిలించడానికి
అవకాశం ఇవ్వలేనితనం
ఉక్కిరిబిక్కిరి చేస్తున్నది
అందుకే వాళ్ళ ముఖాల్ని చూసే వ్యామోహాల్ని
గంగలో ముంచేసింది
ముఖారవిందాల్ని పరికించాల్సిన అధినేతలు
ముఖ కదలికల్నే పాతరేస్తున్నారు
జనం ఆర్థిక ఛిద్రానికి
ఒడిగట్టే కసాయితనం
ప్రజాస్వామ్యాన్ని మంటల్లో
తగులబెట్టడం కాదా!
యంత్రాలు పల్లకిలో ఊరేగుతూ
మనుషుల్ని గద్దల్లా
పీక్కుతింటున్నాయి
మానవ కళేబరాలపై డిజిటల్
జిల్లేళ్ళు మొలుస్తున్నాయి
అపభ్రంశపు ముఖాల్ని
చూడకూడదనుకొన్నారో ఏమో
చేసిన నిర్వాకానికి 'మహాప్రభో'
అని కుమిలి కుమిలి ఏడవాలి
కొత్త కొత్తగా రాగాలు తీయాలి
అదే ఫేస్ లెస్ మూల్యాంకనం
ఏకాంత సమూహాలు
పతనం దిశగా పరుగులుపెట్టే
అష్టదిగ్బంధనం!

**- చిన్ని నారాయణరావు**

**94402 02942**



## నిస్సారం


ఈ కదిలే బొమ్మలన్నీ
పెరటి పూల మొక్కల్లా
కాలానికి స్వాగతం పలుకుతున్నాయి.
ప్రతి ఉదయం
మహ ఆశల ఆవరణలో
సుందర ఆశల పతనం సాగుతోంది
కొన్నిసార్లు ఈ సీతాకోక చిలకలన్నీ
తమని తాము మరచిపోతాయి
కాలం మహా మంత్రగత్తె!
సుడిగుండాల్ని సృష్టిస్తుంది
మనకి మనం అర్థం కాకుండా చేదుగా,
జడంగా చేస్తుంది.
తాము తిరిగే ఈ భూమ్మీద
కలలన్నీ నిజం కావాలని రూలేం లేదు
ఒక్కోసారి స్వాతంత్ర్యం కూడా
కత్తి లాగా గుచ్చుకుంటుంది!

బిడ్డా, నగరం పూర్తిగా నిస్సారమై పోయింది
చీకటిని తడమకు, కూలిపోతావ్!
భయంగా తలవాల్చకు!
శలభంలా కాలిపోతావ్!
ఏదో ఒకరోజు
ఆశ నీలోకి తొంగి చూస్తుంటుంది!

**- ఏటూరి నాగేంద్రరావు**

**74166 65323**

## పుస్తకం




# ఈ ఒక్కటీ చదివితే వంద పుస్తకాలు పరిచయం

**- రాజాబాబు కంచర్ల**
94900 99231

**'సు**కవి జీవించు ప్రజల నాల్కల యందు' అంటాడు కవికోకిల గుర్రం జాషువా. కవి లేదా రచయిత తన రచనల ద్వారా ఎల్లకాలం సజీవంగా జనావళిలో వుండగలుగుతాడు. అలాగే ప్రజాదరణ పొందిన కవులు, రచయితలు, వారి సాహిత్యం కూడా ప్రజలతో మమేకమై ఉండడం సహజం. వివిధ కాలాల్లో ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసిన పుస్తకాల సమాచారం అంతా ఒకచోట లభ్యమైతే... అది చదువరులకు పండగే. తాను చదివిన వందలాది పుస్తకాల్లోని కొన్నిటిని పుస్తక ప్రియులకు పరిచయం చేయాలన్న ఉద్దేశ్యంతో వెలువరించిన మంచి పుస్తకం ఇది. ఇందులో వాడిన భాష, విమర్శ, పరామర్శ - అత్యంత సహజంగా, ఆసక్తికరంగా వుండటం ఇందులోని ఒక ప్రత్యేకత.

ప్రముఖ రచయితల నుంచి, ప్రధాన పత్రికల నుంచి అభినందనలు పొందిన గ్రంథ విమర్శలు, పరామర్శల సంకలనం... సుమధుర పరిమళాలను వెదజల్లే పూదోటలోని కుసుమాలను సేకరించి, మాల కట్టినట్లుగా... వందకు పైగా పుస్తకాలను ఒక్కటిగా చేర్చి... అందలి సారాంశాన్ని చిలికిన వెన్నలా పఠితుల ముందుంచారు సాహిత్య కల్పవల్లి తెలకపల్లి. '100 పుస్తకాలు : పరామర్శ- విమర్శ' పేరుతో ప్రముఖ కవి, రచయిత, రాజకీయ విశ్లేషకులు, సీనియర్ పాత్రికేయులు తెలకపల్లి రవి తనదైన శైలిలో సమీక్షించారు. తన అనుభవాన్నంతా రంగరించి అందించిన ఈ గ్రంథం... పుస్తక ప్రియులకు మృష్టాన్న భోజనం. పుస్తకాభిమానులకు ఎన్ని పుస్తకాలు చదివినా ఆ దాహం తీరదు. ఇంకా ఇంకా చదవాలనే వ్యామోహం పెరుగుతూనే వుంటుంది. 'పుస్తకాలను ప్రేమించండి. అవి మీ జీవితాలను సుఖమయం చేస్తాయి. భయంకర బాధల ఉప్పెనలో ఉపశమనం కలిగిస్తాయి' అంటాడు ప్రముఖ రచయిత మాగ్జిం గోర్కీ. పుస్తకం మీద ఎంత ఆసక్తి వున్నా... ఎన్ని పుస్తకాలు చదువుతూ వున్నా... ఎప్పటికప్పుడు కొత్తకొత్త పుస్తకాలు వస్తూనే వుంటాయి. ముఖ్యంగా పుస్తక ప్రచురణ ఇటీవల సులభతరంగా మారిన నేపథ్యంలో వందలాది పుస్తకాలు మార్కెట్‌లోకి వచ్చిపడుతున్నాయి. వీటిలో ఏ పుస్తకాన్ని చదవాలి, ఎలా ఎంచుకోవాలి అన్నది ఒకింత జటిలమైన సమస్యే. ఒక్కొక్కరు ఒక్కో తరహా పుస్తకాలను ఇష్టపడుతుంటారు. వారి వారి అభిరుచిని బట్టి పుస్తకాలు చదువుతుంటారు. అదే సందర్భంలో ఇన్‌స్టెంట్ సమాచారాన్ని సైతం కోరుకుంటారు. కాలంతో పోటీ పడుతున్న నేటి స్పీడ్‌యుగంలో సమయం అమూల్యమైనదిగా మారిపోయింది. ఈ క్రమంలో చదువరులకు తమతమ ఆసక్తులను బట్టి ఏ పుస్తకంలో ఏముంది? అసలా పుస్తకం చదవడం అవసరమా? వంటి సందేహాలూ కలుగుతుంటాయి. అలాంటి వారికి రేఖామాత్రంగా వంద పుస్తకాల సమాచారాన్ని క్రోడీకరించి అందిస్తే... అది ఎంత ఉపయోగకరమో వేరే చెప్పనక్కర లేదు.

వివిధ రంగాలకు సంబంధించిన వంద పుస్తకాలపై సమీక్షలు, సునిశిత విమర్శలు, పరిచయాలు, పరామర్శలు ఈ గ్రంథంలో ఉన్నాయి. రాజకీయాలు, చరిత్ర, భాష, పురాణాలు, సిద్ధాంత సమస్యలు, సృజన సాహిత్యం, మీడియా, సినిమాలపై వచ్చిన పుస్తకాలను ఇందులో పరామర్శించారు. అయితే 'ఇవన్నీ ఒకసారిగా రాసినవి కావు. ఒకే కోణంలో రాసినవీ కాదు. అందువల్ల వీటి రచన కూర్పులో తేడాలుంటాయి. కొన్ని లోతుగా విమర్శ చేస్తే, మరికొన్ని

స్థూలమైన పరిచయాలుగా వుంటా'యని, తత్వశాస్త్ర గ్రంథాలు, చరిత్ర పుస్తకాలు వంటి వాటిని కావాలనే పరిచయం చేశానని రచయిత తన ముందుమాటలో వివరించారు. పఠితులకు ఇదొక మార్గదర్శకంగా వుంటుంది. ఈ పుస్తకం వెనుక అట్టపైన ఆరుద్ర, ఏటుకూరు బలరామమూర్తి, డాక్టర్ సినారె, చలసాని ప్రసాదరావు వంటి ప్రముఖుల వ్యాఖ్యానాలు ఇవ్వడం కూడా చదువరులను మరింత ఉత్తేజితులను చేస్తుందని చెప్పొచ్చు.

'బుద్ధుడు– అంబేద్కర్– మార్క్సిజం' గురించి రంగనాయకమ్మ రాసిన పుస్తకంపై సిద్ధాంత కోణంలో సమీక్షిస్తే... చంద్రబాబు ముఖ్యమంత్రిగా వున్న సమయంలో రాసిన 'ప్లెయిన్ స్పీకింగ్'పై గట్టి విమర్శే చేశారు. అలాగే గాంధీజీ పెద్ద కొడుకు గురించిన కథనాలకు, ఆయనకు సంబంధించిన పుస్తకంపై 'జాతిపిత పెద్ద కొడుకు' (పేజీ 49) వ్యాసంలో సమీక్ష చాలా వివరణాత్మకంగా వుంటుంది.

ఆంధ్రుల చరిత్రతో, బౌద్ధం వికాసం, పరిణామంతో పెనవేసుకుపోయిన అమరావతి పరిమళాల గుభాళింపు సత్యం శంకరమంచి అద్భుత కథల సమాహారం 'అమరావతి కథలు'. ఈ కథల్లో భక్తి, రక్తి, విరక్తి – బాధలు బంధాలు, కుటుంబాలూ, కుత్సితాలు వంటివన్నీ కలగాపులగంగా కనిపిస్తాయి. ఈ కథలు చదువుతుంటే అమరావతిలో నడుస్తూ... సూక్ష్మంలో మోక్షంలా విశ్వదర్శనం చేయిస్తాయి ఈ కథలు. అంతే అద్భుతంగా పరామర్శ రచయిత 'అమరావతి కథాహారతి' (పేజీ 84)ని సమీక్షించారు.

సి.నారాయణరెడ్డి రచించిన 'ఆధునికాంధ్ర కవిత్వము – సంప్రదాయములు –ప్రయోగములు' గ్రంథం చక్కని పరామర్శ చేశారు. 'చిక్కనైన కవిత్వం లేక, వున్న కవితా శిల్పంలో అక్షర సౌందర్యం చిక్కక తికమక పడే కవులకు, పాఠకులకు కూడా ఒకే చోట వివిధాంశాలతో కూడిన ప్రాథమిక అవగాహననిచ్చే మంచి గ్రంథం ఇది. ఈ తెలుగు కవితా పరిణామ దర్శినిని అంతే చక్కగా ఈ పుస్తకంలో అందించారు.

ప్రముఖ హిందీ కవి విష్ణు ప్రభాకర్ రచించిన అరుదైన గ్రంథం 'దేశ దిమ్మరి ప్రవక్త శరత్ బాబు'పై 'చలింపజేసే శరత్ జీవితం' (పేజీ 87) వ్యాసంలో చర్చించారు. శరత్ బాబు జీవిత ప్రస్థానంలోని మలుపులు, సాహిత్యం, వ్యక్తిగత జీవితం వంటి అనేక అంశాలను విష్ణు ప్రభాకర్ స్పృశించారు. దీనిని ప్రముఖ విమర్శకులు జ్వాలాముఖి తెలుగులోకి అనువదించారు. 650 పేజీల ఈ గ్రంథాన్ని తెలకపల్లి వారు సుబోధకంగా సమీక్షించారు.

రెండో భాగంలోని మొదటి పుస్తకం... గురజాడ వారి 'అసమ్మతి పత్రం'. 'తెలుగు భాషా జ్యోతి గురజాడ అసమ్మతి' (పేజీ 243) పేరుతో రాసిన ఈ వ్యాసంలో భాషా సమస్యను వివిధ కోణాల నుంచి ఈ పత్రంలో పరామర్శించారు. ప్రజలకు భాష నేర్పడానికి వ్యవహారిక భాష కన్నా ఉత్తమ మార్గం లేదని తన అసమ్మతి పత్రంలో ఘంటాపథంగా చెప్పిన వైనాన్ని మూడు పేజీల్లో సవివరంగా ఆవిష్కరించారు. పాఠ్య పుస్తకాల్లో కృతక భాషా సాహిత్యం బోధించడం వల్ల విద్యార్థులు ఎంత నరకయాతనకు గురవుతారో గురజాడ సానుభూతితో వివరించారు. అలాగే తాపీ ధర్మారావు 'కొత్త పాళీ', కొడవటిగంటి కుటుంబరావు రచనా ప్రపంచం, చలం 'మైదానంలో లేని లోతులు చూడనేల?' వంటి పుస్తకాలపై సవివరమైన పరామర్శ ఈ గ్రంథంలో అందించారు.

1958లో వచ్చిన 'కాలాతీత వ్యక్తులు' నవల... ఆ సమయంలో ఒక సంచలనం. ఈ నవలలోని ఇందిర పాత్రను రచయిత్రి డాక్టర్ పి.శ్రీదేవి శక్తివంతంగా తీర్చిదిద్దారు. ఈ నవలపైన ఈ నవలలోని ఇందిర, కళ్యాణి పాత్రల విశిష్టతపైన అనేక సమీక్షలు వచ్చాయి. నాటి సంప్రదాయ సమాజంలోని నూతన కదలికలను, అమ్మాయిల చదువుతో పాటు పెరుగుతున్న నాగరికతను, వివాహాది విషయాల్లో స్వతంత్రతను ఈ పుస్తకంలో రచయిత సవివరంగా రాస్తారు. అంతే సవివరంగా ఈ పుస్తకాన్ని సమీక్షించారు తెలకపల్లి రవి. కొన్ని సమీక్షల్లో ఇందిర పాత్రను ఆకాశానికెత్తినట్లు కనిపిస్తోందని కూడా పరామర్శిస్తారు.

కోడూరి శ్రీరామమూర్తి రచించిన 'తెలుగు నవలా సాహిత్యంలో మనో విశ్లేషణ' గ్రంథంలో మనో వైజ్ఞానిక శాస్త్రంలో వేర్వేరు సిద్ధాంతాలను, నవలా రచనపై వాటి ప్రభావాన్ని సవివరంగా ఈ గ్రంథంలో ఆయన పరిశీలించారు. దీనిపై ఈ పుస్తకంలో విశ్లేషించిన తీరు కూడా ఆసక్తికరంగానే ఉంది. ముఖ్యంగా 'మనోవిజ్ఞాన పరిశీలనలో మనిషిని, మనసును విడదీసి చూడటం ఒక లోపం. మనిషి స్వభావం బాల్యంలో పడే ప్రభావాల వల్ల రూపొందుతుందనేది అసత్యం కాకపోయినా అనేక విషయాలు దాన్ని ప్రభావితం చేస్తాయి. మిగిలిన అన్ని అంశాల్లాగే మనస్తత్వం కూడా మార్పులకు గురవుతూనే వుంటుంది' అంటారు తెలకపల్లి తన పరామర్శలో. 'మానవ మనస్తత్వాల లోతులు చూపడంలోనూ ఎందరో రచయితలు మహత్తర ప్రతిభ చూపారు. ఈ రచనలు, కళలు కూడా ఎంతోకొంత మేరకు మనుషులపై ప్రభావం చూపుతుంటాయి. అలాటి అనేక రచనలను ఒక్కచోటనే పాఠకుడికి పరిచయం చేశారు కోడూరి.' అలాంటి పుస్తకాన్ని ఈ పరామర్శలో పరిచయం చేయడం పాఠకులకు మంచి అనుభూతినిస్తుంది.

'అంపశయ్య నవీన్' నవల 'బాంధవ్యాలు' పాతికేళ్ల పరిణామ చిత్రణ. తెలుగు లోగిళ్లలోని మధ్య తరగతి కుటుంబాల జీవిత పరిణామాన్ని ఈ నవలలో చిత్రించారు. 1969 ప్రత్యేక తెలంగాణ నుంచి 1993 వరకు గడిచిన కాలానికి ఈ నవల విహంగ వీక్షణం. ఫ్యూడల్ అవశేషాలు వదలని మన సమాజ రుగ్మతలను, వినియోగ సంస్కృతి సగటు మనుషులను శాసిస్తున్న తీరు, ఫ్యూడల్ భావాలనుంచి బయటపడని స్త్రీ పాత్రల చిత్రణ ఈ నవలలో కనిపిస్తాయి. ఈ నవలా రచయిత నవీన్ శైలిని ప్రశంసిస్తూనే స్త్రీ పాత్రల చిత్రణలోని లోపాన్ని కూడా ఎత్తిచూపారు రచయిత. అలాగే నవీన్ మరిన్ని మంచి రచనలు చేయాలని కూడా ఆకాంక్షించారు.

ప్రముఖ స్త్రీవాద రచయిత్రి ఓల్గా రచన... 'కదిలించకు మౌనమృదంగాలను'. 27 వ్యాసాలు, 300 పైగా పేజీలున్న ఈ పుస్తకంలో రచయిత్రి చేసిన కొన్ని ప్రసంగ పాఠాలు, సమీక్షలను కూడా పొందుపరిచారు. అలాగే రచనల ద్వారా స్త్రీవాదాన్ని, వర్గ దృక్పథాన్ని పోటీగా పెట్టి రాసిన రచనలను.... ఈ పరామర్శలో చర్చించారు. గురజాడ రచనల ఔన్నత్యం, చలం, కొడవటిగంటి సాహిత్యాల గురించిన పరామర్శ ఎక్కువగా ఓల్గా పుస్తకంలో కనపిస్తుందంటారు. ఈ పుస్తకంలోని కొన్ని వ్యాసాల్లో రచయిత్రి భావ పరిణామ క్రమం, సామాజికంగా ఆమెపై పడిన ప్రభావం కూడా గుర్తించాల్సిన అంశంగా తెలకపల్లి ఈ పుస్తకంలో చెబుతారు.

'అగ్ని తరంగం' కందుకూరి వీరేశలింగం విరాట్ స్వరూపాన్ని రేఖామాత్రంగా స్పృశించిన వ్యాసం ఇది. వీరేశలింగం జీవితానుభవాలు నేటి పరిస్థితుల్లో మరింత ప్రాధాన్యత సంతరించుకున్న వాస్తవాన్ని ఈ వ్యాసంలో పొందుపరిచారు. అలాగే మహాకవి శ్రీశ్రీ ఆత్మకథ... 'అనంతం' అనేక పాఠాలు, గుణపాఠాలు అందిస్తుందని, కవులు, రచయితలకు ఎన్నో విషయాలు నేర్పిస్తుందని తన పరామర్శలో తెలకపల్లి అంటారు. అలాగే... 'చైనా విప్లవ సేనాని చూటే జైత్రయాత్ర', ఇఎంఎస్ నంబూద్రిపాద్ రచన 'ఓ కమ్యూనిస్టు జ్ఞాపకాలు', 'మూడు దశాబ్దాల నక్సల్బరీ, గమ్యం గమనం'లోని చారిత్రక, సైద్ధాంతిక దృష్టి లేని పాక్షిక విశ్లేషణలను విమర్శనాత్మకంగా విశ్లేషించారు.

అరుణ్ సాగర్ రాసిన 'మేల్ కొలుపు'పై ఒకింత ఘాటైన విమర్శే చేశారు. అది సరైనదే కూడా. పరస్పర విరుద్ధమైన ఈ భావ సందిగ్ధతే సాగర్ లాంటి వాళ్ల గందరగోళానికి కారణమని సూటిగా చెప్పారు. మేల్ కొలుపులో సాగర్ వాదనలలో చాలావాటికి శాస్త్రీయమైన పద్ధతిలో జవాబులిచ్చారు. పురుషుల తరఫున వకల్తా పుచ్చుకొని... ఆడవాళ్ల అలంకారాలు, 'వగలు' గురించిన సాగర్ ప్రస్తావనలను సూటిగా ఖండించారు ఈ 'పరామర్శ- విమర్శ'లోని 'మహా పురుష పైత్యం!' (పేజీ 381) వ్యాసంలో. 'నారీ జన బాహుళ్యంలో 0.0001 శాతం కూడా లేని పాశ్చాత్య సుఖవాద ఫెమినిస్టులను మనసులో పెట్టుకొని నెరజాణలు, వగల మారులు వంటి భాషలో మహిళలను ఆడిపోసుకోవడం ఈ 21వ శతాబ్దంలో దుర్భరమైన విషయం' అంటూ మహిళల పట్ల ఈ తరహా విమర్శలు చేసేవారికి అర్థమయ్యేలా సూటైన విమర్శ చేశారు తెలకపల్లి.

తమ తల్లిదండ్రులకు అంకితమిచ్చిన 384 పేజీల ఈ పుస్తకంలో 103 పుస్తకాలపై రాసిన వ్యాసాలున్నాయి. 2012లో- అంటే దాదాపు పదేళ్ల క్రితం ప్రచురించినది. ఇందులోని వ్యాసాలన్నీ ఆయా సందర్భాలలో రాసినవే. ఈ రచనలకు అంతే స్థాయిలో స్పందనలు కూడా వచ్చాయి. విషయ ప్రధానంగా రెండు భాగాలుగా అందించారు. ఇవి మేధావుల కోసం కాదు... సామాన్య పాఠకులను దృష్టిలో వుంచుకుని రాసిన వ్యాసాలని రచయిత ఈ పుస్తకం ముందుమాటలో చెప్పారు. ఈ పుస్తకం చదివిన వారికి 'వంద పుస్తకాలు' చదివిన అనుభూతి మాత్రం కచ్చితంగా మిగులుతుంది. ఏ పుస్తకాలు చదవాలి, ఎలాంటి పుస్తకాలు చదవాలి అనుకునేవారికి ఈ పుస్తకం ఒక కరదీపికగా ఉంటుందని చెప్పొచ్చు. ■

## విమలాశాంతి పురస్కారానికి

## కథా సంపుటాలకు ఆహ్వానం

'విమలా స్మారక' విమలాశాంతి సాహిత్య కథాపురస్కారం- 2022ను ఈ సంవత్సరం మహిళలకు ఇవ్వాలనుకున్నాం. మహిళా రచయితల (కథయిత్రుల) నుంచి జాతీయ స్థాయిలో కథా సంపుటాలను ఆహ్వానిస్తున్నాం. రచయిత్రులు 01-07-2017 - 30-6-2022 మధ్యకాలంలో ప్రచురించిన తమ కథాసంపుటాలను 4 కాపీల చొప్పున 15-8-2022 తేదీ లోపల పంపాలని కోరుతున్నాం. మా చిరునామా : శాంతినారాయణ, 202, ఎస్.ఎస్.అపార్ట్మెంట్, మారుతీ నగర్, అనంతపురం. సెల్ నం : 80749 74547.

## కదలాల్సిన సమయం

వాడిప్పుడు బహుముఖాలుగా విస్తరించినవాడు
అమీబాలా నిరాకారంగా రూపాన్ని
ఎప్పటికప్పుడు మారుస్తున్నవాడు
మతోన్మాద కాలకూట విషాన్ని
దేహం నిండా నింపుకుని
దేశాన్ని పాలిస్తున్న వాడు
అన్నం మెతుకులతో
మనిషికి ఊపిరిపోస్తున్న అన్నదాతల్ని
దుర్నీతి చట్టాలతో హత్య చేసి
పీనుగులపై దారులు నిర్మించుకుని
కార్పొరేటు సామ్రాజ్యాన్ని నిర్మిస్తున్న వాడు
శాస్త్రం కంటే ఛాదస్తం గొప్పదని చెప్పి
నోళ్ళు మూయించి మాట్లాడనీకుండా
స్వేచ్ఛను హరించినవాడు
ప్రశ్నించక పోరాడక
గొంతెత్తి అరవక
ఉద్యమ నినాదమసలే చేయనీక
ఆలోచనల్నే కబ్జా చేసిన వాడు
కాషాయధర్మం పేరుతో
కసాయిగా రూపాంతరం చెంది
మనుషుల మధ్య దూరాలు పెంచి
దేశాన్ని నిప్పుల కొలిమిగా మార్చినవాడు
లౌకికత్వం డిక్షనరీ నుంచి
వెలివేయబడ్డ తొలి పదం
పచ్చటి సమాజంపై కులాల కంపును వెదజల్లి
వికటాట్టహాసం చేస్తున్న వాడు
మట్టిపై మమకారం లేని మనువాది వాడు
హిట్లర్, ముసోలిని మించిన నియంత వాడు
దేశాన్ని అంధకారంలో నెట్టేసిన
అంధయుగపు ప్రవక్త వాడు
వెలుగులను చెయ్యొడ్డి కాపాడుకోవాల్సిన
సమయం ఇది!
రా .. మిత్రమా, రా!
కలిసి నడుద్దాం.. కలిసి గొంతెత్తుదాం!

**- కెంగార మోహన్**
**9493375447**

## జీవితం : ముందుకూ వెనక్కూ...

**- అనూరాధ**

వెనక్కు మరలి దు:ఖాన్ని గంపలకెత్తుకునే బదులు
ముందుకెళ్లి మునికాళ్ళపై నిలబడి
సంతోషాన్ని పిలవాలి
లక్ష్యమంటూ ఒకటున్నప్పుడు
కాలికి మట్టి అంటుకుందని నిందలెందుకూ?

ఖాళీ కాగితాలు నిన్ను చూసి వెక్కిరించొచ్చు
మూలనపడి ఉన్న కలం నవ్వవొచ్చు..
సిరాబుడ్డి ఇంకనూ వచ్చు
అందుకని ఏదో ఒకటి రాసి జీవితం అనవచ్చా?

గోడలు పెచ్చుల్ని విదిలిస్తాయ్
రంగుల అవశేషాలు ఆనవాళ్ళను గుర్తుచేస్తాయ్
శిధిల సంపదని హత్తుకుని చూస్తే
కాలం మరకల్లో నగ్నసత్యాలు
పాదముద్రలుగా మస్తిష్కానికి నడిచొస్తాయ్!

రాలిపడిన ఆకుల్లో నిర్జీవత్వాన్నే చూస్తే
ప్రతి కన్నీటిబొట్టులో
ఇప్పటికి ఎన్నిసార్లు మరణించిఉంటారో!
ప్రేమని పసు వరసకి తెచ్చి నవ్వి చూస్తే
లోకం గుట్టంతా, ముఖంలో
తైలవర్ణచిత్రంలా వేళ్లాడుతుంది!

ప్రతిబింబాలన్నీ ఒక్కలా అనిపించినా
చూస్తున్న ప్రతిసారీ ఒక్కో ప్రతిబింబం
ఒక్కో కొత్త భావోద్వేగాన్ని మోస్తున్నట్లుంటుంది

కొంత జరిగాక, మృదయం ముక్కలైన సంగతి
ఎప్పటి కాలమానంలోదో అనిపించినప్పుడు
పెదాల చివర్లు ఈల వేసినంత హుషారుగా
అల్లరి నవ్వుని చిందిస్తాయ్!
కనుకొసర్లు, కాలపు చిక్కుముడులను
విప్పిన గర్వంతో మెరుస్తాయ్!

జీవితం ఇదీ ఇలా అనే లెక్కలొక్కోసారి
భ్రమలో పాత్రల్లా మిగిలిపోతాయ్!
జీవించెయ్యాలి ఏది ఏమైనా సరే..
ఎడారుల్లో, కర్జూరపు చెట్ల నీడల్లో సేదతీరైనా సరే! ■

కవిత

# గోదావరి విళయ కేళి!



బిరబిరా కృష్ణమ్మ పరుగులిడుతుంటేను
గలగలా గోదారి కదలి వస్తుంటేనంటూ
పార్థనా గీతం విన్న గోదారి
పరుగులు లేవన్నందుకు కోపించింది
పరుగెత్తి పరుగెత్తి
పది మండలాల్ని ముంచేసింది!

పరుగుకు భయపడ్డ ప్రజావళి
తీసిన తలుపులు తీసినట్లే పరుగులు
పశువుల పొలుపులు విప్పకనే
కోళ్ళగంపలు ఎత్తకనే పరుగులు
నరకాలకు నకళ్ళైన పునరావాసాల్లోకి
ఉగ్గబట్టిన ప్రాణాల్తో ఉరుకులు!

మంత్రించిన సముద్రం చేతిలో
ఉగ్ర గోదారి వామన రూపమెత్తాక
మొహంజోధారో హరప్పా నమూనాల
సొంత గూళ్ళకు జనం పరుగులు
మాటిమాటికి చంకలో బిడ్డ
తల్లిపాలకు పైటను లాగుతుంటే
అన్న పానీయాల్లేని అమ్మ
పాలెండిన రొమ్మును చూసి
కన్నీరు కారుస్తుంది!

పలుపు తెగిన పశువులు
గంపకింద కోళ్ళు
వరదకు ఆహారమయ్యాయి
అ ఆలు దిద్దే వయసువాడికి
ఆంగ్ల చదువెందుకని
సరస్వతి పుస్తకాల్ని నీటికి అందించింది

- అడిగోపుల వెంకటరత్నమ్
98482 52946

రోకలి చేట పొరక సమస్తం
ఆక్రమించిన నీటి హస్తగతమయ్యాయి
మూరెత్తు ఇసుక మేటకప్పుకున్న రోలు
నన్నెవరూ గుర్తించలేరంటూ సవాలైంది
అమ్మపైటను లాగి లాగి బిడ్డ
అలసి చంకలో నిద్రించాడు
ఉదయాలు లేని రాత్రుళ్ళలో
ఆకలి లేని శరీరాలు
మెలకువల్లేని నిద్రలు నిద్రించాలని
బిడ్డతో తల్లి కునుకులోకి జారింది!

పిడికెడు మెతుకులు
రాల్చేదెవరు
గుక్కెడు దాహం
పోసేదెవరు
సాయం చెయ్యని చేతులకిప్పుడు
అగ్ని స్నానం చేయించాలి!

■

## సమీక్ష




# మన్ను భాషలో మొలకెత్తిన కవిత్వం

- శ్రీరామ్

99634 82597

శైలజ గారి లాంటి వైద్యులు కవిత్వం రాయడం కొత్తేమీ కాదు. గతంలో చాలామంది ఆ పని చేశారు. ఆ మాట కొస్తే వైద్యమే కాదు, ఏ వృత్తిలోనివారైనా కవిత్వం రాసినపుడు అందులో ఆ వృత్తి ప్రతిఫలిస్తున్నదా లేదా అని ఒక వ్యర్థ పరిశీలన చేయాలనిపిస్తుంది. ఏం? ఎందుకని అంటే? ఆయా వృత్తి తాలూకూ కొత్తదనమేదన్నా ఆ కవిత్వానికి వెలుగు తెస్తున్నదా అన్న ఆతృత వలన. మరీ ముఖ్యంగా ఆ కవుల పని విశేషం వాళ్ళ కవిత్వ వస్తువు మీద చూపెట్టే ప్రభావం ఎంతటి లోతుల నుండీ తన్నుకొస్తుందా? అని కూడా. అయితే కవిత్వంలోని లోతునెలా కొలవగలం? దానికేం పరికరం ఉంటుందీ? శైలజ గారి కవిత్వంలోని *డాక్టరు గిరీ ఆపరేషన్ థియేటర్, ఆసుపత్రిలో జైలూ, దగ్ధ పరిమళం, చివరాఖరికి* లాంటి కవితల్ని ప్రాణవంతం చేయడం పాఠకుణ్ణి కట్టి పడేస్తుంది. అది ఆమె వృత్తి గొప్పతనం కాదు. వృత్తిపరమైన జీవితంలోంచి కూడా సజీవంగా ధ్వనించగలిగిన ఆమె చైతన్యానిది. ఆమె దాన్ని ఎలా పరిరక్షించుకుందీ, పలికించిందీ వేరొక విషయం. ముందుగా ఆమె కవిత్వ ప్రాతిపదిక అనుభవ తలానిది కావడం *కొంగలు గూటికి చేరేవేళ* అన్న ఆమె తాజా పుస్తకానికి ముఖ్యమైన వన్నె. శాస్త్రీయవాదులు ఈరకంగా ఉండటం చిన్న విషయం కాదు. అందునా శైలజ గారిలాంటి బుద్ధి జీవులు కవిత్వంలోకి తమ తెలివితేటల్ని జప్పించారా లేక హృదయ స్పందనల్నా అన్న వెతుకులాట తేల్చగలిగిందేమీ కాదు, లేదు గానీ ఆమె కవితల్లోని చైతన్యం పురోగమన శీలత నుండి కన్ను తెరవడం ఆనందాన్నిస్తుంది. లేకపోతే బర్న్ వార్డులో స్త్రీ అంతరంగాన్ని, కాన్పు బల్లపై తొమ్మిది నెల్ల ఎదురు చూపుని, జైలు నుంచి వొచ్చిన ఖైదీ రోగుల్ని, (వ్యథార్థ గాధలుగా) ఇంకొకరైతే కవితల్లోకి తేవడం అసాధ్యం. శైలజ వీటన్నింటినీ సమర్థవంతంగా కవిత్వపరం చేయడంలో వస్తువును విశేషమైన నిర్దిష్ట పరిధిలో ఉంచిన ప్రయత్నముంది. అందుకు ఈమె తీసుకున్న స్వేచ్ఛని కూడా ప్రశంసించాలి. వ్యవస్థని, అందులోని లోపాలను, మంచి చెడులను నవ్వులపాలు కాకుండా బయట పెట్టడం కష్టసాధ్యమైన పని. శైలజ వ్యథార్థ గాధలు విభాగం అందుకు మంచి ఉదాహరణ. అయితే ఈ గుణం తత్తిమా కవిత్వం మొత్తానికీ వర్తించదు. ఎందువల్ల?

'నా చుట్టూ' అని చేసిన విభాగం ఊదా పూలు లాంటివి విభాగ శీర్షికలతో నిర్నిమిత్తంగా గమనిస్తే శైలజలోని సంప్రదాయ పునాదులు తెలిసివస్తాయి. ఆమె కవిత్వ లక్ష్యం పట్ల కూడా మనకొక అవగాహన వస్తుంది. శైలజలోని సామాజిక కోణం ఎదుర్కొన్న అనేక పరిమితులు అర్థమవుతాయి. సంప్రదాయ అనగానే భావ కవిత్వమ్మాత్రమనే ఛాయలనుకునే రోజుల్లో లేము. ఆ మాటకొస్తే కృష్ణశాస్త్రిని, తిలక్‌నీ ఈ కవయిత్రి చాలా అభిమానిస్తారు. గాంధీ పట్ల ఎనలేని ఆపేక్ష ఉంది. ఆయనపై 'నవతరానికి రోల్ మోడల్ గాంధీజీ' అన్న పుస్తకం కూడా రాశారు. ఇంకా ఆమెలోని ప్రకృతి ప్రేమ, దైవ చింతన, లోతైన తత్వ వివేచన లాంటి లక్షణాలు ఆమె కవిత్వ సారాన్ని ఇట్టే గ్రహించడానికి ఉపయోగపడతాయి. అవధానుల మణిబాబు ఈ పుస్తక ప్రస్తావనలోనే 'తొలి పుస్తకాల్లో సాధారణంగా వస్తువు, శిల్పం,

అభివ్యక్తి వీటన్నింటా మన బహుముఖీనతను తెలియజెప్పే ప్రయత్నం చేస్తాం. లేకపోతే సాహిత్య సమాజం ఇతడు ఫలానా కవిత్వం మాత్రమే వ్రాస్తాడూ అనే ముద్ర పడే ప్రమాదం ఉంటుంది' అంటారు. (ఆంధ్రప్రభ, 02.05.22) శైలజలో ముద్ర వేసేంత ఏకోన్ముఖ భావజాలమూ లేదు. వేయకుండా వదిలేసేంత సార్వజనీన ఉదాత్తత కూడా లేదు. ఒకటి మాత్రం నిజమనిపిస్తుంది. అది ఆమెలోని నిజాయితీ. ఏ ఆలోచనని అక్షరంలోకి తీసుకొచ్చినా అందులో ముసుగు వేయనితనం ఒకటుంది. అందుకు మనమామె కవిత్వాన్ని ఇష్టంగా చదవొచ్చు.

ప్రధానంగా ఆమె తట్టినంతనే జల జల మని కన్నీరయ్యే తల్లి గుండె గల కవయిత్రి. రోడ్డు దుర్ఘటనలో ఎదిగిన కొడుకును పోగొట్టుకున్న తల్లి.. 'మాయమైన నువ్వు – మాయలాంటి మనం', 'అప్పట్లో ఒకడుండేవాడు' లాంటి కవితలు రాస్తే మనమేమయిపోతాం? జన్మలే నిజమైతే నిన్ను మరింత ప్రేమిస్తాను (పేజీ 36) అన్నప్పుడు 'ముందు' గుండె చిక్కబడుతుంది. ఆ తరువాత తేలికపడ్డానికి మెదడు సహాయం తీసుకోవలసి వస్తుంది. ఎందుకంటే శైలజ 'ఎంత చీకటి రాత్రినైనా నక్షత్రాల రజనుతో' వెలిగించగల శక్తి గల కవయిత్రి. జీవితంలో పెనవేసుకోలేని అనుబంధాల పేదరికాన్ని, వెన్నెల భోజనాల్లోని వెలుగు నీడల సయ్యాటల్ని, ఆమె చిత్రించిన వైనానికి ఆశ్చర్యపోతాం. 'ఓటమిలోంచి వికసించే రహస్యం పట్టుబడింది. విషాదం కన్నా జీవితం తీయనిది (పేజి 104) అన్నప్పుడు సమాధానపడతాం. ఒక కవి అంతరంగంలో వృత్తిపరమైన అనుభవాల వ్యక్తీకరణల్లోంచి దాచలేని పునర్విమర్శని, వ్యక్తిగతమైన పెనుగులాటల్లోంచి నలిగి పెల్లుబికే జీవన సారాంసాల్నీ ఒకే సమయంలో పాఠకుడు తాకి తట్టుకోవడం సులువు కాదు. చదువరుల్లో శైలజ ఈ రకమైన ఉద్వేగాల్ని కలిగించడంలో విజయం సాధించారు.

శైలజకి మార్గదర్శి కరుణామూర్తి. కవిత్వంలో బౌద్ధ ప్రభావం కనిపించకపోయినా, నేపథ్యాలు ఎక్కువగా కరుణ రసాన్వితమైన స్పందనలుంటాయి. కవితల నిండా అంతర్నేత్రం వెలుగు సోకే ప్రదేశాలెక్కువ. దివ్యాంగుల గురించి రాసిన దివ్యలోకం, వృద్ధుల గురించిన వృద్ధాప్యం, వాయులీనం, గూర్ఖా గురించిన అజ్ఞాతవీరుడు, రచ్చబండ, సరిహద్దు రేఖ లాంటి కవితలు వస్తు పరంగా కొత్త కోణాల్ని చూపెడతాయి. శైలజ ఎక్కువ జ్ఞానవంతురాలు. ఆమె జ్ఞాన ఛాయలు కవిత్వంలోకి చాలా సందర్భాల్లో చొచ్చుకుని వచ్చే ప్రయత్నం చేస్తాయి. రోజూ తన చుట్టూ జరుగుతున్న సంఘర్షణలకి శైలజ ధైర్యంగా ఎదురుతిరిగే లక్షణాన్ని చూపెడుతుంది. రాజీ ప్రదర్శించదు. మృదువుగా ఉంటూనే శిల్పాన్ని నిర్ణయాత్మకం చేస్తుంది. ఇక్కడ కొన్ని మినహాయింపులు చేయాలంటే.. వ్యథార్థ గాథలు అన్న విభాగంలో ఉన్నంత సూటిదనం, నిక్కచ్చి మిగతా విభాగాల్లో ఉండదు. ఆసుపత్రి అనే ఒకే వాతావరణంలో కవయిత్రి చూపెట్టిన గొప్ప వైవిధ్యం మిగతా కవిత్వ వైశాల్యంలో లేదు. కళాత్మక వ్యూహం లేనట్టున్నా ఈ కవితల నిర్మాణంలో ఒక అందముంటుంది. ధార ఉంటుంది. భావానికీ, భాషకీ మధ్య అక్కడక్కడా పొసగనితనం శైలికి కావల్సిన సరళతని కూడా సూచిస్తుంది. మొదటి సంపుటికుండే సౌందర్యం ముందు అసలు కవితల్ని నాలుగు విభాగాలుగా విభజించడం వలన జరగని మేలు ఏరకంగానూ అవరోధం కాలేదు.

'రాగం ప్రాచీనమే, భావం పురాతనమే. ఆలపించే గళాలు కొత్తవవుతాయి' అని చెప్పే ఈ కవయిత్రి ప్రతి కవితా వాక్యంలోనూ సహజత్వంతో కూడిన నవీన భావనల సముదాయముంటుంది. ప్రతి క్షణమూ ఇంద్రియాలకు కొత్త అనుభూతినిచ్చే అవకాశం చాలా ఎక్కువిస్తుంది. ప్రతీ కవికీ మొదటి పుస్తకంలో ఎలా రాశామన్న స్పృహ ఎక్కువుంటుందా? ఏం రాశామన్న ఎరుకనా? ఏది ఏమయినా శైలజ గారు కవిత్వాన్ని చాలా సీరియస్ వ్యవహారంగానే భావిస్తున్నారన్న సాంస్కృతిక సందర్భాన్ని ఈ 'కొంగలు గూటికి చేరే వేళ' కవిత్వ సంపుటి తెలియజేస్తోందని మాత్రం రూఢిగా చెప్పదలుచుకున్నాను. (పుస్తకం కోసం అనల్పను సంప్రదించండి.. ఫోను 7093800303. ధర రూ.150) ■

## ప్రశ్నించడమంటే...

ప్రశ్నించడం నేరమైనపుడు
దేశమొక జీర్ణ దేవాలయం
జిల్లేడు మొక్కలు
మర్రివృక్షాలై పూజలందుకుంటాయి
ధూపం, దీపం
చెట్టెక్కి ఉల్లూకగానం అందుకుంటాయి
మంత్రాలు, ప్రార్థనలు
సెక్షన్ 215లుగా మారి
పూజారులనే చెరశాలలో
మౌనరాగాన్ని ఆలపించమంటాయి
ప్రశ్నించడమంటే ...
ప్రజాస్వామ్యాన్ని
పూజించడమే...!

**- ఆర్‌బికె చౌదరి**

**9440143488**



# ఎర్రెర్రని అడవి పూలు

మూలం : మార్లిన్ బక్ : వైల్డ్ పోప్పీస్
తెలుగు అనుసృజన : డాక్టర్ యస్.జతిన్ కుమార్
98498 06281

**నా**కు గుర్తు వున్నాయి, ఆ ఎర్రెర్రని పూల వనాలు
మా బడి వెనుక గుబురుగా అడవిలా పెరిగిన ఎర్రపూల మొక్కలు
నేను అక్కడ ఉండటానికి ఇష్టపడలేదు
కానీ ఈ పూలు చూడటమంటే బోలెడు ఇష్టం!
నేను నా గది కిటికీదగ్గర కూర్చుని బొగ్గుతో చెట్ల బొమ్మలు గీసేదానిని.
ఆ పెద్ద మాగ్నోలియా వృక్షాలు, ఆ చిన్నారి బాలిక ఏమయ్యారు?
నేను కాలేజీకి వెళ్ళాను, మా నాన్న ఉరుముల తుపాను నుంచి బయటపడ్డాను
బర్కలీ యూనివర్సిటీ, తిరుగుబాటు, ఉప్పొంగే ఉల్లాసం!
వియత్నాం యుద్ధం, నల్ల జాతి శక్తి, చే గువేర
నన్ను చికాగో లాక్కువెళ్ళాయి
అక్కడ వెలిగిపోతున్న అర్ధరాత్రులు
వాకర్ వీధి, దక్షిణం, ఉత్తరం.. నగరమంతా చెడ తిరగటం
స్వేచ్ఛా కుడ్యం ఫొటోలు తీయడం స్వీయ నిశ్చయం చేత చెంపదెబ్బలు ...
పర్వతాల్లో ఉదయం మూడు గంటలకు డ్రైవింగ్ చేస్తూ,
కాలిఫోర్నియాకు తిరుగు ప్రయాణం..
ఇదంతా ఎవ్వరినీ అడగకుండానే, ఎవ్వరి అనుమతీ పొందకుండానే
నాకు అర్థమైంది: స్వయం నిర్ణయాధికారం అంటే
ఒక శ్వేత జాతి యువతి ఎంతో కష్టపడి నేర్చుకున్న పాఠం
నేను వొదిగి పోయాను
ఆచరించటం మహా క్లిష్టం
కలలో కనిపించే వజ్రాలను సాధించటం కంటే కఠినమైనది
శాన్ ఫ్రాన్సిస్కో, ఫుల్టన్ మార్కెట్ భవనాల ముందు మెట్లపై
గంజాయి దమ్ముకొట్టడం
బ్లాక్ పాంథర్స్‌తో 'బిట్టర్ డాగ్' తాగడం
శ్వేత హిప్పీ రాడికల్స్‌తో .. విప్లవం ఎప్పుడొస్తుందా అని
మాటల కలలలో తేలిపోవడం...
విప్లవం రాలేదు.
ఫ్రెడ్ బెన్నెట్‌లి కనిపించకుండా పోయాడు
తర్వాత దొరికాడు ఇంత బూడిద, ఎముకలు, ఒక కల్యాణపు ఉంగరంలా
ఆ తరువాత అస్సాటా షకుర్ స్వేచ్ఛా చిరునవ్వులతో పుట్టుకొచ్చింది
అప్పుడు నన్నుపట్టుకున్నారు, మురుగు నీటి కొట్టులో బంధించారు
ఉత్సాహంపై నీళ్ళు జల్లినట్లయింది
అయినా బతికి వున్నాను, కొనసాగుతున్నాను
మొండి మొక్కలా చుట్టూ అల్లుకున్నందుకు
ఎంత ఆనందంగా వుందో!
జీవితంలో నుంచి పుట్టుకొచ్చిన
ఆ ఎర్రని అడవి పూల సౌందర్యంలా! ■

**మార్లిన్ బక్ (1947-2010)** యుఎస్ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా, బ్లాక్ పాంథర్స్‌కి, బ్లాక్ లిబరేషన్ ఆర్మీకి మద్దతుగా రాజకీయ ప్రేరేపిత చర్యలకు పాల్పడినందుకు 25 ఏళ్లకు పైగా జైల్లో బంధించబడింది. ఆమె జైలు వాస్తవికతను అర్థం చేసుకుంటూ, యుఎస్ సృష్టించిన శ్వేతజాతీయుల ఆధిపత్యానికి అన్యాయానికి వ్యతిరేకంగా, శ్వేతజాతి మహిళగా తన పోరాటాన్ని కొనసాగించడంలో ఒక భాగంగా, కటకటాల వెనుక నుంచి రాసిన కవితల ద్వారా తన భావాలు పరివ్యాప్తం చేసింది. జులై 2010లో పెరోల్ పై బయటకు వచ్చిన ఆమె, 2010 ఆగస్టు 3న బ్రూక్లిన్‌లోని ఇంటిలో, విడుదలైన 20 రోజుల తరువాత క్యాన్సర్‌తో మరణించింది.

**ఫ్రెడ్ బెన్నెట్ :** బ్లాక్ పాంథర్ పార్టీ కెప్టెన్. ఫీల్డ్ ఆర్గనైజర్. రాజ్యం డేగ కళ్ళతో వేటాడింది. 1971 ఏప్రిల్‌లో కాలిఫోర్నియా శాంతా క్రాజ్ పర్వతాల దగ్గర పోలీసుల చేతిలో హత్యకు గురయ్యాడు.

**అస్సాటా షకుర్ :** బ్లాక్ లిబరేషన్ ఆర్మీ సభ్యురాలు. 1970ల నుంచి నల్ల జాతి హక్కులకోసం దీక్షగా పోరాడిన వనిత. పోలీసు అధికారిని హత్యచేసిందని 1979లో యావజ్జీవ జైలు శిక్ష విధించారు. జైలునుంచి తప్పించుకుని ఆవిడ క్యూబా చేరుకుంది. ఇప్పటికీ అమెరికాలో ఆమె తలపై 20 అఒల డాలర్ల రివార్డు ఉంది.



# సాహిత్య సృజన నిదానంగా జరగాల్సిన ప్రక్రియ

ప్రముఖ కవి, నానీల సృష్టికర్త

ఆచార్య ఎన్.గోపి

**సాహిత్య సృజన అనేది నిదానంగా జరగాల్సిన ప్రక్రియ అని ప్రముఖ రచయిత, సాహితీ విమర్శకులు ఆచార్య ఎన్.గోపి అన్నారు. మానవీయ విలువలను అరచేతులడ్డంపెట్టి కాపాడగలిగేది ఒక్క కవిత్వం మాత్రమేనని ఆయన పేర్కొన్నారు. రచయిత డాక్టర్ టేకుమళ్ల వెంకటప్పయ్య 'సాహితీ ప్రస్థానం' పత్రిక తరఫున ఎన్ గోపితో ముచ్చటించారు. ఆ ముఖాముఖి ఇదీ ... :**

**మొదట మీ బాల్యం గురించి చెప్పండి? ఇంజినీరు అవుదామనుకుని, తెలుగు ఆచార్యునిగా అయ్యారని విన్నాను. తెలుగు భాషలోనికి రావడం ఎలా జరిగింది?**

నేను అప్పటి నల్లగొండ జిల్లాలోని భువనగిరిలో 1950లో, ఒక దిగువ మధ్య తరగతి చేనేత కుటుంబంలో జన్మించాను. రికార్డులలో మాత్రం 1948గా నమోదయింది. శ్రీమతి లక్ష్మమ్మ – నక్క చెన్నయ్య మా తల్లిదండ్రులు. వారిద్దరూ నిరక్షరాస్యులైనప్పటికి నన్ను బాగా చదివించారు. బాల్యం నుండి హయ్యర్ సెకండరీ వరకు భువనగిరిలో చదువుకున్నాను. ఎలిమెంటరీ నుండి విశ్వవిద్యాలయ స్థాయి వరకూ గూడా చదువులో నేను చాలా చురుకైన విద్యార్థిని.ఎనిమిదో తరగతి – హయ్యర్ సెకండరీ విద్యార్థిగా ఉన్నప్పుడు భువనగిరి గ్రంథాలయంలో ఉన్న పుస్తకాలన్నీ దాదాపు చదివేశాను. ఆ కోవలో డా.సి.నారాయణరెడ్డి గారి 'స్వప్నభంగం' గేయకావ్యం చదివి, వారితో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపేవాణ్ణి. ఎనిమిదవ తరగతిలోనే 'శశి' మకుటంతో ఒక్కరోజులోనే ఒక శతకం రాశాను. 'నేత' పత్రికలో అచ్చయింది. నాకు ఇంజినీరింగులో సీట్ వచ్చింది. అప్పట్లో ఇంజినీరింగు చదవడం చాలా అదృష్టంగాను, గౌరవంగాను ఉండేది. అయితే దాన్ని కొనసాగించకుండా, ఆర్ట్స్ కాలేజీ బిల్డింగు చూసి, బి.ఎ., చదవాలని నిశ్చయించుకున్నాను. అప్లికేషన్ సమయం అప్పటికి దాటిపోయినా, డా.దివాకర్ల వేంకటావధాని గారి చొరవతో ప్రవేశం లభించింది. బి.ఎ.,లో తెలుగు, సంస్కృతం, భాషాశాస్త్రం సబ్జెక్టులు ఉండేవి. మొత్తం విశ్వవిద్యాలయంలో 77 వేల మంది పరీక్ష రాయగా నాకు ఆరవ ర్యాంకు వచ్చింది. దానికి నిజాం గోల్డ్ మెడల్ వచ్చింది. ఎం.ఎ., యూనివర్సిటీ ఫస్ట్ వచ్చాను. దానికి గురజాడ అప్పారావు గోల్డ్‌మెడల్ ఇచ్చారు. నేను రాసిన 'కత్తి కార్చిన కన్నీరు' అనే కవితకు 'ఉత్తమ సృజన' బహుమతి పొందాను. హైదరాబాదు వచ్చాక నా వచన కవిత్వ ప్రస్థానం మొదలైంది.

**మీకు కృష్ణశాస్త్రి అవార్డు తెచ్చి పెట్టిన తొలి కవితా సంపుటి 'తంగేడుపూలు' తెలంగాణా సంస్కృతికి అద్దం పట్టిన కావ్యంగా చరిత్రలో మిగిలిపోయింది. ఆనాటి మీ అనుభూతులు నెమరు వేసుకుంటే ఎలా అనిపిస్తుంది?**

'తంగేడు పూలు' నేను స్కూల్ ఫైనల్లో ఉన్నప్పుడు రాసినా, 1976లో పుస్తక రూపంలో వచ్చింది. ఆరోజుల్లో ఆ పుస్తకం చాలామందిని ఆకర్షించింది. ఇప్పటికి కొంతమంది 'తంగేడు పూల గోపి' అంటుంటారు. ఆ పుస్తకానికి శీలా వీర్రాజు చక్కని ముఖచిత్రం వేశారు. తంగేడు పూల కొమ్మను కోసి ఆయనకు

ఇవ్వగా చూసి చిత్రం వేశారు.

**తంగేడుపూల తర్వాత చాలా గ్యాప్ తీసుకున్నట్టున్నారు. కవిత్వ వస్తువు విషయంలో జరిగిన ఇంక్యుబేషన్ సమయం అను కోవచ్చా?**

గ్యాప్ ఏమీ లేదు. వెంటనే నా వేమన పరిశోధనావ్యాసం మొదలుపెట్టాను. దానిలో పూర్తిగా మునిగిపోయాను. నా తత్వం ఆదినుంచీ ఏమంటే, ఒక వ్యాసంగం పట్టుకుంటే, అదే లోకంగా ఇతర ధ్యాస లేకుండా, దానికి పూర్తి న్యాయం చెయ్యడానికి శాయశక్తులా కృషి చెయ్యడం.

**మీ మైలురాయి కవితా సంపుటిలో 'నక్షత్రాలు లేని నగరం' అంటూ డబ్బును నక్షత్రాలతో పోల్చారు. కారణం కొంచెం విపులంగా చెప్పండి?**

కవి మొదటి పుస్తకానికి, రెండవ పుస్తకానికి కూడా మార్పు స్పష్టంగా కనపడాలి. మైలురాయంటే నాకిష్టం. కారణం గతానికి, వర్తమానానికి, పునాది లాంటిది ఈ మైలురాయి. మైలు రాయి కవితా సంపుటికి ఫ్రీవర్స్ ఫ్రంట్ అవార్డు వచ్చింది. ఒక్క మాటలో చెప్పాలంటే, మైలురాయిని వస్తువుగా తీసుకొని గతంలోని జ్ఞాపకాలు నెమరేసుకుంటారు. కుదురుగా ఉన్న వర్తమానాన్ని ఇచ్చిన గతానికి కృతజ్ఞతలు తెలుపుకుంటారు. 'జేబులో నక్షత్రాలు లేకుంటే ఈ నగరం నీ మొగమైనా చూడదు' అన్నాను. ఇక్కడ నక్షత్రాలు అనేది ప్రతీకగా తీసుకున్నాను. కవిత్వానికి ప్రతీకలు మరింత గాఢతను పెంచుతాయి. చదవ డానికి ప్రేరణ కలిగిస్తాయి. ప్రతీకలు అందరికీ అర్థమయ్యేలా రాయగలిగినప్పుడే కవిత్వం పచ్చగా చిగురిస్తుంది. నక్షత్రాలు అంటే డబ్బులని అర్థం. నేను డబ్బులను నక్షత్రాలుగా వాడటానికి గల కారణం, స్థితిని తెలుపడమే! అంటే నగరం ఒట్టి వ్యాపా రాత్మకం, ధనాత్మకమే తప్ప గుణాత్మకం కాదని భావించమనే ఉద్దేశంతో అన్న మాట.

**మీ పరిశోధక గ్రంథమైన వేమన గురించి, వేమనకు మీకూ ఉన్న బంధం గురించి చెప్పండి?**

'వేమన పరిశోధన' నా సాహితీ జీవితంలో ఒక గొప్ప మలుపు. మా నాన్న గారు సందర్భానుగుణంగా, వేమన పద్యాలను ఉటంకిస్తూ ఉండేవారు. ఆ ప్రభావం పరోక్షంగా నాపైన ఉండి ఉండొచ్చు. నేను పరిశోధన ఆరంభంలో వేమన పద్యాలంటే అందరూ చెప్పుకునే 'అల్పుడెపుడు బల్కు నాడంబరముగాను, సజ్జనుండు పలుకు చల్లగాను' ఇలా సాధారణ పద్యాలని అనుకున్నాను. పరిశోధనలో పడ్డాక వాటి లోతు, గాఢత అర్థమైంది. అప్పటికే ఆరుద్ర గారితో పరిచయం ఉండేది. వారు నన్ను ప్రాచ్యలిఖిత గ్రంథాలయం వారికి అప్పజెప్పారు. అక్కడ చూసి ఆశ్చర్యపోయాను. సి.పి.బ్రౌన్ సేకరించిన దాదాపు 54 తాళపత్ర గ్రంథాలు, ఎన్నో కాగిత ప్రతులు ఉన్నాయి. అప్పుడు ఈ జెరాక్సులు, స్కానింగులు అవీ ఇవీ లేవు. అన్ని రాత ప్రతులు చూసి చాలా నిరాశపడిపోయాను. ఇవన్నీ ఎప్పుడు రాసుకోవాలి? అని. అక్కడ 15 వేల పాఠాంతరాలతో 3,080 పద్యాలున్నాయి. ఒకరోజు ఉదయం నుంచి సాయత్రం వరకూ 150 పద్యాలు రాయగలిగాను. ఆ రకంగా రెండు వేసవులు అక్కడ ఉంటే, మొత్తం రాసుకోడానికి 5, 6 నెలలు పట్టి, మదరాసులో ఉండిపోయాను. అప్పుడు నేను నానక్‌రాం భగవాన్‌దాస్ సైన్సు కాలేజీలో జూనియర్ లెక్చరర్‌గా ఉండేవాడిని. నా జీతం రూ.452. నేను వేమన మీద మెటీరియల్ కలెక్షనుకు రూ.50 వేలు ఖర్చు చేశాను. కాలేజీ క్రెడిట్ సొసైటీ వాళ్ళు నా ఆసక్తి, పట్టుదల చూసి ఉదారంగా రుణం ఇచ్చారు. ఆ అప్పు తీరడానికి పదేళ్ళు పట్టింది. తిరుపతిలో కూడా చాలా తాళపత్ర గ్రంథాలు ఉన్నాయి. అక్కడ నెలా రెణ్ణెల్లు ఉండాల్సి వచ్చింది. తంజావూరు సరస్వతి లైబ్రరీలో తాళపత్ర గ్రంథాలయంలో 15 రోజులు గడిపాను. కాకినాడలో డా.అద్దేపల్లి రామమోహనరావు గారింట్లో ఒకరోజు ఉండి, అక్కడ పుస్తకాలు సేకరించాను. హైదరాబాదులో నూరేళ్ళ చరిత్రగల వేమనాంధ్ర గ్రంథాలయం అని ఒకటుంది. అలా అన్నీ తిరిగి సేకరించాను.

వేమన యోగి కవి, అనుభవ కవి. ఇలాంటి కవి కబీరు తప్ప ఇంకెవ్వరూ లేరు. అయితే కబీరుకు వచ్చిన ఖ్యాతి వేమనకు రాకపోవడానికి కారణం తెలుగువారి స్వభావం. వాస్తవం చెప్పాలంటే కబీరు కన్నా గొప్ప కవి వేమన. ఆ పద్యాల లోతు తెలిసిన వారికి ఆ విషయం తెలుస్తుంది. ఆయనొక పద్య పర్వతం. ఆయన పద్యాలు చేత్తో రాస్తున్నప్పుడు ఏదో విద్యుత్ చేతిలోనుంచీ శరీరంలోకి ప్రవహిస్తున్న అనుభూతి కలిగేది. ఆయనతో నాకు స్నేహం, ఏదో తెలియని, విడదీయరాని బంధం కలిగింది. తర్వాతి కాలంలో ఆ సిద్ధాంత గ్రంథం పుస్తకంగా వచ్చి, ఇప్పటికి ఏడు ముద్రణలు పొందింది. సిద్ధాంత గ్రంథాల్లో ఎక్కువ ముద్రణలు పొందిన గ్రంథం అదే! దాని తర్వాత సి.నా.రె గారి ఆధునికాంధ్ర కవిత్వం. ఇటీవలి నా వేమన గ్రంథ ముద్రణ ప్రజాశక్తి వారు వేశారు.

**వేల్చేరు నారాయణరావు గారు అన్ని యుగాల్లో వచ్చిన లిఖిత/ఆశు కవిత్వాల గురించి విశ్లేషణ చేశారు కదా! మీ సిద్ధాంత గ్రంథంలో వేమనది లిఖిత కవిత్వమా? లేక ఆశు కవిత్వమా? అనే కోణంలో పరిశీలించి విశ్లేషించారా?**

నేను నా సిద్ధాంత గ్రంథంలో ఒక ఛాప్టర్ మొత్తం ఆ విషయంపై విశ్లేషణ చేశాను. వేమనది ఆశుకవిత్వం, లిఖిత కవిత్వం కూడా! నేను వేల్చేరు గ్రంథం పరిశీలించి ఆ దృష్టితో వేమన కవిత్వాన్ని కూలంకషంగా విశ్లేషణ చేశాను.

**మీకు వేమన ప్రధానంగా ఎలా దర్శనమిచ్చాడు? మానవతా వాదిగానా? లేక సంఘసంస్కరణవాది గానా?**

ఇవన్నీ మనం పెట్టుకున్న పేర్లు మాత్రమే! వేమనను సమగ్రంగా దర్శించాల్సిన అవసరం ఉంది. ఈ సంస్కరణ అనే పదం వీరేశలింగంగారి కాలం నుంచి వచ్చిన మాట. వేమన మౌలికంగా మానవతా వాది. మూఢ నమ్మకాలను ఖండించాడు. మనిషికి హాని చేసే ప్రతి విషయంపైనా ఆయన 'ఆటవెలదిని ఈటెగా' విసిరాడు. శైవులనుగాని, వైష్ణవులను గాని ఎవ్వరిని వదలలేదు.

వేమనది పారదర్శకమైన మనసు, సూటిగా ఉండే తేట మాట. వేమనకు మనుష్యుల మీద ప్రేమ. ప్రతిపద్యంలో ఆయన ధర్మాగ్రహం వెనుక ప్రేమే దాగి ఉంటుంది. మనం వేమనను ఆ దిశగా అర్థం చేసుకోవాలి.

**మీ కవితలు ఆత్మాశ్రయ కోణం నుంచి, కాలక్రమంలో వస్త్వాశ్రయాన్ని సంతకరించుకొన్నాయని కొందరు విమర్శకులు అనడం విన్నాను. మీ అభిప్రాయం?**

నేను ఆత్మాశ్రయ కోణం నుంచీ ఎప్పుడూ కవిత్వం రాయలేదు. మీరు 'తంగేడు పూలు' చూసినా అది ఆత్మాశ్రయం కాదు. 'తంగేడు పూలు అంటే ఒప్పుకోను, బంగరు పూలు'. అది మొట్టమొదటి సామాజిక కవిత. నాకు ఆత్మాశ్రయ కోణం లేదు. రెండూ కలిసిపోయి, సమ్మిశ్రితమై ఉంటాయి కాబట్టి, ఇది ఆత్మాశ్రయ, ఇది సామాజిక అని గీత గీయడానికి వీలు కాదు. రాసేవాడు వ్యక్తి అయినప్పుడు ఆ వ్యక్తి ప్రమేయం లేకుండా కవిత్వం ఉండదు కదా! ఒకే వస్తువు మీద ఇద్దరు కవులు రాసినప్పుడు వారి వారి వ్యక్తిగత స్వభావం లేకుండా ఉండడం కుదరదు కదా! అసలు చెప్పాలంటే ఇవన్నీ భావకవిత్వం వచ్చిన తర్వాత వచ్చిన పదజాలాలు.

**మీ 'జలగీతం' దీర్ఘకవితా కావ్యం తెలుగు రాష్ట్రాల్లోనే కాక దేశంలో సైతం జలచైతన్యం కలిగించింది. ఆ కావ్య నేపథ్యం?**

తెలంగాణాలో నీరు లేని ప్రాంతం నుంచీ వచ్చిన వాడిని. నాకు నీటి విలువ తెలుసు. ఎక్కడో చాలా దూరంగా ఉన్న చేద భావిలోనుంచి నీళ్ళు తెచ్చుకునేవాళ్ళం. మా అమ్మ, నేను ఈ నీటికోసం చాలా కష్టపడ్డాం. నల్లగొండ జిల్లాలో ఫ్లోరోసిస్ సమస్య వల్ల కొన్ని గ్రామాలకు గ్రామాలే అవిటివయ్యాయి. ఆ కడగళ్ళు నా మనసులో ఉండేవి. ఈ కావ్యానికి ముందు ఆరు సంవత్స రాలు, ప్రపంచంలోని జలం గురించి అధ్యయనం చేశాను. తెలుగు యూనివర్సిటీ ఉపాధ్యక్ష పదవీ విరమణ అనంతరం, వందరోజుల దీక్షగా అంటే దాదాపు మూణ్ణెల్లు ఫోను కూడా మాట్లాడ్డం మానేసి రాశాను ఈ జలగీతం. సి.నా.రె గారు నా జలగీతం, వినాలని చెప్పి పిలిపించుకుని, నేను చదువుతూ ఉంటే, ఏకబిగిన గంటన్నరసేపు, అలా కండ్లు మూసుకుని, చెవులు రిక్కించి వింటూ ఆనంద పరవశత్వంలో మునిగిపోయారు. 'వైజ్ఞానిక, భౌగోళిక, మానవీయ కవిత ఇది! దీనికి చాలా భవిష్యత్తు ఉంది' అని చెప్తూ 'నా విశ్వంభరతో పోల్చుకుంటే నేను మట్టిని నమ్ముకుంటే నీవు నీటిని నమ్ముకున్నావు" అన్నారు. ఆయన ఔదార్యం అలాంటిది. ఈ కావ్యం హిందీ, ఇంగ్లీషు, గుజరాతీ, మలయాళం, మరాఠీ, ఉర్దూ, కన్నడం, పంజాబీ, ఒడియా, అస్సామీ మొదలైన 12 భాషల్లోకి వచ్చింది. పర్షియన్ భాషలో 'నగమ-ఎ-ఆబ్' అని అజీజుద్దీన్ అహమద్ ఉస్మాని అనే ఆయన అనువాదం చేశాడు. సంస్కృతంలోకి ఎం.నారాయణ శర్మ తీసుకెళ్ళారు. వీరంతా ఉబలాట అనువాదకులు కాదు. ఆయా భాషల్లో నిష్ణాతులైన, సుప్రసిద్ధ కవులు.

ఇక్కడ తప్పకుండా ఒక్క సంఘటన పంచుకోవాలి. రాజేంద్ర సింగ్ అనే వ్యక్తి రాజస్థాన్ ఆరావళీ పర్వతాల్లో ఎడారులకు నీళ్ళిచ్చిన మహానుభావుడు. ఆయన్ను 'జలపురుష్' అంటారు. ఆయనకు అంకితమివ్వాలని ఫోన్ చేసి అడిగిన సమయంలో అనారోగ్యంతో ఆసుపత్రిలో ఉన్నాడు. నేను విషయం చెప్పగానే ఆయన 'గోపీజీ మై ధన్య్ హోగయా!' అంటూ 'ముఝె ఐసా లగ్ రహా హై కీ, రక్త్ సంబంధ్ సే భీ జలసంబంధ్ గెహరా హై' అన్నాడు. అంటే రక్త సంబంధం కంటే కూడా జల సంబంధం బాగా లోతైనది అని నాకు అనిపిస్తున్నది అని అర్థం. ఆయనను హైదరాబాదు పిలిపించాను. రవీంద్ర భారతిలో అంకితమిచ్చిన ఆ సభకు 1800 మంది పైన హాజరయ్యారు. అది ఒక అపూర్వ మధుర స్మృతి.

**'నానీలు' సృజనకు నేపథ్యం ఏమిటి? ఇది ఒక ట్రెండ్ సెట్టర్లా, ల్యాండ్ మార్కులా సాహితీ లోకంలో నిలబడిపోయింది. ఉద్యమ స్థాయిలో కొన్ని వందలమంది అసంఖ్యాకంగా రాశారు, ఇంకా రాస్తున్నారు. మీ అనుభూతి ఏమిటి?**

నానీలకు బహుశా రజతోత్సవ సంవత్సరం ఇది. నానీలు అంటే చిన్న పిల్లలు. 'నన్హే' అంటే ఉర్దూలో 'చిన్నారి' అని అర్థం. తెలుగులో 'నానీ' అయింది. మినీ కవిత లాంటిది కాదిది. 1997లో కొంతకాలం నాకు ఆరోగ్యం సరిగా లేదు. కొన్ని ఘటనల వల్ల మనసు కూడా బాగాలేదు. అప్పుడు అలా కూర్చొని రాస్తూ వెళ్ళాను. దాని వెనుక ప్రణాళిక ఏమీ లేదు. ముక్తకాల్లాగా రాశాను. ఎ.బి.కె ప్రసాద్ గారు నన్ను చూడడానికి వచ్చారు. అప్పుడు ఆయన వార్త చీఫ్ ఎడిటర్. మాట్లాడుతూ దిండు పక్కన ఉన్న పుస్తకంలో ఉన్న 365 నానీలు తిరగేసి పరిశీలనగా చూశాడు. 'అబ్బాయ్! గోపీ! నీ తలవేపున ఒక గొప్ప విప్లవాన్ని పెట్టుకున్నావు. తీసుకెళ్తున్నాను' అని తీసుకెళ్ళి రోజుకు ఇరవై చొప్పున ఎడిట్ పేజీలో వేస్తూ వచ్చారు. దాంతో నానీల ప్రభ కార్చిచ్చులాగా తెలుగు రాష్ట్రాల్లో వ్యాపించింది. పశ్చిమ గోదావరి జిల్లాలోని యువకవి ఎస్.ఆర్.భల్లం, మొదటగా నా నానీలను అనుకరిస్తూ రాశాడు. నానీల్లో మంచి కవితా శక్తి, నిర్దుష్టమైన నిర్మాణ యుక్తి కూడా నిబిడీకృతమై ఉంది. అందరిని చటుక్కున సూదంటురాయిలా ఆకర్షిస్తుంది. ఇప్పటివరకూ నాకు తెలిసి 420 నానీ సంపుటాలు వచ్చాయి. హిందీ, ఇంగ్లీషు, గుజరాతీ, తమిళం, మలయాళం, మరాఠీ, కన్నడం, పంజాబీ, సంస్కృతం, ఉర్దూ వంటి 10 భారతీయ భాషలూ, రష్యన్ వంటి విదేశీ భాషలోకి, మొత్తం 11 భాషల్లోకి వెళ్ళింది. జర్మన్ రాయబార కార్యాలయంలో నేను పవర్ పాయింటు ప్రెజెంటేషన్ ఇచ్చి నప్పుడు ప్రపంచ దేశాల వాళ్ళు హర్షా మోదాలు వెలిబుచ్చారు.

**'కాలాన్ని నిద్రపోనివ్వను' కవితాసంపుటి మీ కవితా ప్రయాణంలో ఒక గొప్ప మలుపు. 'కాలం కన్న మనిషే గొప్పవాడు' అనే ఒక తత్త్వాన్ని ప్రతిపాదించారు. అలా అని మీరు విశ్వసిస్తున్నారా?**

నిజంగా ఇది నా కవితా ప్రయాణంలో ఒక మలుపు. దీనికి కేంద్ర సాహిత్య అకాడెమీ పురస్కారం లభించిందన్న విషయం

అందరూ ఎరిగినదే! ఈ పుస్తకం హిందీ, ఇంగ్లీషు, గుజరాతీ, తమిళం, మలయాళం, మరాఠీ, కొంకణి, డోగ్రి, మైథిలి, కన్నడం, పంజాబీ, సంస్కృతం, సింధీ, ఉర్దూ, నేపాలీ, ఒడియా, అస్సామీ, మణిపురి, బెంగాలీ, కశ్మీరీ, బోడో, సంతాలీ, రాజస్థానీ మొదలైన 23 భాషల్లోకి అనువాదం పొందినది. ఇన్ని భాషల్లోకి వెళ్ళిన తెలుగు కవి లేడు. నేను నా అందరు అనువాద కవులతో కూర్చున్నాను. తద్వారా, ఆ భాషకూ మన భాషకూ నుడికారంలో, ధ్వనిలో, శబ్ద సంయోజనంలో ఉండే తేడాలను సూక్ష్మంగా పరిశీలించి అధ్యయనం చేయగలిగాను. అను వాదాల విషయంలో ఎంతో మెటీరియల్ సేకరించాను. అనువాద మహాయజ్ఞంలో భవిష్యత్తరాలకు కరదీపికగా ఉండే విధంగా 'నేను-నా అనువాదకులు' అనే పుస్తకం రాయాలని ఉంది. ఇక కాలం కంటే మనిషి గొప్పవాడని అనడానికి కారణం.. కాలం మారు తూ ఉంటుంది. మనిషికి మార్పే భయం! మనిషిని భయ పెడుతూ ఉంటుంది. మనిషి ఆ తత్వాన్ని వంట బట్టించుకుని మనగలిగితే భయ పడదు. అదే నా విశ్వాసం, సందేశం.

**సాహిత్య అకాడమీ కన్వీనరుగా అమెరికా, ఇంగ్లాండ్, చైనా, జర్మనీ మొదలైన అనేక దేశాల్లో పర్యటించి ప్రతి పర్యటనను ఒక యాత్రాచరిత్రగా గ్రంథస్థం చేశారు. 'ప్రపంచ భాషా కవిత్వం' అనే గ్రంథంలో తెలుగుకు కనీసం ఒక పేజీ అయినా కేటాయిస్తారంటారా?**

నేను విదేశాలు సందర్శించింది సాహిత్య అకాడెమీ కన్వీనరు గా కాదు. ఒక్క జర్మనీకి మాత్రమే ఒక బెంగాలీ, పంజాబీ, హిందీ కవి, నేను అకాడెమీ తరఫున వెళ్ళాము. అమెరికా, ఇంగ్లాండు వంటి దేశాలకు, వివిధ సంస్థల ఆహ్వానం మేరకు వెళ్ళడం జరిగింది. ఇక ప్రపంచ భాషల్లో మన తెలుగు భాషకు తప్పక మంచి స్థానం ఉంది. పాశ్చాత్య దేశాల్లో ఉండే కవులకు ప్రచారం ఎక్కువగా ఉంటుంది. వరడ్స్ వర్త్, కీట్స్ కంటే గొప్ప కవులు మనకూ ఉన్నారు. వలస పాలకులు ఆయా కవులను పాఠ్యభాగంగా పెట్టడంవల్ల వాళ్ళు విశ్వవ్యాప్తంగా జనాదరణ పొందారు. శ్రీశ్రీ కాలిగోటికి సరితూగని కవులు అనేక దేశాల్లో మహాకవులుగా చెలామణి అవుతున్నారు. ఇతర దేశాల్లో మన తెలుగు కవిత్వం చదువుతున్నప్పుడు నిర్విరామం గా కరతాళ ధ్వనులు. కనుక తెలుగు కవుల స్థానం గురించి చింతపడాల్సిన అవసరం లేదు.

**కవిత్వానికి మీరిచ్చే నిర్వచనం? అసలు మానవ జీవితానికి కవిత్వం అవసరమంటారా?**

కవిత్వం మానవ స్వభావంలోనే ఉంది. అది మనం రాసిన తర్వాతే పుట్టలేదు. అనాదినుంచీ ఉన్నదే! మనం నిత్యజీవితంలో కవిత్వంతో భాషిస్తాం, భావిస్తాం, ఊహిస్తాం. మన దైనందిన నుడికారాల్లో, జాతీయాలు, లోకోక్తుల్లో ఎంతో కవితాత్మకత శక్తి నిగూఢంగా దాగి ఉంది. ఇక ఏది కవిత్వం? ఏది కాదు అనేది, ఇష్టాఇష్టాలను బట్టి నిర్వచనాలూ మారుతూ ఉంటాయి. అయితే అన్ని నిర్వచనాలను కలిపి, కవ్వంతో చిలికి చూస్తే, 'హృదయ స్పందన' కవిత్వం అని బోధపడుతుంది. అది మొదట వ్యక్తిగతంగా ఉండి కాలాంతరంలో సామూహిక స్పందనగా రూపాంతరం చెందింది అనుకోవచ్చు. కవిత్వం మనసును ప్రక్షాళనం చేస్తుంది. కవిత్వమనేది ఆత్మ పలికే భాష. గతానికి వర్తమానానికి జరిగే నిరంతర సంభాషణ. చేతనోజ్వల స్పృహతో జీవితంలోని విలువలను ఉన్నతీకరించుకోవడం కవిత్వ కర్తవ్యం. మానవీయ విలువలను అరచేతులడ్డంపెట్టి కాపాడగలిగేది ఒక్క కవిత్వం మాత్రమేనని నా ప్రగాఢ విశ్వాసం.

**మీ కవిత్వంలో అనేక పార్శ్వాల్లో సూక్ష్మాంతర అధ్యయనం (మైక్రోస్టడీ), దానిలో మార్క్సిస్టు భావనలు, అవగాహనలున్నాయని కొంతమంది విమర్శకులు అనే మాట మీరు ఏకీభవిస్తారా?**

నా కవిత్వం స్పష్టంగా మార్క్సిజం అని అనను కానీ, వామ పక్షాల ఉద్యమాల ప్రభావం నా కవిత్వంలో అంతర్గతంగా ఉంది. మాది భువనగిరి. నల్లగొండ పోరాటాల కొండ. అసలు మార్క్సిజం అంటే గొప్ప మానవీయ సిద్ధాంతం కదా! మార్క్సిజం ఒక పవిత్రమైన భావం. ఆ భావ స్పర్శ కవిత్వాన్ని తప్పకుండా శుద్ధిపరుస్తుంది. కానీ ప్రత్యేకంగా అలా ఉండకపోయినా ఆ భావనలు మానవత్వం రూపంలో నా కవిత్వం ఉండొచ్చు. సూక్ష్మాంతర అధ్యయనంలో బయటపడక పోవచ్చు కానీ నేను ప్రగతిశీలిని.

**సోషల్ మీడియాలలో నేడు తెలుగు వచన కవిత్వం పొంగి పొర్లుతోంది. రాశిలో ఉన్నంత సత్తా వాసిలో లేదనీ, కవిత్వంలో క్వాలిటీ తక్కువైందని కొందరు పెద్దలు గొడవ పెడుతున్నారు. భవిష్యత్కవులకు మీరిచ్చే సందేశం?**

ఫేస్బుక్, వాట్సాప్ లాంటి ఆన్లైను మాధ్యమాల్లో కవిత్వం చాలా ఎక్కువగా వస్తున్న విషయం వాస్తవం. నేను చైనాలో పర్యటించి నప్పుడు 'అచ్చు సాహిత్యంలో ఎక్కువ క్వాలిటీ ఉందా? లేక ఆన్లైను సాహిత్యంలో ఎక్కువ ఉందా?" అక్కడి వారిని అడిగాను. "ఆన్లైను కవిత్వం ఎవరికి వారు పెట్టుకునేది. దానికి స్క్రూటినీ గానీ ఎడిటింగు కానీ ఉండదు. అచ్చు పుస్తకం అలా కాదు ఎడిటింగు లాంటివి ఉంటాయి కాబట్టి క్వాలిటీ కచ్చితంగా ఉంటుంది" అని చెప్పారు. ఇంకా చైనాలో పేపర్ ఇండస్ట్రీ కానీ, అచ్చుపుస్తకాలు కానీ ఏమాత్రం తగ్గలేదు. పేపర్ కనుక్కున్నదే వాళ్ళు కదా! నా వ్యక్తిగత అభిప్రాయం ఏమిటంటే ఆన్లైను కవిత్వం, హృదయంలో హత్తుకోకముందే, పాద రసం లాగా జారిపోతూ ఉంటుంది. నలుగురికి తెలిసే మాట నిజమే కానీ, నలుగురి హృదయాల్లో నాటుకుంటుందా? అన్నది సందేహమే! మానవ జాతి సాధించిన సాంకేతిక ప్రగతి పట్ల నాకు ఏమాత్రం విముఖత లేదు. వ్యాపార రంగానికి ప్రయోజనకారి కావచ్చు కానీ సృజనాత్మక వ్యాపారానికి ఎక్కువ దోహదం చెయ్యదు. సాహిత్యం నిదానంగా జరగాల్సిన ప్రక్రియ. వేగం పనికిరాదు. కవిత్వం నిదానంగా నమిలి మింగి, జీర్ణించుకోదగ్గ ప్రక్రియ. యువ కలాల ప్రగతికి ఆనందిస్తూ, జేజేలు పలుకుతూనే, కలం పట్టుకుని కాగితంపై రాయాలనీ, ఆ ప్రక్రియ మనసుపై రాసుకున్నట్టు అర్థమనీ, ఆ రాత ప్రక్రియ అనే విలువకు దూరం కావొద్దు అని నా సందేశం. ■

కవిత

# సముద్ర తీరాన పూరీ జగన్నాధుడు!



**జగన్నాధాలయం.....**
**శం**ఖాకార గోపురాల ఛత్రఛాయలో
నవ కళేబరంతో
ఏటా అవతారమెత్తే జగన్నాథుడు,
జీవుని వేదనకు సాంత్వనగా
మనిషి మలిచిన విగ్రహాల మాటున
రథచక్రాల కింద నలుగుతున్న
కోట్లాది చేతుల కాయకష్టం!

కోవిడ్ మహమ్మారిని కూడా ధిక్కరించి
ఆలయ ప్రాంగణంలో చేతులు జోడించి
బలభద్రుడి పతాకాన్ని ఎగరేసి
చంద్రవంకవైపు చూస్తున్న కళ్లు
ప్రధాన ద్వారం దగ్గరే గంటల తరబడి పడిగాపులు
పడుతూ
దర్శనం లభిస్తే చాలిక
జన్మ తరించిందనే తరతరాల రాతి విశ్వాసాల చుట్టూ
కలిమి లేముల కన్నీటి ధారలు
పడిలేచే దుమ్ము తెరల మధ్య
మురుగు కాలువల పక్కనే మిఠాయిల తయారీ
తాతలనాటి ఇరుకిరుకు వీధుల వెంట
సర్దుబాటు నడకలతో
భక్తుల బేరసారాల సందడిలో
సహస్రాబ్దాల దారిద్ర్యం!

మురిపించి మరిపించే
జయహో ధ్వానాలతో
కదిలే జగన్నాధ రథచక్రాలు
సాక్షి గోపాలుడి తన్వయత్వంతో
నడుస్తున్న చరిత్ర సాక్షిగా
ప్రశ్నలకు బదులేది?
దేవుడి దయనే దిక్కని ఊరట చెందే
అసంఖ్యాక దాసుల తీర్థయాత్ర ...

**- నిఖిలేశ్వర్**
**91778 81201**

**సముద్ర తీరం.....**
**అ**క్కడే మధ్యాహ్న మార్తాండుడు
మండుతున్న దివిటీలతో
అలలను వెలిగించగానే
దీపాల ప్రవాహమే!

జిగేలుమన్న స్వరకాంతులన్నీ
కెరటాల కౌగిట్లో వొదిగిపోగానే
కేరింతలతో దూసుకొచ్చే నీటి కొండలన్నీ
చెలియలికట్ట పాదాల వద్దే విరుచుకుపడి
ఇసుకలో ఇంకిపోతూ / పీతులకు గిలిగింతలు పెడుతూ
నీలినీడల గర్భంలోకి లీనమవుతున్న
అగ్నిగోళాకార ఆదిత్యుడు
నిరంతరంగా అస్తమిస్తూ
తిరిగి వేకువనే దగ్ధమానంగా ఉదయిస్తూ
అవిరామ జీవన మరణాల
సజీవ పరంపరగా ...! ■

కవిత

# నన్ను గుర్తు పట్టారా, మాస్టారూ?

నన్ను గుర్తుపట్టారా మాష్టారు?
గుర్తుపట్టి వుండరు లెండి!
అయినా నన్ను గుర్తుంచుకోవడానికి
నేనేమి స్కూల్ టాపర్‌ని కాదు
ఆఖరి బెంచ్లో కూర్చొనే అల్లరి అబ్బాయినీ కాదు
అయినా.... చేప సముద్రాన్ని గుర్తుపట్టగలదుగానీ
సముద్రం చేపను గుర్తుపట్టగలదా!
పిట్ట చెట్టును గుర్తుపట్టగలదు గానీ
చెట్టు పిట్టను గుర్తుంచుకోగలదా!

మీరు నన్ను గుర్తుపట్టలేకపోవొచ్చు గానీ
సముద్రమంత విశాలత్వాన్నీ
చెట్టులా... నలుగురిని చేరదీసే తత్వాన్ని కలిగిన
మిమ్మల్ని నేనెలా మరిచిపోతాను మాష్టారు

నేనెప్పుడు చింతచెట్టును చూసినా
'కింగ్ అండ్ టామరిండ్ డ్రమ్' పాఠం
మీరు అభినయాస్తు చెప్పినప్పుడు
మీరు ఉచ్ఛరించిన 'పి... ల్... ల్లో' శబ్దం
ఇప్పటికీ నా చెవుల్లో మారుమోగుతోంది... మాష్టారు

పుస్తకంలో లెక్కలనే కాదు
నల్లబోర్డుపై మా జీవితపు లెక్కలను కూడా
మీరు మాకు తేటతెల్లం చేస్తున్నప్పుడు
మీ అరచేతిలో సుద్దముక్క సున్నితంగా
ముందుకు... వెనకకు కదులుతున్న దృశ్యం
నా కళ్ళ ముందు కదలాడుతునే వుంది.... మాష్టారు

ఆగస్టు 15 వస్తుందంటే చాలు
ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో మీరు ఆడించే ఆటలకు
మా మనసు జాతీయ జెండాలా రెపరెపలాడేది
జేబులో నక్కి వున్న రూపాయి సాయంత్రానికి
సేమియా ఐసై కరిగిపోయేది
గ్రౌండ్లో మా బాల్యం రబ్బరు బంతిలా ఎగిరిపడేది
మీరు చేయించే డ్రిల్
ఇప్పటికి మా కాళ్లలో క్రమశిక్షణై
కదలాడుతూనే వుంది.... మాష్టారూ

బోర్డుపై మీరు గీసే అందమైన బొమ్మలే కాదు
ఖాళీ పీరియడ్ వచ్చిందంటే చాలు
అంతంలేని కథలతో
మమ్మల్ని ఎన్నెన్ని లోకాలను తిప్పారో
పీరియడ్ బెల్ అయిపోయినప్పటికీ
'పర్లేదు చెప్పండి మాష్టారు' అంటూ
మమ్మల్ని ఎన్నిసార్లు బతిమాలించుకున్నారో
మీరు చెప్పే కథలు
నడి సముద్రంలో చిక్కుకున్న రాకుమారుడు
సీసాలో పంపించే సందేశంలా
మా మనోసంద్రంలో
ఇప్పటికీ తేలియాడుతునే వున్నాయి... మాష్టారు

చిరంజీవి కొత్త సినిమా రిలీజ్ అయ్యిందంటే చాలు
పాత లెక్కల మాష్టారు
సెలవు పెడతారన్న సంగతి
'అక్షర విజయం' అడ్వర్టయిజ్‌మెంట్లో
కోటా డీలర్‌గా సోషల్ మాస్టారు
నీళ్లు నమిలినట్టు చేసిన నటన
చిన్నప్పుడు కాగితాల ఆటలో గెలుచుకున్న కాగితాల్లా
ఇప్పటికీ మా మనుసులో భద్రంగా దాచుకున్నాం

పదవ తరగతి జీవశాస్త్రంలో పేజీ నెం 96ను సైతం
చాలా ఒదుపుగా చెప్పిన బోధనా నైపుణ్యం
పాఠమే కాదు... పాఠం చెప్పే మాష్టారు
అందంగా వుండాలని చాటిచెప్పే
హాఫ్ కట్ షూ వేసుకున్న మాస్టారి గారి ఆహార్యం
for every action... there is opposite reaction
అనే భౌతిక సూత్రాన్ని రుజువు చేసినట్టు
క్లాసులో అల్లరి చేస్తే సైన్స్ మాష్టారు
మందలించిన తీరు
ఇప్పటికీ నా చెంపపై వెంట్రుకలను ఎవరో పట్టి లాగినట్టు
చురుక్కు మంటూనే వున్నాయి

ఒకటా... రెండా మాష్టారు
మీతో పెనవేసుకున్న జ్ఞాపకాల తీగను కదిపితే
బడి బయట అమ్మిన తినుబండారాలపై వాలిన ఈగల్లా
ఇప్పటికీ మా బుర్రలో ఝు..మ్మని ముసురుకుంటూనే వున్నాయి

అయినా మాష్టారూ ...
నిత్యం సుద్దముక్కలై మీరు అరిగి
నల్లబోర్డులు లాంటి మా మనసులపై
తెల్లని అక్షరాలయ్యారు
నిత్యం కొవ్వొత్తులై కరిగి
చీకటి గుహలులాంటి మా బుర్రలలో
తళుక్కుమనే వెలుగులయ్యారు
నిత్యం పాఠ్య పుస్తకాలై చిరిగి
మాకు జీవిత పాఠమై మిగిలారు

ఇంతలా మీ గురించి చెబుతున్న నన్ను
'ఇంతకీ ఎవరు ఈ అబ్బాయి' అనుకుంటున్నారా?
అదేనండి మాష్టారు
క్లాసులో మిడిల్ బెంచిలో కూర్చున్న
మీ జస్ట్ ఏవరేజ్ స్టుడెంటుని!

**- మొయిద శ్రీనివాసరావు**

**(1994-95 పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ కలయిక సందర్భంగా)**

## సమీక్ష



# మనసును తడిమే కవిత్వం

- పాతూరి అన్నపూర్ణ
94902 30939

**కొం**దరి కవిత్వం గలగలా ప్రవహించే జలపాతంలా ఉంటుంది. కొందరి కవిత్వం సముద్రపు అలల్లా ఉద్వేగభరితంగా ఉప్పొంగుతుంది . కానీ కొండరాళ్ళ నుంచి నిశ్చలంగా ప్రవహిస్తూ, దారిని ఒరుసుకొని ఒంపుసొంపులు తిరుగుతూ, చిన్న పాయే కదా అని అనుకునేలోపు ఎంతో గంభీరంగా అనిపిస్తూ, ఎక్కడా ఎత్తుపల్లాలు లేకుండా నిర్విరామంగా ప్రవహించే కవిత్వాన్ని రేఖ సొంతం చేసుకుంది. మొదటి పేజీ నుండి చివరి పేజీ వరకు అదే సవ్వడి. సమాంతరమైన సుకుమారమైన భావజాలం ఎక్కడా ఆగిపోకుండా అలా కొనసాగుతూనే ఉంటుంది. ఎన్ని అక్షరాలూ కుప్ప పోసుకున్నా కొత్త ఆలోచనలు తీగల్లా సాగుతూ, ఆ అక్షరాలతో కలిసి మరో కవిత్వపు పుటకు తెరతీస్తాయి. రేఖది ఆత్మాశ్రయ కవిత్వం అవుతుందేమో!

చిరు అలజడికే కలం కవితకు ప్రాణం పోస్తుంది. ఆర్ద్రత , ఆర్తి ఈ కవిత్వంలో ఎక్కువగా పాలుపంచుకున్నాయి. మనిషి ఎంత సౌమ్యంగా ప్రశాంతంగా ఉంటుందో ఆ కవిత్వం కూడా అంతే మెత్తదనాన్ని పొదుపుకుంది.

ఈ కవితాసంపుటి శీర్షిక 'ఆగిన చోటనే మళ్ళీ' అని పెట్టడంలో ఆలోచనలు,అనుభవాలు మళ్ళీ మళ్ళీ పునరావృతం కావడమే. రేఖ తన రహస్యాలన్నీ గాలికీ , నీటికీ , భూమికీ, అప్పుడే కళ్ళు విప్పుతున్న మొక్కకీ ఒక్కో అక్షరాన్ని, పదాన్ని చెక్కి మరీ అందించినట్టు అనిపిస్తుంది. మొదటి అడుగు నుండే తన ఆర్తిని, ప్రేమను పంచే సంభాషణ మొదలైంది.

"ఏదైనా రాయి కొత్తగా" కవితలో
"ఈ ఒడ్డుమీద నాలుగడుగులు కలగన్నాక
ఇవాళ నువ్వే మిగిలావ్
నీ రెండడుగులు ఇసుక మీద
అవే అడుగులు గుండెమీద
కాసేపు గుర్తులుగా, గాయాలుగా!'

ఎంతగా పదాలు తడిసిపోయాయి . భావోద్వేగంతో గుండె నిండిపోతున్న మాటలు ఇవి. ఇది అనుభవైక మైన భావన . అందుకే చదువుతున్నంత సేపు కళ్ళు చమరుస్తాయి.

"మనసులో పాట" అంతే
"మేలుకున్న మనసుకి/ శబ్దం అవసరం లేదు
కొన్ని చూపులే సరిపోతాయి' అంటుంది రేఖ.

నిజమే కదా... చూపులతోనే మనిషిని ,మనసుని వెతకచ్చు. ఉదయం నుండి రాత్రి వరకు చూపులే సంభాషణగా మారి పాటగా సాగుతాయి. ఆ పాట ఎన్ని సంవత్సరాలైనా పూర్తవదు. అందుకే ఆ పాట జీవితాంతం తనతోనే ఉండిపోతుంది. చిన్న చిన్న వెదుకులాటలు పదాలుగా పాటలుగా మారి అవి జీవితాంతం తోడుగా ఉండడం ఆమె అనుభూతి . నిర్వచనానికి అందని ప్రేమ ఎక్కువైనా ,తక్కువైనా మాటలు ఉండవు. .... మౌనం తప్ప. ఆ మౌనంలోంచి మువ్వల్లాంటి అక్షరాలూ పుట్టుకొచ్చి కవితగా ఆకృతి చెందడం జరుగుతున్నది.

"ఎదురుచూసిన మేఘం ప్రాణాలన్నీ పెట్టుకున్న మేఘం చినుకుల్ని మోసుకొస్తుందని ఆశపెట్టుకున్న మేఘం

ఇంత ఎడారిలో రవ్వంత కురిసిపోతుందని ఆశించిన మేఘం దాటిపోతోంది, నన్ను చూసి దాటిపోతోంది వెనుతిరిగి చూస్తూ దాటిపోతోంది అచ్చం నీలాగే !"......

ఇది రేఖ మనసులోని వర్షం. మేఘం బరువెక్కి కురిస్తేనే ఆకాశం తేలిక పడుతుంది. మనసూ అంతే! .ఎదుటి వ్యక్తి ప్రేమను అందించలేనప్పుడు అది చినుకులు కురవని మేఘమే. పై నాలుగు పదాల్లో ఎంత బరువుని నింపిందో రేఖ కవిత్వం .

నాకు నచ్చిన మరో కవిత "నాక్కాస్త సమయం పడుతుంది

" నిజమే ! మనం మనలా నిలదొక్కుకోవడానికి కాస్త సమయం పడుతూనే ఉంటుంది. అలాగే జ్ఞాపకాల నుంచి బయటపడేందుకు కాస్త సమయం పడుతుందని చెప్తోంది ఈ కవిత.

"నువ్విచ్చిన వసంతంలోనుంచి
నువ్వు లేని గ్రీష్మంలోకి జారిపోవడానికి
నాక్కాస్త సమయం పడుతుంది .....
ఎటు కదలను ..?
ఈ కాస్త కూడా ఇపుడు లేదనుకోడానికి
నాక్కాస్త సమయం పడుతుంది"

ఇట్లా " ఆగినచోట నుండే మళ్ళీ " పుస్తకం చదువుతూ మళ్ళీ మొదటికే వస్తాము . ఎందుకంటే , ఈ కవితలు ఒక్కసారి చదివితే అర్ధం కావు. ఈ పుస్తకం నింపుకున్న భావచిత్రాలను మళ్ళీ మళ్ళీ చదివితేనే వాటిల్లో నిగూఢం గా దాగిన భావం అర్ధంమవుతుంది . అందుకే ఈ పుస్తకం నాకు అంది నెలరోజులైనా నేను నా మాటలు ఇలా అందించడానికి సమయం పట్టింది. రేఖ పోస్ట్ లో పుస్తకం పంపిన రోజునుండి నా అమెరికా ప్రయాణం వల్ల ఆ పుస్తకంలోకి వాకిలి తెరుచుకొని వెళ్ళలేకపోయాను . ఇదిగో ! ఈ సాయంత్రం నీరెండవెలుగులో కూర్చొని పుస్తకం తెరిచాను. అంతే ! కళ్ళూ , మనసూ ఒక్కసారిగా చెమ్మగిల్లాయి. ఈ కవితలో ఎంత భావజాలాన్ని దాచుకున్నాయో, ఎంత బరువును నింపుకున్నాయో అర్ధమయింది . ఈ భారాన్ని నాలుగు మాటలలో అందిద్దామని మొదలెట్టాను. కానీ ఆగిన చోటుకే మళ్ళీ మళ్ళీ వస్తున్నాను . ఇది అంతం లేని ప్రయాణం అని తెలిసింది .

ఇక్కడ మనస్ఫూర్తిగా మెచ్చుకోదగినవారు ,ఈ పుస్తకాన్ని అందంగా తీర్చిదిద్దిన గిరిధర్, చిత్రాలు గీసిన కిరణ్ కుమారి , కవిత్వాన్ని ఎంతో శ్రద్ధగా అందించిన వాకిలి పబ్లిషర్స్ . రేఖా! మీ ప్రయాణం ఎన్నో మజిలీలుగా సాగుతున్నా మీ అడుగులు ముందుకు నడవాలని మరిన్ని అనుభవాల మేఘాల వర్షం కురిపిస్తారని మనసారా నమ్ముతూ మనమంతా అక్షరాల త్రోవపైన కలసి ప్రయాణం చేద్దాం. ■

**" తెలుగువాడివై తెలుగు రాదనుచు**
**సిగ్గులేక ఇంక చెప్పుటెందుకురా**
**అన్య భాషలు నేర్చి ఆంధ్రమ్ము రాదంచు**
**సకిలించు ఆంధ్రుడా చావవెందుకురా!"**

**- కాళోజీ నారాయణరావు**



## లో'కులం'

**స**మస్త ప్రకృతికేది కులం
అనంత విశ్వానికేది కులం?
జీవాత్మకి ఏది కులం
జనన మరణాలకేది కులం?

తినే తిండికి తాగే నీటికి
నడిచే నేలకి చూసే నింగికి
పీల్చే గాలికి రగిలే నిప్పుకి
కులమేది కుతంత్రమేది?

సమాజమంటే ఒక గురుకులం
సమిష్టిగా జీవిస్తున్న లోకులం
మనిషిని చూస్తే నాగరికులం
కులాన్ని చూస్తే అనాగరికులం!

ఒంటరిగా పుట్టిగిట్టే ఏకాకులం
మహా రంగస్థలంలో నటకులం
మట్టిలో ఒదిగే ఎండుటాకులం
మనకేల ఈ కుల వ్యాకులం..!

మనిషి మనస్సే ప్రధానం
మనదంతా మానవ కులం
ఉన్నది ఒకటే జీవితం
ఒకసారే మన ప్రస్థానం!

**- సాహితీ సూర్య**
**90005 29994**

## కవితలు

## మగ్గాలు పగులుతున్న చప్పడు

**చ**ర్మాన్ని ఎన్ని పొరలు పొరలుగా ఒలుచుకుంటే
ఒక పత్తికాయ నూలు పోగయ్యిందో
ఎన్ని చేతి ఊపిర్లు గటగటా తాగితేనే దారప్పోగులు
ఓ బట్టగా బతికి బట్ట కట్టేది!

బట్టలకు రంగులద్దిన రంగు హంగుల్లేని జీవితంలో
నీళ్ళింకిపోయిన నేలలా ఉబ్బిన కళ్లని
ఎన్ని సార్లు తడితడిగా ఒత్తుకునుంటారో
ఏకు నుంచి దారం వచ్చినట్లు
ఎంత రక్తం చమురులా ఆవిరైతే
ఒక వస్త్రం తయారై నాగరికత మానం కాపాడుతుంది?

శరీరాన్ని అంటుకుపోయిన డొక్కలో
పేగులు ఎన్నిసార్లు సుడులు తిరుగుతూ
ఒకదానినొకటి పెనవేసుకుని బావురుమనుంటాయో
మగ్గం మూలన పడిన ప్రతిసారీ
పొయ్యికి అగ్గి, ఎసరు కుండలు దొరక్క
కడుపు ఆకలితో నిండి పోతుంది!

చేసిన ప్రతి అప్పూ
ఉరి తాడుకి ఒక్కో దారంలా బిగిసి
పేదరికాన్ని వెక్కిరిస్తుంటుంది
ఇంకో పక్క చిన్న జీవితం
చిరిగిన చొక్కలా నట్టింటి దూలానికి వేళ్ళాడుతుంటుంది

రెక్కల కష్టాన్ని లాగేసుకున్న
కరువుకాలాన్ని శపించడం తెలియని వాళ్ళు
మగ్గానికీ, నూలుపోగుకీ మధ్య
వాళ్ల బతుకో రంగుల రాట్నం

చేతులతో నిప్పులు పట్టుకుని
గుండె చిల్లులకు దారిద్ర్యం సూది మొనతో
వొదుపుగా కుట్లు వేస్తుంటారు
రోజులు వెళ్ళమారుతుంటాయి
ప్రభుత్వాల వేలంపాటలో
తరాలు మారినా తలరాతలు మారని
బతుకుల్ని ఏమార్చుకుంటూ
కాళ్ళ కింద నలిగే మగ్గాల్లా
బతుకులు ముగుస్తున్నా మగ్గం అలసిపోదు!

**- వైష్ణవి శ్రీ**
**80742 10263**

## దేన్నుంచమంటావ్..?

నీకు లాగా
గంటకో రంగు మార్చే బట్టలు లేకపాయే
ఉన్న పుట్టగోసిని కూడా పీకి
ఉత్తబెత్తలతో వూరి నడిబద్దున నిలబెడితివి!
ఏ బొమ్మనుంచమంటావ్?
ప్రొఫైల్ పిక్‌గా... ఏదుంచమంటావ్?

ఉన్నోళ్ళకు పూడ్చిపెట్టేందుకు
జోలె పట్టుకుని దేశదిమ్మరోలే తిరిగే
నీ బొమ్మనుంచమంటావా?
ఆకలి పేగుల్ని...
మెడకేసుకుని వూరూరా తిరిగేలా చేసిన
నా బొమ్మనుంచమంటావా?

ఢిల్లీకోట మీదుగా
నువ్ ఎగరేసే మూడు రంగుల జెండాని...
గుంజి గుటారం లేని నన్ను
ఏ జాగాలో నిల్చుని ఎగరేయమంటావ్?
రంగులద్దిన కండువా
నీ మెడలో కాసేపే
మూడు రంగుల జాతీయ జెండా
నా గుండెలో ముప్పొద్దులా వుంటుంది

దేశభక్తి ఎవరిలో ఎంతుందో..?
ఏ భక్తుడినైనా కొలువమని చెప్పు

ప్రచారార్భాటాలకి ఉత్సవాల పేరిట
జాతిని వెర్రి వెంగళప్పలని చేసేందుకు
కొత్త నాటకాలకు తెరతీసే పగటి వేషగాడి
బొమ్మ నుంచమంటావా?
డెబ్భై ఐదేళ్ల స్వాతంత్ర ఫలాలు
ఏ అంగట్లో అమ్మావో...
ఎవరెవరికి పంచి పెట్టావో ..
మీ జమానా ఏలుబడిని 'డీపీ'గా వుంచనా?

**- ఆది ఆంధ్ర తిప్పేస్వామి**



# అభ్యుదయ కవితారత్నం అడిగోపుల

- కొండ్రెడ్డి వేంకటేశ్వర రెడ్డి

**అ**డిగోపుల వెంకటరత్నం అనుక్షణం, అలుపెరగని జలపాతంలా, అభ్యుదయ భావాలతో, చైతన్య దీప్తితో శాస్త్రీయ దృక్పథంతో రాస్తున్న కవి. అట్టడుగు వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా, శ్రామికవర్గ చైతన్యాన్ని రేకెత్తించే విధంగా, వీరి కవిత్వం ఉంటుంది. పర్యావరణ పరిరక్షణే ప్రాణంగా, సామాజిక, రాజకీయ, ఆర్థిక, కాలుష్యం మీద కన్నెర్రజేస్తూ, మహిళాభ్యున్నతిని కాంక్షిస్తూ వీరి కవిత్వం సాగిపోతుంటూంది. పల్లెతల్లి ఉల్లాన్ని కుళ్లబొడుస్తూ, పట్టణాల్లో వెట్టిచాకిరీ చేసుకోమని ప్రోత్సహిస్తున్న, పాలకుల పాపిష్టి స్వార్థాన్ని తూర్పారబట్టే, సాహసోపేతమైన సాహిత్యాన్ని వీరు రాస్తుంటారు. ఎంతో లోతైన భావనాశక్తితో, నిరంత రాన్వేషణతో కాలాన్ని వడగట్టి అభ్యుదయ కవిత్వాన్ని రాసి రాశిపోస్తున్నకవీయన. ఈయన కమిటెడ్ కవి. మార్క్సిస్ట్ భావజాలాన్ని రస సంపత్తి గల భాషతో, ఎడారి గుండెల్లో సైతం ఏరులు పారించే లక్ష్యంతో కలం పట్టిన కవి అడిగోపుల.

కవిత్వాన్ని సామాజిక బాధ్యతతో, కళాత్మకంగా, ప్రజా ఉద్యమ నియమ నిష్టలతో, సానబట్టి, సరికొత్త భావనాతృష్ణను, పెంచే దృష్టి కోణాన్ని, పాఠకులకు అందించుటలో కృతకృత్యుడైన కవీయన. సామాజిక విధ్వంసాల కొసలు పట్టుకు వేలాడకుండా మూలాలను పట్టుకునే రహస్యాన్ని విప్పి చెప్పే కవీయన. వీరి కవిత్వం సృజనాత్మకత కలిగి నిత్యనూతనత్వానికి చేవ్రాలుగా, సామాజిక గమనానికి అద్దం పట్టే విధంగా ఉంటుంది అనడం అతిశయోక్తి కాదు.

ఆదర్శానికి అంతరంగానుభూతికి దిక్సూచిగా నిలిచిన వీరి కవిత్వం సామాజిక రుగ్మతలను ఎండగడుతూ భావావేశ కొరడాను ఝుళిపిస్తూ అరుణారుణ ప్రభలతో సాగిపోయింది. 1984లో కవిగా వీరి కవితా హృదయం 'సూర్యోదయం'గా వెలువడింది. అప్పటి నుంచి 2021 వరకు వీరి కవిత్వం 'జయభేరి' అయి మ్రోగింది. వీరి కలం నుంచి 25 కవితా సంపుటాలు ఒక కథాసంపుటి వెలువడ్డాయి. వడి తగ్గని కవితావేశంతో నిర్విరామ కవిగా, అడిగోపుల ముమ్ముందుకు అడుగులు వేస్తూనే ఉన్నాడు. ప్రగతిశీల వాదిగా ప్రజాచైతన్యాన్ని రేకెత్తించే అభ్యుదయ భావాలను ఆరబోస్తూనే ఉన్నాడు.

2019లో అడిగోపుల కవిత్వపు తాత్త్వికతను, సామాజిక ఆర్థిక, రాజకీయ, చారిత్రక, సాంస్కృతిక, నేపథ్యం అర్థం చేసుకొని వివరించే విశ్లేషకుని గీటురాయికెక్కింది. ఎంతో విలువైన సమాచారంతో 'అడిగోపుల అభ్యుదయ కవిత్వం' శీర్షికతో విశ్లేషణా గ్రంథం వెలువడింది. పాఠకాదరణ పొందింది. అడిగోపుల కవిత్వాన్ని విశ్లేషించిన విశ్లేషకుణ్ణి 'నేను' కావడం నాకెంతో ఆనందానిచ్చింది.

**సాహిత్య విమర్శకుల దృష్టిలో 'అడిగోపుల'**

**ఆరుద్ర** : ''అడిగోపుల కవితల్లో కొత్త గొంతుక వినబడుతుంది. కొత్తచూపు కనబడుతుంది. కొత్త మలుపు తారస పడుతుంది. అభ్యుదయాన్ని హాస్యరసంతో పండించాడు కవి. వ్యంగ్యంగాను, ఎత్తిపొడుపుల తోను, సామాజిక

రుగ్మతలను ఆటవిడుపుగా పాఠకుని దృష్టికి తెచ్చాడు. వీరు నడుస్తున్న మార్గంలో తప్పటడుగులు లేవు" అన్నాడు.

**ఆచార్య ఆత్రేయ :** "ప్రజాస్వామ్యంలో ఓటు విలువ తెలిసినప్పుడు నవసమాజం, సమసమాజం మనముందు నిలుస్తుంది అనే భావన వ్యక్తీకరిస్తాడు కవి. సామాజిక బాధల్ని పలవరించి, కలవరించి గాయాల్లోంచి తోడుకున్న అనుభవాల ఆక్రోశాన్ని అక్షరాల్లో బంధిస్తాడు కవి"

**డా॥ మరువూరు కోదండరామరెడ్డి :** "సాహిత్యమే వృత్తిగా కలిగిన వ్యక్తి కవిత్వం రాస్తే అందు విశేషం లేదు. ఒక యువ ఇంజనీరు మధురమైన భావస్ఫూర్తితో అధిక్షేపణ రూపమైన, మార్గదర్శకమైన కవిత్వం ఇంపుగా చెప్తున్నాడు. భావం విన్నదే అయినా నూత్న శయ్యా రూపంగా కవితకు తొడవుగూరుస్తున్నది. పాత కొత్తల మధ్య సామరస్య సేతువును నిర్మిస్తున్నాడు"

**ప్రొ॥జి.ఎన్.రెడ్డి :** "వీరి "జీవన పోరాటం" మన సమాజంలో గోచరాగోచరంగా వున్న ఆరాటానికి, పోరాటానికి అద్దం పడుతున్న కావ్యం. ఈ కార్యం చక్కలి గింతలు కాకుండా ఆలోచనా తరంగాల్ని రేకెత్తించే విలక్షణ కావ్యమిది. వీరిది ఆవేశంలో కన్నా ఆలోచనలో పుట్టిన కవిత" అంటాడు.

**గుంటూరు శేషేంద్ర శర్మ :** వెంకటరత్నం గారు 'మరణానికి రెండు ముఖాలు' కావ్యాన్ని ఎంత గొప్ప రచనగా రూపొందించారంటే మన వర్తమాన దేశానికి ఇంతకంటే శక్తిశాలి చిత్రం మరొకటి ఉండబోదు అనుకోవచ్చు" "వీరి కావ్యం మనకు జ్ఞాపకం చెయ్యని బాధ అంటూ లేదు. ఈ కావ్యాన్ని భారతీయ బాధల నిఘంటువు అనవచ్చు".

**డా॥ తంగిరాల వెంకట సుబ్బారావు:** "అడిగోపుల" కవిత్వం మెస్మరిజం, కవి కన్ను ఒక ప్రిజం" అనేలా కవిత్వాన్ని పండించాడు. భావాల్ని మండించాడు. జనాన్ని ఆనందింప జేశాడు. ఆలోచింపజేశాడు. కవిత్వాన్ని స్తబ్ధత లేని ప్రభంజనంగా, ప్రజలను నిద్ర మేల్కొల్పే నాదంగా మార్చి ఉపాసించాడు. ఈయన ఉబుసుపోని కవిత్వం వ్రాసేవాడు కాదు. ప్రజల దుస్థితిని చూసి, రాజకీయవేత్తల దోపిడిని ఎదిరించి, జోకొట్టే కవిత్వాన్ని నిరసించి, జై కొట్టే కవిత్వాన్ని ప్రవచించాడు"

**డా॥ యస్వీ భుజంగరాయశర్మ:** "కవి అడిగోపుల అక్షరాల్లో అగ్ని గోళాలకు దట్టించగలడు. ఆప్యాయతలను మూటగట్ట గలడు. తన అనుభవాల్లోకి పదాలను జొరబడచేసి గాలానికి చిక్కిన చేపను లాగినట్టు బయటకు లాగి, అనుభవేద్యమైన సారాంశాన్ని పదిమందికి పంచగలడు. కవిత్వంలో తనదైన శైలని, తనదైన మార్గాన్ని తాను అనుసరిస్తున్న విలక్షణ కవి అడిగోపుల"

**వీరాజీ :** "అడిగోపుల పులి లాంటి కవి. అచ్చమైన అభ్యుదయ కవి. ఈయనది సజీవ రచన. పదికాలాల పాటు బతుకుతుంది"

**రావూరి భరద్వాజ :** "ఒక సాధారణ దృశ్యాన్ని అసాధారణమైన కోణంలో నుండి వీక్షించి, గోచరించే సౌందర్యం మీద ఎక్కడా మసకంటని, పారదర్శకమైన, పదాలను ఎన్నుకొని, ఆ పదాల సాయంతో రంగుల గీతలతో ఆలోచనల ఆటల్ని, పాటల్ని చిత్రించడం తెలిసిన కవి అడిగోపుల".

అడిగోపుల వెంకటరత్నం కొత్త వంగల్లు గ్రామంలో అడిగోపుల వెంకయ్య, వెంకటసుబ్బమ్మ దంపతులకు జన్మించాడు. వీరి ప్రాథమిక విద్య కొత్త వంగల్లు గ్రామంలోనే జరిగింది. హైస్కూలు విద్య నెల్లూరు జిల్లా గండవరంలోను, పియుసి జవహర్ భారతి కాలేజీ కావలిలోనూ, ఇంజనీరింగ్ తిరుపతి, మద్రాసు కాలేజీల్లో పూర్తిచేశారు. అసిస్టెంటు ఇంజనీరుగా నాగార్జున యూనివర్శిటీలో చేరి ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు క్యాడర్‌లో పదవీ విరమణ చేశారు.

ప్రపంచంలో ఏ విజేత గాథని చూసినా, ఆ మహత్తర విజయానికి కారణం అతని వ్యక్తిత్వంగా అర్థమవుతుంది. వ్యక్తిత్వం అనేది బహుపార్శ్వయుతమైన పరిణామంగా భావించాలి. "నేర్చుకో, జీవించు, అందించు" అనే మూల సూత్రంలో వ్యక్తిత్వ నిర్మాణం, పరిణామం, వికాసం ఇమిడి వుంటాయి. అడిగోపుల వారు నిరంతర అధ్యయన శీలి. క్రమశిక్షణతో కూడిన నడత, దైనందిన చర్యగా, నిత్య 'పరిశీలనం' వృత్తి, ప్రవృత్తుల్లో ఒక భాగం చేసుకున్న వ్యక్తి ఆయన. నిరంతరం సాధనతోనే అడిగోపుల అభ్యుదయ కవిగా ఎదిగాడు. అద్వితీయమైన ఆయన కృషి వృత్తికి ప్రవృత్తికి వన్నె తెచ్చింది. వీరి ప్రత్యేకత సంకల్ప బలం, అది స్పష్టమైనదిగా నిర్దిష్టంగా, లక్ష్యసిద్ధితో కూడుకొని వున్నదిగా వుండడం. ఒక లక్ష్యాన్ని ఎన్నుకున్నాడంటే అది ఛేదించేవరకూ సాధించే వరకు పక్క చూపులు చూడని వ్యక్తిత్వం అడిగోపులది. అందుకే ఆయన దీక్షాదక్షత గల కవిగా ఎదిగాడు.

### కవిత్వంలో ప్రభవించిన ప్రతిభ

వామపక్ష భావజాలమున్న కవిగా "అన్ని గుండెలూ ఎరుపే/ కాని ఎరుపెక్కేది/ కొన్ని గుండెలే". అంటాడు. రాజకీయ కంఠ స్వరయెత్తిన కవిగా. "ఐదేళ్ళ కొకసారి వచ్చే / ఎన్నికల్లో నువ్వు / అమ్మకానికి ఓటుపెడితే / ఐదు సంవత్సరాల / బానిసత్వం కొనుక్కున్నట్లే / కొత్త రంగుల దుష్ట రాజకీయ పల్లకీ / మొయ్యడానికి ఒప్పుకున్నట్లే" అంటూ హెచ్చరిస్తాడు.

దిశానిర్దేశం చేస్తూ "కాంతిని కనాలంటే / కళ్ళు తెరవాల్సిందే / రాళ్ళు పగలాలంటే / పిడికిలి బిగించాల్సిందే

/ కర్మ సిద్ధాంతాన్ని కాల్చాలంటే / అగ్గిపుల్ల గీయాల్సిందే" అంటాడు.

అన్యాయాల మీద విరుచుక పడిన కలం. "ఎన్నాళ్ళీ కలుషిత చరిత్ర / ఇంకెన్నాళ్ళీ ఆరనిమంట / ఆగని కన్నీటి గాథలు / ధనమదాంధుల దౌర్జన్యాలు / మతహంకారుల కిరాతకాలు / ఎన్నాళ్ళు? ఇంకెన్నాళ్ళు? అని ప్రశ్నిస్తాడు.

అంటరానితనం మంటగలపాలనే భావనతో "మా పల్లె బావిలో చేదకు నీళ్ళందక / చేంతాడివ్వమని మాయజమాన్నడిగితే/ అయ్యగారు గుద్దులరిమి / అంటరాని వాళ్ళ బావిలో చేంతాడేసి / అంటరానితనం అంటగట్టాలనా/ అన్నాడు" అంటరానితనం సమాజాన్ని కుదిపేస్తున్న పరిస్థితి వివరించాడు కవి. ఎర్రజెండా అంటే ఈ కవి దృష్టిలో "ఎర్రజెండా అరమీటరు గుడ్డ కాదు / అనేకమంది రక్తం" అంటాడు. దోపిడికి గురౌతున్న జనం సంఘటితం కావాలనే దృష్టితో "పీడిత తాడిత ప్రజలంతా / సంఘటిత శక్తయి / ఉప్పెనై వెంటాడితే / ప్రతి పూట పగలే వెన్నెల / ప్రతిరోజు వెలుగు జిలుగుల దీపావళే"

అడిగోపుల కవిత్వం నిత్యనూతనం. పాలక పక్షం, మేధావుల్ని గుర్తించడం లేదనే సత్యాన్ని వెల్లడిస్తూ... "నేటి వ్యవస్థ / మేధావికి రెండుసార్లు / సమాధులు కడుతుంది / బతికుండగానే ప్రతిభకు / చనిపోయాక శవానికి" అంటాడు ఆయన.

అక్షర మహిమను వెల్లడిస్తూ "అక్షరం మార్గాన్ని సూచిస్తుంది / అక్షరం మార్పును చూపిస్తుంది / అక్షరం కాంతిని మోసుకొస్తుంది / అక్షరం ఈటెలా దూసుకెళ్తుంది" అంటాడు. ఒక తాత్విక కవిగా "సముద్రంలో / సంగమించిన నది / మళ్ళీ తన ఉనికి కోసం / బిందువుగా భూమ్మీద రాలుతుంది" అంటాడు. ముసిరిన వేదనలు మసైపోవాలంటే "వేదనలో శోధన పుట్టి / శోధనలో వేకువ పొడిచి / అరుణారుణ పిడికిళ్ళు ఆవిష్కరించబడాలి" అంటాడు. ఈనాడు నగరాలు ఎలాగున్నాయంటే "అమానవీకరణ, యాంత్రిక జీవితం, కలుషిత విష వాతావరణం, మత వైషమ్యాలు మాఫియా గ్యాంగుల మధ్య ఏకాకితనం కప్పిన నగరం" అంటాడు. "సంకెళ్ళు విచ్చుకోవు, తెంచుకోవాలి" అనేది అడిగోపుల కవిత్వ ఆంతర్యం.

ఆశావాదిగా అడిగోపుల 'రగిలిన గుండె'తో చీకటి సామ్రాజ్యం, గుట్టు రట్టు చేస్తూ" చీకటి సామ్రాజ్యమైనప్పుడు / సూర్యుడు కోసం ఎదురుచూడను / చంద్రుని కోసం వేచిచూడను / నా గుండె మండిస్తాను" అంటూ సూర్య చంద్రులకు ప్రత్యామ్నాయంగా గుండెమంటలే వెలుగులు చేస్తానంటాడు. సామ్రాజ్య వాద దేశాల ఆంతర్యాన్ని విప్పి చెప్తూ "యుద్ధం ఉన్మాది ప్రేరణ / ఆధిపత్యపు పోరులో / అణ్వస్త్రాల తయారీ / చేసేది ఆయుధ సేద్యం / ఉపదేశం శాంతి సందేశం" అని స్పష్టం చేస్తాడు. రైతును గురించి ఈ కవి : "రుణాల నోటీసులు / ఉరితాళ్ళై వేలాడుతూ / కర్షకుణ్ణి వెన్నంటి వేటాడుతుంటాయి. భాషకు బూతులద్ది / అప్పును తీర్చే డబ్బులు కక్కమంటారు / బీటలు వారిన బతుకులు / బాటన పడవని విశ్వసించిన హాలికుడు / మునకే సుఖమనుకొని ఆత్మహత్యలో మునుగుతాడు" అని పేర్కొంటాడు.

కవిని కవిత్వాన్ని గురించి : "మనిషి కవి అయితే, వస్తువు పద్యమౌతుంది/ కవి శిల్ప అయితే / పద్యం శిల్పమౌతుంది" అంటూ కువిమర్శలు చేయవద్దంటూ నదుల్ని నరాల్లో నింపుకున్న వాడు / సముద్రాల్ని గుండెల్లో దాచుకున్నవాడు / రాయాలనుకున్నది రాసిన వాడు / 'కా' కు దీర్ఘం ఎందుకనో / 'రా' కు కొమ్ము లేదనో కలాలను విమర్శలో దించకండి" అంటాడు. పాఠకుల్లో కవి తన కవిత్వం ద్వారా వో తెగువను బోధిస్తాడు. మరణానికి భయం ఎందుకు? అదెప్పుడూ శరీర అంతర్భాగం / నీకు సంక్రమించిన వారసత్వం నిశ్శబ్దం / నువ్వు నీ వాళ్ళకు ఇవ్వాల్సింది శబ్దం / ఆవేశం, ఆవేదన / ఆందోళన కూడిన తిరుగుబాటు" అంటాడు.

'ఆరుద్ర' అడిగోపుల కవిత్వం మీద పద్యం చెప్తూ "పిడికిలి బిగించి ప్రజలు / మ్మడిగా మనయీ వ్యవస్థ మార్చే దాకా / పెడబొబ్బ సింహనాదం / అడిగోపుల హోరుగాలి ఆగవు సుమ్మీ" అంటాడు. ఇంకా.. ఇంకా.. "వేషాల్నీ ద్వేషాల్నీ / భాషల్నీ భేషజాల్నీ / లక్ష్మణ రేఖల్నీ / సంకుచిత రాజకీయాలు నాటిన / సరిహద్దుల్నీ చీల్చుకొని / మోదాన్నీ, ఖేదాన్నీ మోసుకొని సాగుతుంది. అడిగోపుల వెంకటరత్నమ్ అభ్యుదయ కవితారత్నంగా ప్రకాశిస్తూనే ఉంటాడని నమ్ముదాం! ■

**కళ మూలాలను, కలయికల మూలాలను ధ్వంసం చేయడంలో పెట్టుబడీదారీ వ్యవస్థ పశు బలం దాగి ఉంది. ఈ వ్యవస్థ కళ నుంచి కలయికను, వస్తువు నుంచి సారాంశాన్ని తొలగిస్తుంది. అమ్మకం కొనుగోళ్లే అసలైన విలువలుగా స్థిరీకరిస్తుంది. కవులూ రచయితలూ దీనిని గుర్తెరగాలి.**

**- పాపినేని శివశంకర్**

## 'మానవతపై దాడి' పరిచయ సభ

**'మా**నవతపై దాడి' పుస్తక పరిచయ సభ ప్రజాశక్తి – సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో  పెనుకొండలోని ఆర్ అండ్ బి అతిధి గృహంలో జరిగింది. ప్రజాశక్తి ప్రతినిధి నాగార్జున అధ్యక్షతన జరిగిన ఈ సభకు ముఖ్య అతిథులుగా సాహితీ స్రవంతి కన్వీనర్ ఎ హరి, సీఐటీయూ జిల్లాకార్యదర్శి సి.రమేష్, ఘన గిరి చైతన్య వేదిక అధ్యక్షులు రాజశేఖర్ హాజరయ్యారు. వక్తలు మాట్లాడుతూ గుజరాత్‌లో జరిగిన మారణహోమం భయంకర నిజాలు తెలుసుకోవడానికి, మతం చాటున జరిగే ఘోరాకృత్యాల కుట్రల లోతులను పరిశీలించడానిక, నరమేధం  ఎన్ని బండ్ల కళేబరాలను, ఎన్ని టన్నుల మాంసపు ముద్దలను సృష్టిస్తుందో ఊహించడానికి సాధ్యం కాని వాటి లెక్కలు కొంతైనా తెలుసుకోవడానికి  మానవతపై దాడి పుస్తకాన్ని  చదవాలని అన్నారు. "ఉన్మాదుల మధ్య మనం బతుకుతున్నామో, మతోన్మాదుల ఏలుబడి రాజ్యంలో భారతవని భవిష్యత్తు, కర్తవ్యాలను నిర్ణయించుకునే  స్థిర చిత్తంతో చదవాలి. మానవత్వాన్ని నిలుపు కొనే  మార్గాన్వేషణకు ఈ పుస్తకం తోడ్పడుతుంది. 2002 గుజరాత్ రాష్ట్రంలో జరిగిన మారణకాండపై కన్సర్న్ డ్ సిటిజన్స్ ట్రిబ్యునల్ నివేదికలోని కొన్ని భాగాలు ఈ పుస్తకంలో ఉన్నాయ'ని వివరించారు. శవాలగుట్ట మీద నిర్మించే మత రాజ్యం ఏమి సాధించటానికని ప్రశ్నించారు. ఆరోగ్యాన్ని కాపాడలేని, ఉపాధి కల్పించలేని, మనసుల మధ్య ఐక్యత సాధించలేని పాలన వలన ఏం ప్రయోజనం అని ప్రశ్నించారు. విజ్ఞాన, శాస్త్రీయ భావాల మార్గంలో దోపిడీ రహిత విశ్వ మానవ రాజ్య నిర్మాణమే కవులు, రచయితలు, మేధావుల ముందున్న మార్గం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో  పట్టణంలోని మేధావులు, టీచర్లు, మతపెద్దలు, కార్మిక నాయకులు పాల్గొన్నారు.



మానవతపై దాడి పుస్తకాన్ని కర్నూలులో ఆవిష్కరిస్తున్న వెంకటకృష్ణ, కెంగార మోహన్, రఘుబాబు, నరసింహ, మధు తదితరులు




పెనుగొండలో జరిగిన సభ

## గరిమెళ్ళ 129వ జయంతి సభ

**శ్రీ**కాకుళం జిల్లాకి చెందిన ప్రముఖ స్వతంత్ర సమరయోధుడు, రాజకీయ కవి గరిమెళ్ళ సత్యనారాయణ 129వ జయంతి సభ శ్రీకాకుళం పట్టణంలో జులై 15వ తేదీ శుక్రవారం జరిగింది. ముఖ్య వక్తగా పాల్గొన్న అంబేద్కర్ విశ్వవిద్యాలయం తెలుగు ఆచార్యులు ఉదయ్ కిరణ్ గరిమెళ్ళ సాహిత్యంలోని వివిధ పార్శ్వాలను స్పృశిస్తూ మాట్లాడారు. సామాజిక, సాంస్కృతిక, విద్యా, రాజకీయ, ఆర్థిక రంగాలపై గరిమెళ్ళ ఎంతో దూరదృష్టితో చేసిన రచనలను సోదాహరణంగా వివరించారు. రాజకీయ విలువలను పాటించడం మాతృభాష పట్ల ప్రథమ ప్రాధాన్యత, భారత్‌కు అనుగుణమైన సోషలిజం సాధించాల్సిన అవసరం వంటి అంశాలను ప్రస్తావించారు. రాజకీయాల నుంచి వస్తువును కవులూ, రచయితలూ ఎంచుకోవాలని గరిమెళ్ళ సూచించారని చెప్పారు.

ప్రియాగ్రహారంలోని గరిమెళ్ళ మెమోరియల్ ట్రస్ట్ నాయకులు ఐ గణపతి రావు మాట్లాడుతూ గరిమెళ్ళ చేసిన అశేష త్యాగాలు, వారసత్వంగా మనకిచ్చిన రాజకీయాలు ప్రస్తుత కాలపు రాజకీయ నాయకులకు ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు. గరిమెళ్ళ రచించిన 'మాకొద్దీ తెల్లదొరతనం' గేయాన్ని ఆలపించి సభికులను ఉత్తేజపరిచారు. గరిమెళ్ళ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో జరిగిన ఈ సభకు కేంద్రం అధ్యక్షులు విజికె మూర్తి అధ్యక్షత వహించారు. కార్యదర్శి ప్రభాకరరావు అతిధులకు జ్ఞాపికలను అందజేశారు. సుధాకరరావు వందన సమర్పణతో సభ ముగిసింది.

**కర్నూలులో జూలై 12న స్వాతంత్ర్య సమర యోధుడు, వహాబీ ఉద్యమంలో పాలుపంచుకున్న గులాం రసూల్ ఖాన్ 182వ వర్ధంతి సభ జరిగింది. ఎస్‌డివి అజీజ్ రచించిన గులాం రసూల్ ఖాన్ పోరాట గాథ మూడవ ముద్రణను ఈ సందర్భంగా ఆవిష్కరించారు. రసూల్ ఖాన్ జీవిత విశేషాలను వక్తలు వివరించారు.**



## కాకినాడలో గుర్రం జాషువా వర్ధంతి సభ



**24-7-2022** ఆదివారం సాయంత్రం కాకినాడ గాంధీభవన్‌లో సాహితీ స్రవంతి ఆధ్వర్యాన గుఱ్ఱం జాషువా వర్ధంతి సభ జరిగింది. సభకు రాష్ట్ర ఉపాధ్యక్షులు గనారా అధ్యక్షత వహించగా, దాడి చంద్రశేఖరరావు, శినారా (పచ్చిమాల శివనాగరాజు) వక్తలుగా పాల్గొన్నారు. సాహితీ స్రవంతి నగర అధ్యక్షులు మార్ని జానకిరామ చౌదరి అతిధులను సభకు పరిచయం చేసి, జాషువా సాహితీ జీవన రేఖల్ని క్లుప్తంగా వివరించారు. సభాధ్యక్షులు గనారా మాట్లాడుతూ, ఆనాటి సమాజంలో నెలకొన్న కుల వివక్ష కారణంగా జాషువా ఎదుర్కొన్న సామాజిక అసమానతలనూ, వ్యధలనూ తెలియజేసారు. దాడి చంద్రశేఖరరావు జాషువా రచించిన 'గబ్బిలం' ఖండకావ్యం నుంచి కొన్ని పద్యాలను సోదాహరణంగా వివరించారు. మరొక వక్త శినారా జాషువా రచించిన ఫిరదౌసి, ముంతాజ్ మహల్, శ్మశానవాటిక, క్రీస్తుచరిత్ర, బాపూజీ మొదలైన కావ్యాలను, నాటకాలను విశ్లేషిస్తూ, వాటిలోని పద్యాలను రాగయుక్తంగా ఆలపించారు. సాహితీ స్రవంతి సభ్యులు వక్తలకు ఆత్మీయ సత్కారం చేసారు. అనంతరం అద్దేపల్లి జ్యోతి అధ్యక్షతన జరిగిన కవిసమ్మేళనంలో కవులు తమ కవితలను పఠించారు. కార్యక్రమంలో మాకినీడి సూర్యభాస్కర్, గొట్టిముక్కల వేంకట నరసింహ శాస్త్రి, సావిత్రి ప్రసాద్, పద్మావతి, అవధానుల మణిబాబు, గౌరినాయుడు, దుర్గాప్రసాద్, చింతపల్లి సుబ్బారావు, చలపతి, జనార్ధన స్వామి, టి.వి.నరసింహారావు, సాలార్, ఇబ్రహీం, ఉండవిల్లి, సూర్యారావు, విష్ణు, పవన్, అచ్యుత్ పాల్గొన్నారు.

## విశాఖలో మన్యం వీరుడిపై కవితా పఠనం

**అ**ల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా 10.7.2022 ఆదివారం సాయంత్రం విశాఖపట్నంలోని అల్లూరి సీతారామరాజు విజ్ఞానకేంద్రంలో సాహితీ స్రవంతి ఆధ్వర్యాన కవితా పఠనం జరిగింది. జివిఎంసి అధికారి నల్లనయ్య, సాహిత్య ప్రముఖులు పిల్లుట్ల లక్ష్మీకాంత శర్మ, అల్లూరి విజ్ఞాన కేంద్రం బాధ్యులు వివిఎస్ పద్మనాభరాజు ముఖ్య అతిథులుగా విచ్చేసి, మాట్లడారు. అల్లూరి ఆశయ సాధన దిశగా కవులూ కళాకారులూ ఆలోచించాలని, తమ రచనల్లో సామాన్యుల శ్రేయస్సును కాంక్షించాలని అన్నారు. తరువాత సుమారు 40 మంది కవులు తమ కవితలను చదివి వినిపించారు. ఈ కార్యక్రమాన్ని సాహితీ స్రవంతి కన్వీనర్ పెంటకోట రామారావు, ఫ్రాన్సిస్, బొడ్డ కూర్మారావు, కె స్వతంత్ర కుమార్ నిర్వహించారు. జులై 15, 16, 17 తేదీల్లో కంచరపాలెం ఐటిఐల్లోనూ, జివిఎంసి పాఠశాలలోనూ అల్లూరి జయంతి సభలు జరిపారు.



**విశాఖలో సభను ఉద్దేశించి మాట్లాడుతున్న జివిఎంసి అధికారి నల్లనయ్య, హాజరైన కవులు, రచయితలు**

# సమాచారం

## జాతీయ స్థాయి జయప్రద, జమున అవార్డులు

ఏటా జాతీయ స్థాయిలో జమున స్మారక నానీల సంపుటి అవార్డు, డాక్టర్ పెళ్ళకూరు జయప్రద సోమిరెడ్డి నవలా అవార్డు ఇవ్వడం జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ సంవత్సరం కూడా2021, 2022 జులై వరకు పబ్లిష్ అయిన నానీల సంపుటులు, నవలలు రచయితల నుంచి ఆహ్వానిస్తున్నాం. పరిశీలన కోసం 30 సెప్టెంబర్ 2022 లోగా మూడేసి కాపీలు చొప్పున మాకు పంపాలి. ఉత్తమ నానీల సంపుటికి రూ.10 వేలు, ఉత్తమ నవలకు రూ.15 వేలు పురస్కారంగా అందచేస్తాం. నానీల సంపుటాలు, నవలలు 'అవ్వారు శ్రీధర్ బాబు, 23-1-57, పెండెం వారి వీధి, ఫత్తేఖాన్ పేట, నెల్లూరు -524003' చిరునామాకు పంపాలి. వివరాలకు 85001 30770 నెంబరులో సంప్రదించవచ్చు.

**- డా. పెళ్లకూరు జయప్రద సోమిరెడ్డి**

**వాసిరెడ్డి భాస్కరరావు స్మారక పురస్కారానికి**

## కవితా సంపుటాలకు ఆహ్వానం

అరసం వరంగల్ శాఖ ఏటా ఒక్కో సాహిత్య ప్రక్రియకు ఆచార్య వాసిరెడ్డి భాస్కరరావు స్మారక సాహిత్య పురస్కారం ప్రదానం చేస్తోంది. 2022 సంవత్సరానికి గానూ కవిత్వానికి ప్రదానం చేయాలని నిర్ణయించి, కవితా సంపుటాలను ఆహ్వానిస్తున్నాం. వచన, గేయ కవితా సంపుటాలు, దీర్ఘ కవితలు పంపవచ్చు. 2018 జులై 2022 జూన్ మధ్య ప్రచురించినవై ఉండాలి. మొదటి ముద్రణలు మాత్రమే పంపాలి. నాలుగు ప్రతులు పంపాలి. ప్రతులు చేరాల్సిన చివరి తేది : 31 ఆగస్టు 2022. ఎంపికైన గ్రంథకర్తకు వచ్చే అక్టోబర్‌లో హనుమకొండలో జరుగు సభలో రూ.5000 నగదు, జ్ఞాపికతో పురస్కార ప్రదానం జరుగుతుంది. పుస్తకాలు పంపాల్సిన చిరునామా : చందనాల సుమిత్ర, ఇంటి నెంబర్ 5-11- 902, హనుమాన్‌నగర్, పెగడపల్లి క్రాస్ రోడ్, హనుమకొండ- 506009. **- నిధి, పల్లేరు వీరస్వామి,**

**97010 00306, 94416 02605**

## గజల్ సంపుటుల పోటీ

శ్రీ సూర్యరాయ విద్యానంద గ్రంథాలయం సంస్థ 117వ వార్షికోత్సవం సందర్భంగా గజల్ సంపుటుల పోటీ నిర్వహిస్తున్నాం. 2001 - 2022 మధ్య వచ్చిన గజల్ సంపుటుల్లో రెండు ఉత్తమ సంపుటాలకు బహుమతి ప్రదానం ఉంటుంది. గజల్ సంపుటాలు రెండేసి కాపీల చొప్పున 30 - 8 - 2022 లోపున కింది చిరునామాకు పంపించాలి. చిరునామా : కార్యదర్శి, శ్రీ సూర్యరాయ విద్యానంద గ్రంథాలయం,పెట్రోల్ బంకు ఎదురుగా, పాత బస్టాండ్ వద్ద, పిఠాపురం - 533450.

## డాక్టర్ కె.గీతకు తెన్నేటి లత - వంశీ పురస్కారం

వంశీ స్వర్ణోత్సవాల సందర్భంగా వంశీ ఆర్ట్ థియేటర్స్ ఇంటర్నేషనల్ వారు అమెరికాలోని కాలిఫోర్నియాకి చెందిన ప్రముఖ రచయిత్రి డాక్టర్ కె.గీతామాధవి (కె.గీత)కి డా.తెన్నేటి లత - వంశీ జాతీయ పురస్కారాన్ని బహుకరించారు. 7 ఆగస్టు 2022 ఆదివారం సాయంత్రం 6 గంటలకు సుందరయ్య కళా కేంద్రంలో చలనచిత్ర నటులు తనికెళ్ల భరణి ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. తూర్పు గోదావరి జిల్లా జగ్గంపేటలో జన్మించిన డాక్టర్ కె.గీత కవయిత్రి, రచయిత్రి, సంపాదకులు, గాయని, భాషా నిపుణులు. పూర్తి పేరు గీతామాధవి. 'నెచ్చెలి' అంతర్జాల వనితా మాస పత్రిక వ్యవస్థాపకులు, సంపాదకులు. నివాసం అమెరికాలోని కాలిఫోర్నియా. అమెరికాలోని సాఫ్ట్‌వేర్ రంగంలో 'తెలుగుభాషా నిపుణురాలి'గా పనిచేస్తున్నారు. కవిత్వంలో అజంతా, దేవులపల్లి, రంజనీ కుందుర్తి, సమతా రచయితల సంఘం పురస్కారాలు పొందారు.

## డా. వేదగిరి రాంబాబు కథానికా పురస్కారం - 2022

డా.వేదగిరి రాంబాబు ప్రముఖ రచయితే కాదు, కథానికా జీవి. కథానికకు పట్టాభిషేకం చేసేందుకు ఒక ఉద్యమాన్నే నిర్మించారు. వారి కథానికా సేవకు చిన్న గుర్తింపుగా ప్రతి సంవత్సరం డా. వేదగిరి రాంబాబు కథానికా పురస్కా రాన్ని యువ రచయితలకు ఇస్తున్నాము. ఇందు నిమిత్తం 14-10- 2022 నాటికి 40 ఏళ్లు మించని రచయితల నుంచి ప్రచురించబడిన కథానికా సంపుటాలను ఆహ్వానిస్తున్నాం. ఒక్కొక్కటి ఒక కాపీ చొప్పు న 14-8-2022 లోపల అందేలా పంపించాలి. 14 -9 -2022 న విజేతని ప్రకటిస్తాం. 14 -10 - 2022న హైదరాబాదులో జరిగే డా. వేదగిరి రాంబాబు జన్మ దినోత్సవ కార్యక్రమంలో ఈ పురస్కా రం అందజేయబడుతుంది. ఆరోజున పురస్కార విజేత తప్పనిసరిగా హైదరాబాద్ వచ్చి పురస్కారం స్వీకరించాల్సి ఉంటుంది. పురస్కారంగా రూ.5000 నగదు, జ్ఞాపిక ఇవ్వబడతాయి.

పుస్తకాలు పంపాల్సిన చిరునామా : సిహెచ్. శివరామ ప్రసాద్ (వాణిశ్రీ ) , స్వగృహ అపార్టుమెంట్స్, సి బ్లాక్, ఎఫ్ 2, భాగ్యనగర్ కాలనీ, హైదరాబాద్ - 500072, సెల్ : 939008529

**- సింహప్రసాద్, హైదరాబాద్ కన్వీనర్**




గిడుగు రామమూర్తి పంతులు

(29.08.1863-22.01.1940)



మగ్దూం మొహియుద్దీన్

(04.02.1908-24.08.1969)



ఆరుద్ర

(31.08.1925-04.06.1998)




దాశరథి రంగాచార్య

(24.08.1928 - 08.06.2015)

SAHITYA PRASTHANAM ▪ SAMPUTI - 3 ▪ SANCHIKA - 11 ▪ KRISHNA ▪ August 2022
RNI NO.APTEL/2004/18396 ▪ Postal Regd. No.VJ/187/2020-22 PAGES : 68
Date of Posting : 1st & 2nd of Every Month ▪ Date of Publication : 27.07.2022


# ప్రజాశక్తి బుక్‌హౌస్ తాజా ప్రచురణలు

## సామాజిక విప్లవకారుడు పోతులూరి వీరబ్రహ్మం

సమగ్ర సాహిత్యం రచనలు























ప్రజాశక్తి బుక్‌హౌస్
9490099057

Prajasakti Printers & Publishers.P(Ltd)
SBI A/c : 35712952033
IFSC Code : SBIN0001008
Governorpet Branch, Vijayawada

9490099258

27-1-54, కారల్‌మార్క్స్ రోడ్, గవర్నర్‌పేట, విజయవాడ - 2, ఫోన్ : 0866 - 2577533
బ్రాంచీలు : విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, గుంటూరు, కాకినాడ,ఏలూరు,
విజయనగరం, ఒంగోలు, నెల్లూరు, కర్నూలు, అనంతపురం